TELANGANA RISING GLOBAL SUMMIT
రండి, వృద్ధిలో భాగం కండి!

www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

TELANGANA RISING GLOBAL SUMMIT
రండి, వృద్ధిలో భాగం కండి!

సంపుటి 28, సంచిక: 168 | సోమవారం | 08-12-2025 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00



# సాహితీ విహారి

## ఉద్యమ సాహిత్యంపై చెరగని సంతకం..

**'అమరవీరుడా! అనన్యశూరుడా!**
**అమరజీవీ భగత్‌సింగ్!**
**అందుకో మా లాల్‌సలాం**
**అందుకో మా లాల్ సలాం**

**కండబలం గుండెబలం చూపినవాడా!**
**తెల్లదొరల గుండెల గురి చూసినవాడా!**
**ఇన్‌క్విలాబ్ నినాదమందించినవాడా!**
**ఉరికొయ్యలు ముద్దాడుతు**
**నినదించినవాడా!'**



అన్న గీతంతో తెలుగునాట నలుమూలలా 'కరుణ వీరరసం' చిందిస్తున్న భగత్‌సింగ్ గీతాన్ని రాసిన కందిమళ్ల ప్రతాపరెడ్డి పేరు వినగానే స్ఫురించేది ఆయన రచించిన 'కామ్రేడ్ భగత్‌సింగ్' గ్రంథం. 'అఖిల భారత యువజన సమాఖ్య' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు నాయకత్వం వహిస్తున్న రోజుల్లో యువతరానికి ప్రేరణగా, ఉత్ప్రేరణగా నిలిచిన భగత్‌సింగ్ జీవితంపై ఒక ప్రామాణికమైన గ్రంథం రాయాలన్న పట్టుదలతో పృథ్వీసింగ్ ఆజాద్, విజయకుమార్ సిన్హా, అజయ్‌ఘోష్, శివవర్మ, యశ్‌పాల్, జయదేవ్ కపూర్, సోహన్‌సింగ్ భాక్నా, మన్మథనాథ్ గుప్తా మొదలైన విప్లవకారుల రచనలు చదివి, సోవియట్ చరిత్రకారుడు మిత్రాహన్ కృషిని పరిశీలించి, స్వాతంత్ర్యపోరాట ఘట్టాలలోని వాస్తవాల ఆధారంగా ప్రతాపరెడ్డి ఈ పుస్తకాన్ని రచించాడు. ఈ గ్రంథానికి లభించిన ఆదరణ స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరవీరులు, గదర్‌వీరగాథ, చేగువేరా జీవితం ఉద్యమం: తెలంగాణ జనరణగర్జన రావి నారాయణరెడ్డి, విప్లవసేనాని ఆరుట్ల రామచంద్రారెడ్డి, తెలంగాణ పులిబిడ్డ బద్దం ఎల్లారెడ్డి, ధర్మభిక్షం జీవితచరిత్ర మొదలైన విలువైన గ్రంథాలను రచించాడు. జీవితచరిత్రల రచనలలో ఆయన కృషికి గుర్తింపుగా పొ.శ్రీ.తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్నిచ్చి గౌరవించింది. 1935 ఫిబ్రవరి 8న నల్లగొండ జిల్లాలోని జొన్నలగడ్డగూడెంలో ఎగువ మధ్య తరగతి రైతు దంపతులైన కందిమళ్ళ రంగారెడ్డి లింగమ్మల తొలి సంతానంగా ప్రతాపరెడ్డి జన్మించాడు. బాల్యం జొన్నలగడ్డగూడెంలోనే గడిచింది. దూదేకుల లాల్ మహమ్మద్ వద్ద అక్షరాలు నేర్చుకున్నాడు. ప్రాథమిక విద్య ఊళ్ళోని ఖాన్గీ బడిలో పూర్తయింది. 1947 నాటికి ఆంధ్రమహాసభ కార్యక్రమాలు జొన్నలగడ్డగూడానికి విస్తరించాయి. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా వున్న 'బాల సంఘం'లో సభ్యత్వం తీసుకున్న ప్రతాపరెడ్డి విద్యార్థి జీవితాన్ని గడుపుతూ అజ్ఞాతంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ నాయకులకు కొరియర్‌గా పని చేశాడు. 1948లో కాంచనపల్లి చినవెంకట రామారావుతో పరిచయం ఏర్పడడంవల్ల, చదువు కోసం నల్లగొండ పట్టణానికి చేరడంతో ఆయన కార్యస్థానం నల్లగొండకు మారింది. 1952లో 'భారత కమ్యూనిస్టు పార్టీ' సభ్యత్వం తీసుకున్న కందిమళ్ళ ప్రతాపరెడ్డి గత ఏడు దశాబ్దాలుగా ఒక నిబద్ధ కమ్యూనిస్టుగా, నిజాయితీకి నిలువెత్తు సంతకంగా, ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నాడు. తెలంగాణా సాయుధపోరాట స్మృతులతో గంగినేని వెంకటేశ్వరరావు రచించిన 'ఎర్రజెండాలు' శుద్ధ ప్రతిని ప్రతాపరెడ్డి తయారు చేశాడు. ఉద్యమంలో కనుమూసిన వందలాది అమరవీరుల ఫోటోలు, వివరాలు సేకరించి 'రాలిన రత్నాలు' పేరిట ఒక బృహద్గ్రంథాన్ని రూపొందించాడు. 'వీరతెలంగాణ సాయుధ సమరం' ఒక ప్రామాణికమైన చరిత్ర గ్రంథం. అలాగే భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను కూడా గ్రంథస్థం చేశాడు. 1952 నాటికి కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నందున హైదరాబాద్ సంస్థానంలో 'పీపుల్స్ డెమొక్రటిక్ ఫోర్స్' (పి.డి.ఎఫ్.) పేరుతో పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేశారు. పార్టీ నాయకత్వం రహస్య జీవితంలో ఉంటూ, పి.డి.ఎఫ్ కార్యకర్తలు ప్రజల్లో పనిచేస్తూ ఉండేవారు. పార్టీపై నిషేధం తొలగించేదాకా ప్రతాపరెడ్డి 'కొరియర్'గా బాధ్యతలు నిర్వహించాడు. 1952 నాటి ఎన్నికల్లో పి.డి.ఎఫ్. అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొన్న కారణాన ఆయన్ని స్కూల్ నుండి తీసివేశారు. అప్పటికే ఆయన తల్లి మరణించడం వల్ల, ఆయన తండ్రి, పార్టీ కార్యక్రమాలు తగ్గించుకోమని ఒత్తిడి చేయడం వల్ల ప్రతాపరెడ్డి తమ స్వగ్రామానికి దూరంగా నల్లగొండ పట్టణంలో స్వతంత్ర జీవితాన్ని ప్రారంభించే నిర్ణయం తీసుకున్నాడు. ప్రముఖ న్యాయవాదులు కాంచనపల్లి చినవెంకట రామారావు, రాఘవరావుగార్ల వద్ద క్లర్క్‌గా పనిచేస్తూ, పార్టీ సాహిత్యాన్ని చదవడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం కొనసాగించాడు. 1952 ఎన్నికల ప్రచార సందర్భంగా పెద్దములుగు ఏరియా ప్రచారదళంలో ప్రతాపరెడ్డి, సుద్దాల హనుమంతు కలిసి పనిచేశారు. బుర్రకథలు చెప్పారు. తద్వారా సాహిత్య, సాంస్కృతిక రంగాలతో ప్రతాపరెడ్డికి సాన్నిహిత్యం ఏర్పడింది. 1954, 1957 ఎన్నికల దాకా నల్లగొండ జిల్లా పార్టీ ఆర్గనైజర్‌గా పనిచేసిన ప్రతాపరెడ్డి కొంతకాలం పాటు నల్లగొండ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 1958లో తమ కార్యస్థానాన్ని హైదరాబాద్‌కు మార్చుకొని, హైదరాబాద్ నగర కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. 1960 డిసెంబర్ 8న పార్టీ అగ్రనాయకుల సమక్షంలో ప్రతాపరెడ్డి సావిత్రిని కులాంతర, ప్రాంతాంతర, ఆదర్శ వివాహం చేసుకున్నారు. పిలారొట్టి చెంగమ్మ, మాదిరెడ్డి రంగనాధరావు దంపతులకు 1937 ఆగస్టు 17న ఐదవ సంతానంగా పుట్టిన సావిత్రికి నలుగురు అక్కలు, ఒక తమ్ముడు. మంగతాయారు (చిట్టి), గీత, లక్ష్మీ నర్సమ్మ, అమ్మణి నలుగురు అక్కలు. మాదిరెడ్డి సుబ్బారావు తమ్ముడు. ఈమె అక్క లక్ష్మీ, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి తమ్మారెడ్డి సత్యనారాయణ సతీమణి. వీరి మొత్తం కుటుంబం కులాతీత వివాహాలను చేసుకోవడమే కాకుండా, తమ కొడుకులకు, కూతుళ్ళకు, మనుమళ్ళకు, మనుమరాళ్ళకు కులాంతర, మతాంతర, ఖండాంతర వివాహాలు జరిపించి, ఒక ఆదర్శాన్ని నెలకొల్పారు. సావిత్రిప్రతాపరెడ్డి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దమ్మాయి కందిమళ్ళ భారతి, కుమారులు అజయ్, విజయ్. ప్రతాపరెడ్డి రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలకు అంకితమై క్రియాశీలంగా బాధ్యతలు నిర్వహిస్తుండగా ఒంటిచేత్తో కుటుంబ బాధ్యతలు మోస్తూ తమ పిల్లలను విద్యాధికులుగా తీర్చిదిద్దిన ఉత్తమ ఇల్లాలు సావిత్రి. కందిమళ్ళ ప్రతాపరెడ్డి, పువ్వాడ నాగేశ్వరరావు, అడపా అప్పారావు మిత్రత్రయం అపూర్వ స్నేహానికి 70 ఏండ్లు దాటింది.

1971లో యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్ సమాధి (పంజాబ్) నుండి కేరళలోని కొచ్చిన్ దాకా యువజనుల జాతా (కాగడాల ఊరేగింపు) జరిగింది. అదే సందర్భంలో 'యువజన' పత్రిక ఇరవై సంచికలలో భగత్‌సింగ్ జీవిత కథను సీరియల్‌గా వెలువరించిన ప్రతాపరెడ్డి రచన, తరువాత గ్రంథస్థమై వేలాది మందికి ప్రేరణ కల్పిస్తున్నది. 'యువజనోద్యమ ఇతిహాసంలో...' శీర్షికన భారత స్వాతంత్ర్యోద్యమంలో అచంచల దీక్షతో త్యాగాలు చేసిన యువ దేశభక్తుల జీవితాలను పరిచయం చేస్తూ ఆయన వ్యాసాలు రాశాడు. ఈ వ్యాసాలే ఆయన తొలిరచనలు. 1974 నుండి వామపక్ష సాంస్కృతికోద్యమ నిర్మాణంలో భాగం పంచుకుంటూ 'ప్రజానాట్యమండలి' పునరుద్ధరణకు ప్రతాపరెడ్డి కృషి చేశాడు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి'ని పునరుద్ధరించి, తెలుగునేల నలువైపులా సంస్థ కార్యక్రమాలను విస్తరింపజేశాడు. వేలాదిమంది ప్రజా కళాకారులను రూపొందించడంలో నల్లూరి వెంకటేశ్వర్లుతో కలిసి కందిమళ్ళ ప్రతాపరెడ్డి చేసిన అవిశ్రాంతమైన కృషి ఒక ఇతిహాసం. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధానకార్యదర్శిగానూ, తరువాత అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వహించిన ప్రతాపరెడ్డి ప్రస్తుతం ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా) ఉపాధ్యక్షుడిగానూ, తెలంగాణా అభ్యుదయ రచయితల సంఘం నాయకుడిగానూ, తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ కార్యదర్శిగానూ కొనసాగుతున్నాడు. తెలంగాణా సాయుధ పోరాటం ప్రేరణతో 1984లో 'వీర తెలంగాణ' (జనపదం) రచించాడు. ఇదొక జానపద ప్రజాకళారూపం. గొల్లసుద్దులు, ఒగ్గుకథ, బైండ్లవారి కథల బాణీల సమన్వయ సమ్మేళనంగా ప్రతాపరెడ్డి ఈ కళారూపాన్ని రూపొందించాడు. అనేక ప్రదర్శనలు పొందిన ఈ కళారూపం, నిజాం పరిపాలనా కాలం నాటి తెలంగాణా దుర్భర పరిస్థితులు, సంఘనిర్మాణం, సంఘ చైతన్యం మొదలుకొని సాయుధ పోరాటం దాకా ఇతివృత్తాన్ని తీసుకుని, తెలంగాణా మాండలిక భాషలో, చక్కని జానపద బాణీలతో సాగిన ఉత్తమ రచనగా ఇది ప్రశంసలు పొందింది. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులతో, తెలంగాణ సాయుధపోరాట యోధులతో, ప్రగతిశీల రచయితలతో, ప్రజా కళాకారులతో, సినీరంగ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగి వున్న ఉత్తమ కమ్యూనిస్టు, బహుగ్రంథకర్త ''కందిమళ్ళ ప్రతాపరెడ్డి జీవితంసాహిత్యం''పై తెలుగు అధ్యాపకురాలు వి.వింధ్యవాసినీదేవి చక్కని పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. 91 సంవత్సరాల వయస్సులోనూ 'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం' మరియు 'విప్లవాల విప్లవం(గేయవాహిని)' అనే పుస్తకాలను వెలువరించారు. అలాగే 'రాలిన రత్నాలు' అన్న అపూరూపమైన గ్రంథాన్ని పునర్ముద్రించారు. సిపిఐ శతసంవత్సర ఉత్సవాల సందర్భంగా 'విప్లవవీరులు కమ్యూనిస్టు నాయకుల జీవన రేఖలు' గ్రంథాన్ని రూపొందించారు. అలాగే ప్రతాపరెడ్డి 'బందూక్' నవలానుశీలనం పేరుతో డా॥కొండపల్లి నిహారిని ఒక విశ్లేషణ గ్రంథాన్ని రూపొందించారు. 65 సంవత్సరాల వైవాహిక జీవితాన్ని ఆదర్శవంతంగా కొనసాగిస్తున్న కామ్రేడ్ ప్రతాపరెడ్డి సావిత్రి దంపతుల జీవితం, వ్యక్తిత్వం, కార్యకర్తృత్వం నేటి తరానికి, రానున్న తరాలకు స్ఫూర్తిదాయకం.

> బహుముఖంగా విస్తరించిన సిసలైన కమ్యూనిస్టు, ఉద్యమ సాహిత్యంపై చెరగని సంతకం చేసిన కందిమళ్ల ప్రతాపరెడ్డి జీవన ప్రస్థానాన్ని ప్రస్తావించినప్పుడు, తప్పనిసరిగా ఆయన అర్ధాంగి సావిత్రి పేరును గుర్తు చేసుకొని తీరాలి. ఆయన కీర్తిసంపదలో ఆమె సహచరి మాత్రమే కాదు.. ముమ్మాటికీ 'సగభాగస్వామి' కూడా. ఎక్కడైనా... ఎప్పుడైనా ఒక రచయిత సాహిత్య జీవితంలో భార్య పాత్ర చాలా కీలకమైనది. ఆమె భూమిక వ్యక్తిగత జీవితం నుంచే కాకుండా సృజనాత్మక ప్రక్రియవరకు విస్తరించి ఉంటుంది. భర్త ఆరోగ్యాన్ని... పిల్లల సంక్షేమాన్ని కోరుకుంటూ, ఏకకాలంలో విభిన్న పాత్రను పోషించే అసాధారణ ప్రతిభ ప్రతి గృహిణికీ ఉంటుంది. అయితే, సామాజిక కార్యకర్త భర్తగా లభించినప్పుడు భారం రెట్టింపు అవుతుంది. ఆ కార్యకర్త రచయితగా మరో భిన్న రూపాన్ని ధరిస్తే, సదరు గృహిణి శారీరక, మానసిక శ్రమ వర్ణనాతీతం. అది, పది శతావధానాలకు, వంద సహస్రావధానాలకు సమానం. ఈ బాధ్యతను సావిత్రి అద్భుతంగా నిర్వహించారనడానికి ప్రతాపరెడ్డి తన జీవితాన్ని సాఫల్యం చేసుకున్న తీరే నిదర్శనం. సాహితీకారుడికి తన రచనలో ఎదుర్కొనే ఒత్తిడి, నిరాశ, విమర్శలను భరించే శక్తి భార్య నుంచే వస్తుంది. ఆమె ప్రోత్సాహం రచయితలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఈ రెండు ఆవిడలో ఉన్నాయి కాబట్టే, ప్రతాపరెడ్డి భిన్న రంగాల్లో విశ్వరూపాన్ని ప్రదర్శించగలి. రచనకు ప్రశాంతమైన వాతావరణం అవసరం. కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ, భర్తకు రచనపై దృష్టి పెట్టడానికి కావాల్సిన సమయాన్ని భార్య కల్పిస్తుంది. చాలా సార్లు భార్య స్వభావం, జీవన అనుభవాలు, సంభాషణలు రచయితకు సాహితీ వస్తువులుగా మారుతాయి. స్ఫూర్తినిస్తాయి.. కొన్ని సందర్భాల్లో భర్త రాసిన రచనలను మొదట చదివి, లోపాలు సూచించే తొలి విమర్శకురాలిగా కూడా భార్య వ్యవహరిస్తుంది. ఇది రచన నాణ్యతను మెరుగుపరచడానికి ఉపయోగపడే గీటురాయి. రచయిత తగినంత సమయాన్ని కేటాయించలేకపోయినప్పటికీ, కుటుంబాన్ని నడిపిస్తూ, సాహిత్యం సృష్టిపై దృష్టి కేంద్రీకరించేందుకు సహకరిస్తుంది. సూక్ష్మంగా చెప్పాలంటే, ఒక రచయిత సాహిత్య విజయానికి వెనుక అతని భార్య త్యాగం, సహనం, సహకారం ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఆమె లేకుండా అనేక గొప్ప సాహిత్య కృతులు పుట్టేవి కావని చెప్పవచ్చు. ఈ ఘనతను దక్కించుకున్న సావిత్రి ప్రశంసనీయురాలు... ఆమెను భర్తగా పొందిన ప్రతాపరెడ్డి ధన్యుడు. డిసెంబర్ 8న వారి 65వ వివాహ మహోత్సవ సందర్భంగా, వారి అల్లుడి రూపంలోని మిత్రుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ వ్యాసం.. మీ కోసం..


**– ఆచార్య ఎస్వీ సత్యనారాయణ**
**పూర్వ ఉపకులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**
**(సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం)**

## ఫాంటసీ రచనల చిరునామా 'హైకే'




జర్మనీలోని నాస్‌లో 1954 నవంబర్ 3న జన్మించిన హైకే ఫాంటసీ రచనలకు చిరునామాగా మారింది. భర్త ఊల్ఫ్ గాంగ్ హోల్బైయిన్‌తో కలిసి సహ రచయిత్రిగా పలు రచనలు చేసింది. బాల సాహిత్యం, ఫాంటసీ విభాగాల్లో ఆమె ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, హారర్, యూత్ లిటరేచర్‌లో ప్రముఖ రచయిత్రిగా ఉన్న ఆమె, తన భర్తతో కలిసి రాసిన పుస్తకాలు కూడా భారీగా అమ్ముడవుతున్నాయి. చిన్నతనం నుంచి ఫాంటసీ భావాలపై ఆకర్షితురాలైన ఆమె రచనల్లో విభిన్న అంశాలు కదలాడుతూ ఉంటాయి. అయితే ఎక్కు వ శాతం బాలల రచనలకు, ఫాంటసీ కతలకు ప్రాధా న్యం ఇస్తున్నది. భర్త హోల్బైయిన్‌తవో కలిసి 1982లో రాసిన 'మ్యాజిక్ మూన్' విశేష ప్రజాదరణ పొందింది. ఈ దంపతుల ఫాంటసీ ప్రపంచంలో ఇది ఒక మైలురాయి. సహరచయిత్రిగానేగాక, హైకే స్వయంగా కూడా చాలా రనచలు చేసింది. జీవం లేని విషయాల్లో జీవితం, మాయాజాలం, కథానాయకుల ప్రయాణం వంటి అంశాలు హైకే రచనల్లో ప్రముఖంగా కనిపిస్తాయి. ఆమె భాషా శైలి సరళంగా ఉంటుంది. స్పష్టమైన మనోభావాలను ప్రకటిస్తాయి. సమకాలీన విజ్ఞాన శాస్త్ర విశేషాలను కూడా జోడించడం ఆమె ప్రత్యేకత. అందుకే, పిల్లలకు, యువతీయువకులను ఆమె రచనలు ఆకట్టుకుంటాయి. వారికి సులభంగా అర్థమవుతాయి. కాగా, భర్తతో కలిసి చేసిన రచనల్లో హైకే ఎక్కువగా కథా నేపథ్యానికి ప్రాధాన్యం ఇస్తుంది. తనకంటూ ఒక గుర్తింపు సంపాదించిన హైకే జర్మన్ ఫాంటసీ సాహిత్యంపై తనదైన ముద్ర వేసింది. ఆమె రచనలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. తద్వారా ప్రపంచ ఖ్యాతిని ఆర్జించాయి. ఆమె కథన ప్రపంచం మాయాజాలంతో కూడిన బలమైన శక్తిని కలిగి ఉందని విమర్శకులు అంటారు. ఆమె రచనలు ఎవరినైనా ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళతాయి. స్పష్టమైన భావప్రవాహంతో కానీ మాయాజాలంతో నిండిన కథలు విస్మయపరుస్తాయి.

## కొత్త భాష నేర్చుకొని.. చురుగ్గా..



ప్రతి ఒక్కరిలో, ప్రత్యేకించి యువతలో మానసిక యవ్వనం అత్యవసరం. 'కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు' అని ఏనాడో చెప్పిన మహాకవి శ్రీశ్రీ మాటలను నిజం చేసేవాళ్లు సమాజంలో అడుగడుగునా కనిపిస్తారు. 'ఇప్పుడు ఇంకేమి నేర్చుకోగలుగుతాం' అంటూ నిరాశావాదాన్ని వినిపిస్తుంటారు. మారుతున్న కాలానికి అనువుగా తమను తాము మార్చుకోలేక, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేక వెనుకబడుతూ ఉంటారు. ఇక వయసు పెరుగుతున్న వారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాభై, అరవై సంవత్సరాలకు చేరుకున్న వెంటనే, సర్వం కోల్పోయినట్టు భావిస్తుంటారు. ఇక ఏమీ చేయలేమని ఒక నిర్ధారణకు వచ్చేస్తారు. అలాంటి వారు తాజా పరిశోధనలు చెప్తున్న విషయాలను ఆలకించి తీరాలి. జీవితంలో మార్పులు తెచ్చుకోవాలి. పరిశోధకుల వివరాల ప్రకారం, కొత్త భాషను నేర్చుకోవడం అనేది మానసిక యౌవనాన్ని కొనసాగించడానికి అత్యంత వేగవంతమైన మార్గం. మానవ మెదడు స్కాన్లు చూపించినట్లు పెద్దవారి మెదళ్లు కేవలం 30 రోజుల్లోనే కొత్త నాడీ సంబంధాలను ఏర్పరచి, తమను తాము తిరిగి నిర్మించుకోవడం ప్రారంభిస్తాయి. దీతో మానసిక చురుకుదనం పెరుగుతుంది. పజిల్స్ లేదా బ్రెయిన్–ట్రైనింగ్ యాప్‌లు లాగా ప్రత్యేక జ్ఞాపక నైపుణ్యాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా, భాషాభ్యాసం ఒకేసారి అనేక మెదడు ప్రాంతాలను పనిచేయిస్తుంది. పదజ్ఞానం, శబ్ద వివేకం, మనోనిబద్ధత, సమస్య పరిష్కార సామర్థ్యాలు అన్నీ కలిసి పనిచేస్తాయి. ఈ ఉద్రేకం నాడీ మార్గాలను బలపరచి, మెదడు యొక్క న్యూరో ప్లాస్టిసిటీని పెంచుతుంది. కొత్త భాష నేర్చుకుంటున్న పెద్దవారు మెరుగైన జ్ఞాపక శక్తి, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యం, అనేక పనులను ఒకేసారి నిర్వహించే ప్రతిభ చూపిస్తారు. నిరంతరంగా నెల రోజుల సాధన తర్వాత, ఎంఆర్‌ఐ స్కాన్లు మెదడులో ఎడమ, కుడి అర్ధ గోళాల మధ్య సంబంధం పెరిగిందని సూచిస్తాయి. ఇది మెదడు కొత్త సమాచారాన్ని సమర్థవంతంగా ప్రాసెస్ చేయడానికి తనను తాను పునర్వ్యవస్థీకరిస్తోందని అర్థం. ఈ రీ–ఆర్గనైజేషన్ వయసుతో వచ్చే మానసిక క్షీణతను ఆలస్యం చేయడంలో సహాయపడుతుంది. భాషాభ్యాసం భావోద్రేక మేధస్సును, సామాజిక నైపుణ్యాలను కూడా పెంపొందిస్తుంది. భిన్న సంస్కృతి సందర్భాలు, భాషా సంకేతాలు, మానసిక న్యూనతలు అర్థం చేసుకోవడం ద్వారా, అభ్యాసకులు అభిమానం, వివరాలపై శ్రద్ధ, అనుకూలన శక్తిని పెంచుకుంటారు. ఈ జ్ఞాన, భావోద్రేక లాభాలు కలసి భాషాభ్యాసాన్ని జీవితాంతం మెదడు ఆరోగ్యానికి శక్తివంతమైన సాధనంగా మారుస్తాయి. మెదడు సవాళ్లు, కొత్తతనం, అభ్యాసం పట్ల వికసిస్తుంది. ఒక కొత్త భాషను నేర్చుకోవడం కేవలం విద్యా వ్యాయామం కాదు.. మనసుకు వ్యాయామం. ఇది నాడీ సంబంధాలను నిర్మించి, జ్ఞాపకశక్తిని బలపరచి, దృష్టి కేంద్రీకరణను పెంచుతుంది. కేవలం ముప్పై రోజుల పాటు నిరంతర సాధనతోనే మీ మెదడు యువ్వనంగా, చురుకుగా, ప్రతిస్పందనాత్మకంగా మారడం ప్రారంభిస్తుంది.

## చదవాల్సిన పుస్తకం

### తెలంగాణ ఆత్మను ఆవిష్కరించిన 'కందిమళ్ల'







కందిమళ్ల ప్రతాపరెడ్డిని, తెలంగాణ ఉద్యమాలను వేరువేరుగా చూడలేం. చూడకూడదు కూడా. తెలంగాణ సాయుధ పోరాటంలో సామాన్య ప్రజలు, రైతులు, దళితులు, అణచివేతకు గురైన కూలీల తరపున నిలబడి, దోపిడీదారులకు ఎదురెడ్డి పోరాటాలు జరిపిన వీరులు, అమరుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం నేటి తరానికి ఎంతైనా ఉంది. దీనికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందిస్తూ, కందిమళ్ల ప్రతాపరెడ్డి రాసిన వ్యాసాలను మాల కట్టి అందించిన పుస్తకమే 'మరవరాని మన చరిత్ర'. ఇందులోని 23 రాజకీయ, సాంస్కృతిక వ్యాసాలు తెలంగాణ ఆత్మను ఆవిష్కరిస్తాయి. తెలంగాణ సాయుధ పోరాట ఆవశ్యకతతో మొదలుపెట్టి, ప్రత్యేక తెలంగాణ వాదం ఎందుకు వచ్చింది? రాష్ట్రం ఎందుకు విడిపోయింది? అనే వివరాలతో ముగించిన మొదటి భాగంలో ఏడు వ్యాసాలు ఉన్నాయి. తెలంగాణ పోరాటం ఫ్యూడల్ దోపిడీ, దొరల అణచివేత, వెట్టిచాకిరి వంటి వ్యవస్థలకు వ్యతిరేకంగా జరిగిన సంఘటిత ప్రజా ఉద్యమం ఈ వ్యాసాలు కళ్లకు కడతాయి. దోపిడీ యంత్రాంగాలు ఎలా పనిచేశాయి? ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన కమ్యూనిస్టుల పోరాటాలు వంటి అంశాలపై లోతైన అవగాహన కలగాలంటే, వీటిని తప్పక చదవాలి. వామపక్ష దృక్కోణంలో చరిత్ర అంటే కేవలం సంఘటనల వివరాలు కాదనేది సత్యం. ఇది వర్గ సంబంధాలు, శ్రమ, దోపిడీ, అధికారం, ప్రజల అణచివేత మధ్య అంతర్లీన సంఘర్షణలు ఎలా ఉన్నాయన్నది అర్థం చేసుకోవడడానికి ఉపయోగపడతుంది. ప్రజాస్వామ్యం, హక్కుల కోసం పోరాటం పట్ల స్పృహను పెంచుతుంది. అందుకే, తెలంగాణ పోరాట చరిత్రను కమ్యూనిస్టుగా చూసిన 'కందిమళ్ల' గొప్పగా స్పందించారు. జమిందారీ నిర్మూలన, మహిళా విముక్తి, సామూహిక భూముల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కళ్లకుకట్టారు. ఈ వ్యాసాలు ప్రజాస్వామ్య విలువలు ఎంత కఠిన పోరాటాల ద్వారా వచ్చాయో నేటి తరం గ్రహించేందుకు దోహదపడతాయి. ప్రస్తుత సామాజిక, రాజకీయ వాస్తవాలు అర్థం కావాలన్నా, ప్రస్తుత తెలంగాణ, భారత రాజకీయాలపై అవగాహన ఏర్పడాలన్నా, ముందుగా అసమానతల గురించి తెలుసుకోవాలి. భూస్వామ్య విధానాన్ని తెలుసుకోవాలి. కుల, వర్గ సంబంధాల పరిణామాన్ని పరిశీలించాలి. అవి ఎలా ఏర్పడ్డాయో అర్థం చేసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే, ముందుగా, తెలంగాణ సాయుధ పోరాటాన్ని తెలుసుకోవాలి. నాటి పోరాటాన్ని, వీరుల త్యాగాలను చూశారుకాబట్టే 'కందిమళ్ల' తెలంగాణ సాయుధ పోరాటంపై అంత ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వగలి, ఇక రెండో భాగంలోని ఏడు వ్యాసాల్లో, విప్లవోద్యమాలకు, సాంస్కృతిక కళారూపాలు ఏ విధంగా తోడ్పాటు అందించిందీ వివరించారు. ప్రజానాట్య మండలి నుంచి శాటిలైట్ టెలివిజన్ ప్రభావం వరకూ ప్రజాకళలను, నాటకాలను, సాంస్కృతిక వికాసాన్ని ప్రస్తావించారు. తర్వాత వరుసగా, గద్దర్ విప్లవాన్ని గుర్తుచేశారు... శ్రమైక శక్తుల శంఖారావాన్ని వినిపించారు. కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాలను, అవరోధాలను, అవకాశాలను వివరించారు. కమ్యూనిజాన్ని మహా విప్లవశక్తిగా ఎందుకు భాసిల్లుతున్నదో చెప్పారు. వామపక్ష భావాల వ్యాప్తిలో విద్యార్థి, యువజన సమాఖ్యలను ప్రస్తావించారు. గాంధీ, భగత్ సింగ్ వారసులెక్కడని ప్రశ్నించారు.

దార్శనికుడైన రచయిత కాబట్టే, 'నక్సల్స్ సమస్యకు చర్చల ద్వారానే పరిష్కారం' అని 1997లోనే 'కందిమళ్ల' సూచించారు. ఒకటిరెండు పర్యాయాలు జరిగిన ప్రయత్నాలు విఫలమైన వైనాన్ని మనం చూశాం. 'ఆపరేషన్ కగార్' దమనకాండను చూస్తునే ఉన్నాం. నక్సలైట్ ఉద్యమాలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విధానాన్ని రచయిత నాటి వ్యాసంలోనే స్పష్టం చేశారు. దాదాపుగా ఇప్పటికీ పార్టీ అదే పంథాను అనుసరిస్తున్నది. 'నక్సలైట్ అంశాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగానే ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం అనుకుంటున్నది. కానీ, దీనికి నాందిగా సిద్ధాంతం ఉంది. రాజకీయాలు ఉన్నాయి. ఆర్థిక సమస్యలు ఉన్నాయి. సామాజిక సమస్యలు ఉన్నాయి. ఈ నాలుగు అంశాలతో కూడుకున్నదే ఆ ఉద్యమం. అయితే, సైద్ధాంతికంగా వారు మార్క్సిజం–లెనినిజం అంటున్నారు. సమసమాజం అంటున్నారు. కనుక ఆ విషయంలో, వారితో సిపిఐకి విభేదం లేదు. రాజకీయంగా ఎత్తుగడల్లో, ఆచరణలో, అంచనా వేయడంలో మేము నక్సలైట్లతో విభేదిస్తున్నాం. ఆర్థిక, సామాజిక విషయంలో వారు చెప్పేదానితో విభేదం లేదుగానీ, వారు చెప్పే పరిష్కారాలు, ఆచరణకు సంబంధించిన విభేదాలు ఉన్నాయి' అంటారు. ఈ వివరణను అభ్యుదయ భావనలున్న మానవతావాదులంతా అంగీకరిస్తారు. అనుసరిస్తారు.

కమ్యూనిస్టుల ఐక్యతపై నేడు వామపక్ష పార్టీలన్నీ ఆలోచిస్తున్న ధోరణులు కనిపిస్తున్నాయి. ఈ అవసరాన్ని 'కందిమళ్ల' 2010లోనే 'కమ్యూనిస్టుల ఐక్యత.. నేటి కర్తవ్యం' అనే వ్యాసంలో ప్రస్తావించారు. 1952 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా వెలిగిన కమ్యూనిస్టు పార్టీ, 1957లో, దేశంలోనే మొట్టమొదటిసారి ఒక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఈ ఘనత కేరళకు దక్కుతుంది. 1962లోనూ బలంగానే ఉన్న పార్టీ 1964లో ఎందుకు చీలిపోయిందో రచయిత ఆ వ్యాసంలో వివరించారు. కనీసం 36 భాగాలుగా చీలిపోయిన వారు ఏం సాధించారని ప్రశ్నిస్తారు. ఐక్యత, విలీనానికి ఉన్న అవరోధాలను వివరిస్తారు. విలీనం ఒక్క రోజులో జరిగే ప్రక్రియ కాదని అంగీకరిస్తూనే, ఐక్యత అవసరాన్ని బలంగా చెప్తారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ఆత్మగౌరవ ఆరాటం వరకూ... విప్లవోద్యమాల ప్రస్థానం నుంచి కమ్యూనిస్టు భావజాలం వరకూ, ఎన్నో అంశాలను ప్రస్తావించిన 'కందిమళ్ల' ధన్యుడు. 'మరవరాని మన చరిత్ర' ఒక గొప్ప సమాచార భాండాగారంగా ఎప్పటికీ నిలిచిపోతుంది. తెలంగాణవాదులు... సమసమాజ ప్రేమికులు... అక్రమాలను నిరసించే మానవతావాదులు... వాస్తవ చరిత్రను తెలుసుకోవాలన్న కుతూహలం ఉన్నవారు... ఇలా, ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం ఇది.

**పుస్తకం పేరు**

**మరవరాని మన చరిత్ర (రాజకీయ సాంస్కృతిక వ్యాసాలు)**
**రచయిత: కందిమళ్ల ప్రతాపరెడ్డి**
**వెల: రూ. 200**

**ప్రతులకు**

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

## ఈ వారం కవితలు

### గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్..

ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్....
పద్దెనిమిదేళ్ళు నిండాయంటే
ఓటు హక్కును పొందాలోయ్
పనుల ఒత్తిడి ఉన్నా కానీ
ఓట్లు తప్పక వేయాలోయ్
ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్...
పార్టీ లెన్ని వచ్చిన గాని
పనిచేసే నాయకుడికీ ఓటు
వేయాలోయ్...
ఓటుకు నోటు ఎవరన్నరంటే
పొలిమేర అవతల తరమాలోయ్
ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్
మాటల గారడీ పడిపోకుండా
మహనీయుల మాటల వైపు
ఉండాలోయ్...
లాభనష్టా బేరిజు వేయాక
నిజాయితీపరులను గెలిపించాలోయ్
ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్....



**– నరేష్ జాటోత్**
**8247887267**

### సర్పంచ్‌ల వేలం పాటలు

పల్లవి: సూడు చెల్లెమ్మా సూడు చెల్లెమ్మా
పంచాయతీ ఎన్నికలు సూడు చెల్లెమ్మా


పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల జాడలేదు
సంతలోన సరుకులాగ సర్పంచ్‌ల పదవులా
యే
పోటీలోన నెగ్గినోడు సర్పంచ్ అయిపోయే
గ్రామ సర్పంచ్ అయిపోయే
పాంచ్ సాల్ సర్పంచ్ పదవి
ఏక్ బార్! దో బార్! తీన్ బార్ సర్పంచ్
బన్గయా!

వినాయకుడి లడ్డులా వేలమేస్తున్నరు
అవినీతిపరులంతా పోటీపడుతున్నరు
ఓటింగ్ లేకుండా నోట్లతో కొంటున్నరు
ప్రజాస్వామ్య పాలనను పాతరేస్తున్నరు

ఇక ముందు మన ముందు అంబానీ,
అదానీ ప్రధాని పదవినే కొంటరు
దేశ సంపదనంతా కొల్లగొడుతరు

చదువుకున్న యువతరం ఏమి జేస్తున్నది
ఊరిలోని ఓటర్లు ఎందుకు ఎదిరించరు?
ఎలక్షన్ కమిషన్ ఎక్కడ దాగున్నది
వేలంలో కొంటే ఇక ఎలక్షన్స్ ఎందుకు
ఓటు హక్కు ఎందుకు? ప్రజాస్వామ్యమెందుకు.?
ఓటు హక్కు కలిగినట్టి
ప్రతి పౌరుడు ప్రశ్నించి
ప్రజాస్వామ్య పాలనను
కాపాడగ కదలండి

**– గద్దమీది చంద్రమోహన్ గౌడ్**
**9866510399**



మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


మావోయిస్టుల కంచుకోట... కొండపల్లిలో మొబైల్ టవర్ 07

బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటింగ్‌కు.. ఎంపిలను అనుమతించాలి


సంపుటి 28, సంచిక: 168 | సోమవారం | 08-12-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## గొప్ప కార్యాలకు మహాసంకల్పం అవసరం

- జాతికోసం.. జనహితం కోసం కలలు కనాలంటే ధైర్యం ఉండాలి
- రెండేళ్ళ ప్రస్థానంలో అహర్నిశలూ అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు తపనతో శ్రమించా
- కొన ఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో ఊపిరి పోశాం
- ప్రజాప్రభుత్వం రెండేళ్లు పూర్తి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు
- నిన్నటి వరకూ ఒక్క లెక్క... గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క అని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

రెండేళ్ల ప్రస్థానంలో అను నిత్యం అహర్నిశలూ అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు తపనతో శ్రమించామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. గత పాలన శిథిలాల కింద కొన ఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశామని, రుణ భారంతో వెన్ను విరిగిన రైతుకు దన్నుగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిపామని తెలిపారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, స మానత్వం అనే మూల సిద్ధాంతంగా ముందుకు సాగుతున్నామన్నారు. 'జాతి కోసం...జన హితం కోసం..గొప్ప కలలు కనాలంటే..

తరువాయి 6లో




# గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

నేడు లాంఛనంగా ప్రారంభించనున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

- భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లు
- సదస్సుకు 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు
- ఒక్క అమెరికా నుంచే వివిధ కంపెనీలకు చెందిన 46 మంది
- రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు
- హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రచార ఏర్పాట్లు
- లైటింగ్ ప్రొజెక్షన్, 3డి ప్రొజెక్షన్ మ్యాపింగ్‌తో ప్రదర్శనలు
- 6000 మంది పోలీసులతో బందోబస్తు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవ్యాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలివస్తున్నారు. సోమవారం మధ్నాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్‌ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. సమ్మిట్‌లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా టెక్నాలజీ గ్రూప్ సిఇఒ ఎరిక్ స్వ్రడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సిఇఒ జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజా పాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం వైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు,

తరువాయి 6లో






## 25 మంది మృత్యువాత

ఆరుగురికి గాయాలు

# అగ్నికీలల్లో నైట్‌క్లబ్

- గోవాలోని బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం
- మంటల ధాటికి ఊపిరి ఆడక పలువురు మృతి
- వారాంతపు వినోదంలో... భయంకరమైన విషాదం
- అనుమతిలేని నిర్మాణాల్లో క్లబ్ నిర్వహణ
- వివరణాత్మక మేజిస్ట్రేట్ విచారణకు సిఎం సావంత్ ఆదేశం
- యజమానులపై ఎఫ్ఐఆర్
- ఘటన పట్ల రాష్ట్రపతి, ప్రధాని, పలువురు ప్రతిపక్షనేతలు దిగ్భ్రాంతి

**పనాజి :** వారాంతపు వినోదం భయంకరమైన విషాదంగా మారింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఉత్తర గోవాలోని ఒక నైట్‌క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోగా, ఆరుగురు గాయపడ్డారు. మృతులలో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బంది ఉన్నారు, మిగిలిన ఏడుగురి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పనాజీ నుండి 25 కి.మీ దూరంలో అర్పోరా వద్ద ఉన్న బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో బాధితులు చిక్కుకుపోయారు. దీంతో పలువురు ఊపిరాడక మరణించారని అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. నైట్‌క్లబ్ అక్రమ నిర్మాణమని, అయితే క్లబ్‌కు నోటీసును అందజేసిన అందజేయగా, దానిని ఉన్నతాధికారి నిలిపివేసారని గ్రామ అధికారి ఒకరు పేర్కొన్నారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించినప్పటికీ దానిని నిర్వహించడానికి అనుమతించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరి చొప్పున రూ. 5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు విచారం వ్యక్తం చేశారు. కాగా, క్లబ్ మొదటి అంతస్తులో మంటలు ప్రారంభమయ్యాయని, ఇరుకైన, చిన్న తలుపులు

తరువాయి 6లో

## రోడ్లకు అంతర్జాతీయ కంపెనీల పేర్లు

ఒఆర్ఆర్ వద్ద రావిర్యాల నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ వరకు వంద మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ 'రతన్ టాటా' అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచి వెళ్లే ప్రధాన రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'

05

## నేడు విత్తన ముసాయిదా బిల్లుల ప్రతులు దహనం

ప్రతి గ్రామంలో చేపట్టాలని ఎస్‌కెఎం పిలుపు
బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్
కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతులు ఐక్యంగా పోరాటానికి సూచన



# ఓట్లు, నోట్ల చుట్టూ రాజకీయాలు

- ప్రశ్నించే గొంతుకలను అంతమొందిస్తామనడం సిగ్గు చేటు
- మనుషుల్ని చూడనివాళ్లు గద్దె దిగాల్సిందే
- సమస్యలపై స్పందన లేకుండా సాహిత్య సృష్టి జరగదు
- నిఖిలేశ్వర్ రచనల ఆవిష్కరణ కార్యక్రమంలో జస్టిస్ బి.సుదర్శనరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓట్లు, నోట్లు, ఎన్నికలు, పార్టీలు, ఎలక్టోరల్ బాండ్స్ చుట్టూ రాజకీయాలు జరుగుతున్నాయని, ప్రజలను పట్టించుకునేవారు లేరని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి విమర్శించారు. గత మూడు రోజులుగా ఇండిగో విమానయాల సంస్థ గొడవపై కేంద్ర ప్రభుత్వం 3 రోజులు గడిచిన తర్వాత స్పందించడం వెనక రహస్యం ఏమిటో బయటపెట్టాలన్నారు. రాజకీయ దృక్పథం, సమస్యలపై స్పందన లేకుండా ఉత్తమ సాహిత్య సృష్టి ఏనాడూ జరగలేదని విశ్వసించే 'దిగంబర విప్లవ కవి నిఖిలేశ్వర్' అన్నారు. అగ్ని శ్వాసలతో కాలాన్ని అధిగమించడంతో పాటు తన రచనలతో యుగ స్వరాన్ని వినిపిస్తున్నారని అభినందించారు. రచనా రంగంలో దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా క్రియాశీలకంగా

తరువాయి 6లో

## సూడాన్‌లో ఆర్‌ఎస్‌ఎఫ్ డ్రోన్‌దాడి



33 మంది పిల్లలు సహా 50 మంది మృతి

**ఖార్టూమ్:** అంతర్యుద్ధం జరుగుతున్న సూడాన్ కోర్డోఫాన్ ప్రాంతంలోని కలోగీ పట్టణంలో శిశు పాఠశాలపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో 33 మంది పిల్లలతోపాటు మొత్తం 50 మంది మరణించారు. ఈ ప్రాంతానికి తక్షణం తరలివచ్చిన వైద్యబృందాలు, పౌరులపై కూడా దాడులు జరిగాయి. సైన్యంతో జరుగుతున్న యుద్ధంలో ఆర్‌ఎస్‌ఎఫ్ (ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్) చేసిన దాడిలో ఈ విషాద ఘటన జరిగింది. ఐక్యరాజ్యసమితి యూనిసెఫ్ సంస్థ ఈ దాడి ఘటనను తీవ్రంగా ఖండించింది. శిశుపాఠశాలపై దాడి చేయడం, పిల్లలను చంపడం అత్యంత దారుణమైన హింసాకాండ, హక్కు ల ఉల్లంఘనగా యూనిసెఫ్ పేర్కొంది. ఈ విధమైన అంతర్యుద్ధాలలో పిల్లలను

తరువాయి 12లో

## 'ఇండిగో' రీఫండ్

- రూ.610 కోట్ల మేర చెల్లింపులు
- సర్వీసుల పునరుద్ధరణ
- చర్యలకు సిఎంజి ఏర్పాటుకు నిర్ణయం




**న్యూఢిల్లీ :** రద్దయిన, ఆలస్యమైన ఇండిగో విమానాల టికెట్ల రీఫండ్‌కు సంబంధించి ఇప్పటివరకు రూ.610కోట్ల మేర చెల్లింపులు జరిగినట్లు పౌర విమానయానశాఖ ప్రకటించింది. ప్రయాణికులకు సంబంధించి శనివారం నాటికి ఆ సంస్థ దేశవ్యాప్తంగా 3,000 లగేజీలను డెలివరీ చేసిందని వెల్లడించింది. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఎటువంటి అదనపు ఫీజులు వసూలు చేయొద్దని తెలిపింది. పరిస్థితులు వేగంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నట్లు పేర్కొంది. టికెట్ల రీఫండ్ ప్రక్రియను ఆదివారం

తరువాయి 12లో

## 150 ఏళ్ల 'వందేమాతరం' నేడు పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ




- పది గంటల సమయం కేటాయింపు
- చర్చను ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోదీ
- కాంగ్రెస్ తరపున 8 మంది ఎంపిలు ప్రసంగం

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా నేడు (సోమవారం) లోక్‌సభలో జాతీయ గేయం వందేమాతరంపై ప్రత్యేక చర్చ జరగనుంది. వందేమాతరం 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఈ చర్చను మధ్యాహ్నం 12 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఈ అంశంపై సభను ఉద్దేశించి ఆయన సుదీర్ఘ ప్రసంగం

తరువాయి 12లో



# జనరల్
STATE & REGIONAL NEWS

## భారత్ సహభాగస్వామ్యంలో అంతులేని అవకాశాలు : ఇజ్రాయెల్

**జెరూసలెం:** భారత్‌–ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు చాలా పటిష్టంగా ఉన్నాయని ఇజ్రాయెల్ అధికారులు అన్నారు. భారత్‌–ఇజ్రాయెల్ మధ్య సహభాగస్వామ్యంలో అంతులేని అవకాశాలు ఉన్నాయన్నారు. భారత్– పశ్చిమాసియా–ఆర్థిక అవకాశాలకు విశాలమైన యూరప్ వేదిక (ఐఎంఇసి) ప్రాజెక్టు ఎంతో గొప్ప చొరవతో కూడిన విషయమని చెబుతూ ఇజ్రాయెల్ అధికారులు పైవిధంగా అన్నారు. సంబంధం లేని విదేశీ శక్తులు తమ తమ సరిహద్దులలో ఎలాంటి ప్రముఖపాత్ర పోషించకుండా భరోసాగా ఉండేందుకు, ఆ ప్రాంతంలో సకల కార్యకలాపాలు నిర్వహించడానికి వాటికున్న అధికారాల పునరుద్ధాటనను ప్రోత్సహించడానికి భారత్‌–ఇజ్రాయెల్ రెండూ అంతర్జాతీయంగా ఉన్న భాగస్వామ్యదేశాలతో కలిసి ఉమ్మడి కృషి చేస్తాయని, ఇజ్రాయెల్ అధికారులు అన్నారు. ''భారత్‌–ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు చాలా చాలా పటిష్టంగా ఉన్నాయి, మరింత బలోపేతం అవుతున్నాయి. 2023 సెప్టెంబరులో ఢిల్లీలో జరిగిన జి–20 సదస్సు సందర్భంగా ఈ ఐఎంఇసి ప్రాజెక్టు ఆవిర్భవించింది.

# సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన

### రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏవర్గాన్నీ విస్మరించకుండా అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. రెండేళ్ల పాలనకు ప్రజా ఆమోదం సంపూర్ణంగా ఉందని కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో రెండేళ్ల పాలనపై ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెడుతున్నాం, రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతం. ధనిక రాష్ట్రాన్ని తమ స్వార్థపూరిత నిర్ణయాలతో పదేళ్లలో దివాలా తీయించి ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రాన్ని అప్పగిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెండేళ్లలోనే సంక్షేమ రాష్ట్రంగా అభివృద్ధి దిశలో పరుగులు పెట్టిస్తున్నామన్నారు. రెండేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాడు ఉన్న అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్ది దేశానికే ఆదర్శంగా ప్రజారంజక పాలన సాగిస్తున్నాం, ఎక్కడా లేని ఎవరూ ఊహించని అభివృద్ధి సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి వాటిని దిగ్విజయంగా అమలు చేస్తున్నాం. సన్నబియ్యం ఇందిర ఇండ్లు దేశానికి దిక్సూచిగా నిలిచాయి. ఏ రంగాన్ని విస్మరించకుండా ఏ ఒక్క వర్గం నిరాదరణకు గురికాకుండా అభివృద్ధి సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రగతి రథం పరుగులు తీస్తోంది. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం. వీటిలో నాలుగు గ్యారంటీలను అమలు చేశాం. మిగిలిన రెండు గ్యారంటీలలో కొన్నింటిని పాక్షికంగా అమలు చేశాం. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ రెండు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదు. అయినా వాటిని ప్రజలకు అందించేందుకు ప్రయత్నిస్తాం. ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాం. ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

అదేవిధంగా 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీపడే లక్ష్యాలను నిర్దేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోంది.

### రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా
# మెకనైజ్‌డ్ ఆధునిక కిచెన్ ఆవిష్కరణ

### షేక్‌పేట గురుకుల పాఠశాలలో
### మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అధిక నిధులు ఖర్చు చేస్తుందని ఎస్సి, ఎస్టి దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోనే మొదటి పొగరహిత మోడల్ మెకనైజ్‌డ్ కిచెన్‌ను షేక్‌పేటలోని గురుకుల పాఠశాలలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతనంగా ప్రవేశ పెట్టిన మోడల్ కిచెన్ రాష్ట్ర సంక్షేమ రంగంలో కొత్త ప్రమాణాలను ప్రవేశపెట్టి ఒక నూతన అడుగు వేస్తోందని అన్నారు. గత ప్రభుత్వాలు విద్యను, అలాగే సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. గురుకుల విద్యార్థులు ఐఎఎస్, ఐపిఎస్, ఇంజనీర్లు, డాక్టర్లుగా ఉన్నత హోదాలో స్థిరపడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఇక నుండి గురుకుల సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి అన్ని రకాల బిల్లులను గ్రీన్ చానల్స్ లో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జీవితంలో అత్యంత ప్రాధాన్యతాంశము కేవలం చదువు ఒక్కటేనని ఆయన గుర్తు చేశారు. తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో ఎన్ని ఇబ్బందులు ఉన్నా కానీ వాటిని అధిగమిస్తూ గొప్ప స్థాయిలో స్థిరపడాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని విద్యార్థులకు హితబోధ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి నేరుగా సంక్షేమానికి రూ.60కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి కేటాయించినందుకు రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మోడల్ మోడల్ కిచెన్‌ను రాష్ట్రవ్యాప్తంగా మిగతా ఎస్సీ, ఎస్టీ, గురుకులాల్లో దశలవారీగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అధికారికంగా మొట్టమొదటిసారిగా తన నియోజకవర్గంలోనే సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. విద్య జీవితంలో ఒక మంచి మార్పుకు దోహద పడుతుందన్నారు. విద్య అనేది ఒక బలవంతమైన ఆయుధమని అభివర్ణించారు. ఎమ్మెల్యే తండ్రి శ్రీశైలం యాదవ్ షేక్‌పేట స్కూల్‌కు కావలసిన స్పోర్ట్స్ మెటీరియల్‌ను తాను సొంతంగా అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి కృష్ణా ఆదిత్య, జిల్లా అదనపు కలెక్టర్ ఖాదీరావన్ పలని, జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్ , స్టేట్ ఆఫీసర్ నిర్మల, మల్టీ జోన్ ఆఫీసర్ రజిని, జోనల్ ఆఫీసర్ లక్ష్మాంజలి, టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ సిఇఒ షేక్ పేట ప్రిన్సిపల్ బాలస్వామి, సోహం ఇంపెక్స్ కంపెనీ అధినేత ప్రకాష్, ఆక్సిఫియల్ రెటీఫ్లో టెక్నాలజీస్ కంపెనీ అధినేత భీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్ కేంద్రంగా...
# విద్యామందిర్ క్లాసెస్ ఇంటర్ విద్య

### ఐఐటి, నీట్ కోచింగ్ కేంద్రాలను ప్రారంభించిన డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలోనే భారత్‌ను అగ్రగామి దేశంగా మలిచేందుకు నిబద్ధత, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, కార్యదక్షత కలిగిన ఇంజినీర్లను, డాక్టర్లను, ఇతర రంగాల నిపుణులను అందించాలని, ఇందుకు విద్యామందిర్ క్లాసెస్ తనవంతు కృషి చేయాలని డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ జి. సతీష్ రెడ్డి సూచించారు. ఐఐటీ, జెఈఈ, నీట్ ప్రవేశపరీక్షల్లో తర్ఫీదుతో పాటు విద్యార్థులను అద్భుతమైన ఇంజినీర్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దే లక్ష్యంగా హైదరాబాద్ కేంద్రంగా విద్యాసంస్థ విద్యామందిర్ క్లాసెస్ ప్రారంభమైంది. ఈ సంస్థ హైదరాబాద్ లో సేవలు విస్తరిస్తూ మాదాపూర్, సుచిత్రల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ తో పాటు ఐఐటీ, నీట్ కోచింగ్ కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ కార్యకపాలను డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ జి. సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూవిద్యామందిర్ క్లాసెస్ అద్భుత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కేవలం ఐఐటియన్స్, డాక్టర్లను మాత్రమే కాకుండా విద్యాసంస్థలు, దేశానికి అవసరమైన వృత్తి నిపుణులను తయారు చేయాలని పిలుపునిచ్చారు. తాము చదువుకునే రోజుల్లో కేవలం ఐఐటీ రామయ్య కోచింగ్ సెంటర్ మాత్రమే విద్యానగర్‌లో ఉండేదని.... అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యామందిర్ క్లాసెస్ సిఈఓ కౌశిక్ మిశ్రా మాట్లాడుతూ ఐఐటి, జెఈఈ, నీట్, ఫౌండేషన్ లలో జాతీయ స్థాయిలోనే అగ్రశ్రేణి విద్యసంస్థగా ఉన్న విద్యామందిర్ క్లాసెస్ హైదరాబాద్ కేంద్రంగా దక్షిణ భారత దేశంలో తొలిసారిగా మాదాపూర్, సుచిత్రల్లో ఐఐటీ జేఈఈ, నీట్ తో ఇంటర్ విద్యను అందించనుందన్నారు. సింబయాసిస్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ రజనీకాంత్, జివికె రెడ్డి, విఎంసి ఉపాధ్యక్షులు ప్రతీక్ భట్టాచార్య, దక్షిణాది హెడ్ గౌస్, ఎపి, తెలంగాణ హెడ్ శైలజా, విఎంసి హైదరాబాద్ డైరెక్టర్లు గౌతమి రెడ్డి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# కెసిఆర్ పోయి.. రేవంత్‌రెడ్డి వచ్చారంతే...

### దోపిడీ పాలనలో మాత్రం మార్పేమీ లేదు
### కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ పోయి.. రేవంత్‌రెడ్డి వచ్చారంతేనని, పాలనలో, దోపిడీలో మార్పు రాలేదని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఈ రెండేళ్లలో ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే, తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 'రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన' పేరుతో ఆదివారం బిజెపి రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలతో కూడిన ఛార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రజలకు ఏం చేశారని 'ప్రజా పాలన' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదన్నారు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ వంటి హామీల గతి ఏమైందన్నారు. రాజ్యసభ సభ్యులు, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడతాం, వేటాడతామని హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో ఒక గ్యారంటీ కూడా ఈ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఇంత వరకు ఎందుకు విడుదల చేయలేదన్నారు. అర్బన్ నక్సలైట్‌లను కాంగ్రెస్ పార్టీ పోషిస్తుందన్నారు. బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అదేశిస్తే హిల్ట్ భూముల అవినీతిపై అమరణ దీక్ష చేస్తానని అన్నారు. పార్టీ ఆదేశిస్తే హిల్ట్ భూముల వాస్తవాలను బయటపెడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎంపి డి.కె.అరుణ, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల రోజే ఎపిపి రాత పరీక్షలా?

### పరీక్షలు వాయిదా వేయాలి
### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) రాత పరీక్షల నిర్వహణ తేదీపై వేలాది మంది గ్రామీణ ప్రాంత న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఈనెల 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, అదే రోజున ఎపిపి రాత పరీక్షలు నిర్వహించడంపై ఆదివారం కవిత ఎక్స్‌లో ట్వీట్ చేశారు. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టిజిఎస్‌పిఆర్‌బి) ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఈనెల 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2 : 30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఎపిపి రాత పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను జిల్లా కేంద్రాలు, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వేలాది మంది అడ్వకేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి లేదంటే, ఎపిపి రాత పరీక్షలకు హాజరు కావడానికి మాత్రమే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంత అడ్వకేట్లు తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రయాణ సమయం పట్టడం, అదే రోజున ఎన్నికలు ఉండటం వల్ల తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతున్నామని వాపోతున్నారని తెలిపారు. న్యాయవాదుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఈనెల 14న జరగాల్సిన ఎపిపి రాత పరీక్షలను వాయిదా వేసేలా టిజిఎస్‌పిఆర్‌బికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# మీ విధిని మీరే మార్చుకోండి

### దీదీ కృష్ణకుమారి ప్రేరణాత్మక ప్రసంగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మీ విధిని మీరే రూపొందించుకోడానికి సరైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రపంచ మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు సాధు వాస్వానీ మిషన్ గ్లోబల్ అధిపతి దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. దీదీ కృష్ణకుమారి హైదరాబాద్‌ను సందర్శించిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల సాధు వాస్వానీ మిషన్, హైదరాబాద్‌లోని సాధు వాస్వానీ ఇంటర్నేషన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో 'మీ విధిని రూపొందించండి మీ మార్గాన్ని ఎవరు రూపొందిస్తారు? మీరు చేస్తారు' (డిజైన్ యువర్ డెస్టిని హు షేప్స్ యువర్ పాథ్) అనే అంశంపై దీదీ కృష్ణకుమారి ప్రసంగించారు. ఆద్యంతం ఆలోచనలకు దారితీసే విధంగా ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. మన గమ్యం ముందే రాయబడింది కాదు.. మనమే ప్రతి రోజూ తీసుకునే నిర్ణయాలతో దాన్ని నిర్మించుకుంటాం అని దీదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతి చిన్న నిర్ణయం కూడా మన భవిష్యత్తు తీరు నిర్ణయిస్తుందని దీదీ కృష్ణకుమారి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఒక 'లైక్' రాకపోయినందుకు కలిగే బాధ నుంచి, ఒక కార్యక్రమానికి హాజరు కావాలా వద్దా అన్న నిర్ణయం వరకు జీవితం ఎప్పటికప్పుడు మన చేతుల్లోకి ఎన్నో ఎంపికలను అప్పగిస్తూనే ఉంటుందన్నారు. మన పరిస్థితులు మనల్ని నడపవు మనమే స్టీరింగ్ పట్టుకుంటే జీవితాన్ని నడిపించగలుగుతాం అని దీదీ గుర్తుచేశారు. ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి దీదీ కృష్ణకుమారి రెండు అలవాట్లను సూచించారు. మొదటిది..మన ఆలోచనలను క్రమంగా సంరక్షించుకోవడం. నేటి జీవన శైలిలో ఇతరులతో పోల్చుకోవడం, మన వద్ద లేనిదాన్ని కావాలనుకోవడం సహజమైపోయిందన్నారు. అయితే మనపై వచ్చే ఆరోపణలపై దృష్టి పెట్టకుండా, మనకు ఉన్న సన్నిహితుల ఆశీర్వాదాలపై కృతజ్ఞత వ్యక్తం చేసే భావనను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఆలోచన భవిష్యత్తుకు విత్తనమవుతుందని అన్నారు. మనమే జోక్యం చేసుకునే క్షణం నుంచే గమ్యం మారుతుంది అని దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. రెండో అలవాటు..సమయాన్ని, అంతర్గత శక్తిని విలువైనదిగా భావించడం. ప్రతి రోజు మన జీవితం ఒక చిన్న నౌక లాంటిది. దానిలో ఏది పడితే అది పోస్తే అది మునిగిపోతుంది అని ఉదాహరణతో వివరించారు. వేలాదిమంది హాజరైన ఈ కార్యక్రమం అత్యంత ఆసక్తికరంగా, ఇంటరాక్టివ్‌గా సాగింది. పాల్గొన్న వారు పెద్ద ఎత్తున స్పందిస్తూ దీదీ కృష్ణకుమారి సందేశాన్ని అభినందించారు. ఎంతో ప్రేరణాత్మకంగా, ఆలోచనలకు నాంది పలికిన సాయంత్రం కోసం వారు కృతజ్ఞతలు తెలిపారు.సాధు వాస్వానీ మిషన్ ఆధ్యాత్మిక, నైతిక కార్యక్రమాలతో పాటు మానవతా సేవలో విస్తృతంగా పాల్గొంటుందని పేర్కొన్నారు.జీవిత ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకోవడం, అనవసర ఆందోళనలను తగ్గించడం, రోజులో కొద్ది నిమిషాలు అయినా నిశ్శబ్దంగా మనసుతో మనమే మాట్లాడుకోవడం వంటి అలవాట్లు మనలోని అపారశక్తిని వెలికి తీస్తాయని చెప్పారు. విధి ఒక్కసారిగా రూపు దాల్చేది కాదని, క్షణం క్షణంగా, ఆలోచన ఆలోచనగా, నిర్ణయం నిర్ణయంగా తయారవుతుంది అని దీదీ కృష్ణ తన ఉపన్యాసాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మిర్చందాని, హీరా రూపానీ , హరి సాధ్వని, తరుణ్ దహిర్వేద్వాని తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రం నుంచి రూ.13లక్షల కోట్లు
# ఏ శాఖకు తీసుకొచ్చారు?

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని నిలదీసిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.13 లక్షల కోట్లు ఏ శాఖకు తీసుకువచ్చారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లెక్కలు చెప్పాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌరస్తాలో మైక్ తీసుకుని దొంగ లెక్కలు చెప్పడం సరికాదని రూ.13 లక్షల కోట్ల రూపాయలు ఎప్పుడు తెచ్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు. తెలంగాణకు రూ.13 లక్షల కోట్ల రూపాయలు వస్తే రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు అయిందని ప్రశ్నించారు. ప్రతి నెల రూ. 8వేల కోట్లను గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రజా ప్రభుత్వం కడుతున్నదని వివరించారు. రాష్ట్రం అప్పుల దిశగా వెళ్తుంటే కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలతో రాష్ట్రాన్ని రక్షించే ప్రయత్నం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు చేయలేదన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రూ.13లక్షల కోట్లు ఇస్తే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపికి డిపాజిట్ ఎందుకు పోయిందని, మంచి చేస్తున్నారని భావిస్తే బీజేపీని మూడవ స్థానంలో ప్రజలు ఎందుకు కూర్చోబెడతారని ప్రశ్నించారు. అదేవిధంగా తెలంగాణకు నిధులు ఇస్తే కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బిజెపి ఎందుకు ఓడిపోయిందో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి కేంద్ర మంత్రి అయిన కిషన్ రెడ్డి బిఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని, కెసిఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంటుంటే ఎందుకు రాష్ట్రాన్ని కాపాడలేదని నిలదీశారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుదేలైన వ్యవస్థలను రేవంత్ రెడ్డి గాడిన పెట్టి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్న చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నారన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పేరుతో రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు తేవాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు బిజెపిరాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఇందిరా పార్క్ లో ధర్నా చేయడాన్ని తప్పు పట్టారు. తెలంగాణ ప్రజలకు మంచి జరుగుతుంటే బిజెపి నేతలు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పనలు కల్పించే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టిన గ్లోబల్ సమ్మిట్ కు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ లుహాజరు కావాలని లేకుంటే తెలంగాణ ప్రజల్లో విలన్లుగా మిగిలిపోతారని అన్నారు.

# 'రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల ఖర్మ'

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం 'తెలంగాణ రాష్ట్ర ప్రజల కర్మ' అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి తన మాట మార్చుకుంటున్నారని, ముందుగా బాష మారిందని విమర్శలు వచ్చాయని, ఇప్పుడు అయితే హిల్ట్ కుంభకోణం పేరుతో ఇష్టమొచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇటీవల కెసిఆర్ ప్రజలు శిక్ష వేశారు అని చేసిన వ్యాఖ్యలపై స్పందించిన జగదీశ్ రెడ్డి, రాజకీయాల్లో గెలుపు, ఓటములు సాధారణమని అన్నారు. ఓటమి శిక్ష అయితే మీ నాయకుడు రాహుల్ గాంధీకి ప్రజలు ఎన్నో సార్లు శిక్ష విధించారు కదా? అని ప్రశ్నించారు. రెండు సంవత్సరాల కాలంలో నల్లగొండ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమి చేశారో చెప్పాలన్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించారన్నారు. ఇప్పటి వరకు వారి శవాలు వెలికితీయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. తాను విద్యుత్ శాఖలో మంత్రి అయిన సమయంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా 10 వేల మందికి ఉపాధి కల్పించానని తెలిపారు.

### అసెంబ్లీ హౌస్ కమిటీలను
# ఏర్పాటు చేయకపోవడం బాధాకరం

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మాజీ మంత్రి హరీష్ రావు లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత రెండేళ్లుగా అసెంబ్లీలో హౌస్ కమిటీలను ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమని, అసెంబ్లీ నిబంధనల ప్రకారం (రూల్ 196, 198) కమిటీలను కచ్చితంగా నియమించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పని చేయడం లేదని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ హౌస్‌కమిటీల ఏర్పాటు అంశంపైన స్పీకర్‌కు గడ్డం ప్రసాద్‌కుమార్‌కు హరీష్‌రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ రాజీనామా చేసినప్పటికీ, ఆ కమిటీని తిరిగి ఏర్పాటు చేయలేదని, డిప్యూటీ స్పీకర్ నియామకం జరగకపోవడం మరో ప్రధాన ఉల్లంఘన అని ఆ లేఖలో పేర్కొన్నారు రూల్ 8 ప్రకారం డిప్యూటీ స్పీకర్‌ను తప్పనిసరిగా ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. సభలో సభ్యుల హక్కులను పరిరక్షించే ప్రివిలేజ్ కమిటీకి డిప్యూటీ స్పీకరే చైర్మన్‌గా వ్యవహరిస్తారని, ఆ పదవి ఖాళీగా ఉండటం వల్ల కమిటీ పూర్తిగా నిర్వీర్యమైందని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోవడమే అత్యంత ఆందోళనకరమైన విషయమని హరీశ్ రావు అన్నారు.

ఫిరాయింపు పిటిషన్లపై నిర్ణీత గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, ఆ తీర్పును పట్టించుకోకపోవడం రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమేనని ఆయన తెలిపారు. తక్షణమే అసెంబ్లీ నిర్వహణలో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# వేణుగోపాల్ సవాల్‌కు కేరళ సిఎం సై

### యుడిఎఫ్ ఎంపిల పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధం

**కోళికోడ్ :** పార్లమెంటులో కేరళ ప్రతిపక్ష (యుడిఎఫ్) ఎంపిల పనితీరుపై బహిరంగ చర్చ చేసేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ విసిరిన సవాలును స్వీకరించారు. కేరళ అభివృద్ధి సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష యుడిఎఫ్ ఎంపీలు విఫలమయ్యారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. ఎన్నోసార్లు యుడిఎఫ్ ఎంపీలు పార్లమెంటులో కేరళ రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారని విమర్శించారు. దీనిపై కె.సి.వేణుగోపాల్ స్పందించి బహిరంగ చర్చకు సవాలు విసిరారు. ఈ విషయంపై ఆదివారం కోళికోడ్‌లో జరిగిన పత్రికాగోష్ఠిలో పాత్రికేయులు అడిగిన ప్రశ్నలపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, వేణుగోపాల్ సవాలును స్వీకరించి బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ''ఖచ్చితంగా...నేను బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నా, ఎక్కడ చర్చించాలో, ఏ రోజో, ముహూర్తం ఎన్ని గంటలకో వారినే నిర్ణయించుకోమనండి'' అని విజయన్ సమాధానమిచ్చారు. కేరళ రాష్ట్రం నుండి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న యుడిఎఫ్ ఎంపీల పనితీరు అసలు వేణుగోపాల్‌కు తెలుసో? లేదో? తెలుసుకోవాలనుకుంటున్నానని అన్నారు. కేరళను నాశనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి యుడిఎఫ్ ఎంపీలు మద్దతు ఇచ్చే వైఖరి అనుసరిస్తున్నారని విజయన్ విమర్శించారు. వారు చివరకు కేరళకు వ్యతిరేక వైఖరి అనుసరించాలని కేంద్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చే స్థితికి వచ్చారన్నారు. కేరళ రాష్ట్రంలో కడు పేదరికాన్ని నిర్మూలించినట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన తర్వాత కొన్ని ప్రశ్నలు పార్లమెంటులో లేవనెత్తుతూ రాష్ట్రానికి ఉన్న ''అంత్యోదయ అన్న యోజన'' పథకం కింద రేషన్ కార్డులన్నింటినీ రద్దు చేసేందుకు ప్రతిపక్ష యుడిఎఫ్ ఎంపిలు ప్రయత్నం చేశారని విమర్శించారు. ఈ పత్రికాగోష్ఠి తర్వాత వేణుగోపాల్ తిరిగి స్పందిస్తూ, యుడిఎఫ్ ఎంపీల పనితీరుపై చర్చకు తేదీ, సమయాలను ముఖ్యమంత్రే నిర్ణయించాలని, ఆ స్వేచ్ఛ ఆయనకే ఇస్తున్నామని అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

### 'ప్రజా విజయోత్సవాలు' వేడుకల్లో కలెక్టరేట్ల ముందు
## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు' వేడుకల్లో భాగంగా మంగళవారం 10 గంటలకు అన్ని జిల్లా కలెక్టరేట్లు ముందు తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణకు కావాల్సిన ఏర్పాట్లను చేయడంతోపాటు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు సంబంధించి ఫోటోలతో కూడిన నివేదికను అంజేయాలని ఆదేశించారు. అయితే ఈ ఉత్తర్వుల్లో ములుగు, నారాయణపేట, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగ, నల్గొండ జిల్లాలను ఈ కార్యక్రమం నుంచి మినహాయించారు.

### 13న ఉప్పల్ స్టేడియంలో
## లియోనల్ మెస్సి ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్

ఏర్పాట్లను పరిశీలించిన
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,
మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఈనెల 13న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీంతో జరగనున్న లియోనల్ మెస్సి ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు దేశం నలుమూలల నుంచి అభిమానులు రాబోతున్నారని ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సికి ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ ఉన్న మ్యాచ్‌కు భారీ అభిమానులు తరలిరానుండడంతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 13న మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉప్పల్ స్టేడియాన్ని పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సిఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. లియోనల్ మెస్సికి ప్రత్యేక భద్రత వ్యవస్థ ఉంటుందని, ఫ్రెండ్లీ మ్యాచ్ నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు లియోనల్ మెస్సి సైతం ఆసక్తి చూపారని డిప్యూటీ సీఎం తెలిపారు. దేశం నలుమూలల నుంచి వేలాది మంది ఫుట్‌బాల్ క్రీడాభిమానులు మ్యాచ్‌కు తరలిస్తున్న నేపథ్యంలో భద్రత, సౌకర్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్దేశించిన సమయం కంటే ముందే అభిమానులు స్టేడియంలోకి చేరుకొని వారి వారి సీట్లలో కూర్చోవాలని డిప్యూటీ సిఎంకోరారు..ఫ్రెండ్లీ మ్యాచ్ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడా అభిమానులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లను రాచకొండ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీస్, హెచ్‌సిఎ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం వచ్చి, వెళ్లే మార్గాలు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర విఐపి లు వచ్చి వెళ్లే మార్గాలను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. మొత్తంగా హాజరవుతున్న అభిమానుల సంఖ్య, సులభంగా వచ్చి వెళ్ళేందుకు ఏర్పాటుచేసిన గేట్ల సంఖ్య, పార్కింగ్ ఫుట్‌బాల్‌క్రీడా అభిమానుల కోసం మెట్రో,ఆర్‌టిసితో పాటు రవాణా సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్న రవాణా సౌకర్యాలను డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిజి విజయ్ కుమార్, రాచకొండ సి పి సుధీర్ బాబు, రోహన్ రెడ్డి, స్పోర్ట్స్ అథారటీ ఛైర్మన్ శివ సేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రహదారులకు
## అంతర్జాతీయ కంపెనీల పేర్ల నామకరణం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' నేపథ్యంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హైదరాబాద్‌లోని పలు రహదారులకు అంతర్జాతీయ కంపెనీల పేర్లను నామకరణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన పలు రహదారులకు పేర్లను మారుస్తూ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. హైదరాబాద్‌కు మరింతగా గ్లోబల్ మ్యాప్‌లో చోటు కల్పించేందుకు వీలుగా హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులకు ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు, కంపెనీల పేర్లను పెట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్‌ఆర్) వద్ద రావిర్యాలను నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేసే వంద మీటర్ల గ్రీన్‌ఫిల్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టాలని ప్రతిపాదనలను సిద్ధం చేసింది. రావిర్యాల ఇంటర్‌చేంజ్‌కు ఇప్పటికే టాటా ఇంటర్‌చేంజ్ అని పేరు పెట్టారు. ప్రపంచంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని నామకరణం చేయాలన్న ప్రతిపాదించింది. దీనికి సంబంధించి కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయనుంది.

ఢిల్లీలో ఇటీవల జరిగిన యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరమ్ (యుఎస్ఐఎస్పిఎఫ్) వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన మేరకు హైదరాబాద్‌లోని ముఖ్య రహదారులకు ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల పేర్లు పెట్టాలన్న దృష్టిలో భాగంగా మరిన్ని ప్రతిపాదనలు చేశారు. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సేవలను గుర్తిస్తూ ఒక ముఖ్య రహదారిని గూగుల్ స్ట్రీట్ అని ప్రకటించేందుకుప్రణాళికను రూపొందించారు. మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను కూడా పరిశీలిస్తున్నారు.ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితవ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు నామకరణం చేయడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వడంతో పాటు, హైదరాబాద్ కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సిఎం భావిస్తున్నారు. అలాగే ఆ రోడ్లపై ప్రయాణించివారికి కూడా స్ఫూర్తివంతంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ప్రతిపాదన సిద్ధం చేశారు.

### సోమవారం సమ్మిట్‌లో కార్యక్రమాలు ఇలా..
## మధ్యాహ్నం సెషన్లతో వేడుకలు ఆరంభం

3 గంటల నుంచి 4గంటల తొలి సాంకేతిక సెషన్లు. నాలుగు హాల్స్‌లో పరస్పరం భిన్నమైన అజెండాలు చర్చకు వస్తాయి.

**హాల్ 1 –** భవిష్యత్ ఎనర్జీ ట్రాన్సిషన్‌పై నిపుణుల చర్చ. పునరుత్పాదక శక్తి వనరులు, 2047 లక్ష్యాలు ప్రధాన అంశాలు ఉంటాయి.
**హాల్ 2 –** గ్రీన్ మొబిలిటి 2047 జీరో ఎమిషన్ వాహనాల భవిష్యత్‌పై విస్తృత విశ్లేషణ. పర్యావరణం–రవాణా రెండింటికీ లాభదాయకంగా ఎలా మార్చుకోవాలి అనే అంశంపైన చర్చ..
**హాల్ 3 –** సెమీకండక్టర్ల రంగంలో తెలంగాణ స్థానాన్ని ప్రపంచ స్థాయికి ఎలా చేర్చాలన్న దానిపై నిపుణుల ప్రసంగాలు.
**హాల్ 4 –** విద్యను ప్రపంచానికి అందించే కేంద్రంగా తెలంగాణను నిర్మించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చ.
**ఆ తర్వాత –15 నిమిషాల విరామం**
సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15గంటల వరకు వ్యూహాత్మక సెషన్ల వేగం
**హాల్ 1 –** విమానయాన–రక్షణ రంగాల్లో తెలంగాణ అడుగులు
దేశ దృష్టిని ఆకర్షించేందుకు నిపుణుల చర్చ.
**హాల్ 2 –** టాలెంట్ గ్లోబల్ మొబిలిటీ, ఉద్యోగ అవకాశాలు, భారత నైపుణ్య శక్తి అంతర్జాతీయాకరణపై చర్చ.
**హాల్ 3 –** సర్వ జనులకు అందుబాటులో ఉన్న, సమానమైన హెల్త్ కేర్ పథకాలపై దృష్టి.
**హాల్ 4 –** కొరియా–ఆస్ట్రేలియా దేశాలతో ఇండస్ట్రీ–ఇన్నోవేషన్ భాగస్వామ్యాలపై ప్రత్యేక సమావేశం.
**ఆ తర్వాత 15 నిమిషాల విరామం**
సాయంత్రం 5:30 గంటల నుంచి 6:30 గంటల వరకు : ప్రపంచ భాగస్వామ్యాలపై చర్చలు
**హాల్ 1 –** ఆసియన్ టైగర్స్ దేశాలతో తెలంగాణ భాగస్వామ్య అవకాశాలపై చర్చ.
**హాల్ 2 –** గిగ్ వర్క్‌ఫోర్స్ ఎదుగుదల, ఉద్యోగాల మార్పు, భవిష్యత్ ఉపాధిపై విశ్లేషణ.
హాల్ 3 రేర్ స్ట్రాటజీ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాలను నిపుణులు వివరిస్తారు.
**హాల్ 4 –** కెనడాతో టెక్–ఇన్నోవేషన్ భాగస్వామ్యాలు, మహిళా వ్యాపార శక్తిని పెంపొందించే చర్చలు కేంద్రంగా నిలిచాయి.
అనంతరం అతిథులకు ప్రత్యేక ఆతిథ్య విందు, సాంస్కృతిక కార్యక్రమాలతో మొదటి రోజు సమ్మిట్ ముగుస్తుంది.
**9న (మంగళవారం ) రెండో రోజు ...**
ఉదయం 10గంటల నుంచి 11:30 గంటల వరకు భవిష్యత్ తెలంగాణపై సమగ్ర చర్చలకు వేదిక.
**హాల్ 1 –** జీనోమ్ వ్యాలీని ప్రపంచంలోనే అతిపెద్ద బయో–హబ్‌గా మార్చేందుకు వ్యూహాలపై చర్చ.
**హాల్ 2 –** భవిష్యత్ ఒలింపిక్స్ కోసం తెలంగాణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహంపై చర్చ.
**హాల్ 3 –** సాంస్కృతిక వారసత్వాన్ని ఆధునిక పర్యాటక రంగంతో ఎలా మిళితం చేయాలి అనేది ప్రధాన అంశం.
**హాల్ 4 –** మూడు రెట్ల ఆర్థిక వృద్ధికి పెట్టుబడి అవకాశాల విశ్లేషణ.
**15 నిమిషాల విరామం..**
ఉదయం 11:45 గంటల నుంచి 1:15 గంటల వరకు
**హాల్ 1 –** సర్వసామాన్యులకు అందుబాటులో ఉన్న గృహాలపై పెట్టుబడులు, ప్రణాళికలు.
**హాల్ 2 –** మూసీ నది పునరుద్ధరణపై బ్లూ–గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళికలు.
**హాల్ 3 –** గ్రామీణ–పట్టణ రవాణా అనుసంధానంపైన సమగ్ర వ్యూహాలు.
**హాల్ 4 –** స్టాండ్ బై సేషన్
**మధ్యాహ్నం 1:15 గంటల నుంచి 2:15 గంటల వరకు భోజన సమయం ...**
**మధ్యాహ్నం 2:15 గంటల నుంచి 3:45గంటల వరకు**
**హాల్ 1 –** భారత్ ఫ్యూచర్ సిటీ ట్రిలియన్ డాలర్లపై చర్చ
**హాల్ 2 –** వ్యాపారం చేయడంలో సౌలభ్యం2పై చర్చ
**హాల్ 3 –** గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు
**హాల్ 4 –** ప్రజా వస్తువుల కోసం వినూత్నమైన పిపిపిలు
**అనంతరం 15 నిమిషాల పాటు విరామం**
**సాయంత్రం 4:గంటల నుంచి 5:30 గంటల వరకు రెండో రోజు కీలక సెషన్లు**
**హాల్ 1 –** ఎంటర్‌టైన్‌మెంట్, క్రియేటివ్ ఇండస్ట్రీల భవిష్యత్‌పై నిపుణుల విశ్లేషణ.
**హాల్ 2 –** ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించే విధానాలు.
హాల్ 3 పెట్టుబడులు, ఫైనాన్షియల్ హబ్ నిర్మాణం, హైఇంపాక్ట్ సెక్టర్లపై చర్చ.
**హాల్ 4 –** స్టార్టప్ పరిసరాల అభివృద్ధికి ప్రణాళికలు.
**సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు**
సాయంత్రం 6 గంటలకు – తెలంగాణ రైజింగ్ 2047
విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ
7:00 గంటలకు – డ్రోన్ షో.
7:30 నుండి – విందు సాంస్కృతిక ప్రదర్శనలు.










## తెలంగాణ దిశా దశను మార్చనున్న గ్లోబల్ సమ్మిట్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ తో తెలంగాణ రాష్ట్రం దిశ దిశ మారుతుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీర్ ఖాన్‌పేట్‌లో జరుగుతున్న సమ్మిట్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రపంచ స్థాయి సమ్మేళనంతో ప్రపంచ నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ చేరుతుందని అన్నారు.
ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్ల పాలన, 2047 లక్ష్యంగా సాగుతున్న ప్రణాళికలు తదితరాలకు ఊతమిచ్చే విధంగా పెట్టుబడులు రానున్నాయని అన్నారు ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన 150 మంది అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్ లో పాల్గొనబోతున్నారని చెప్పారు రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మేళనం కోసం విశేష రీతిలో ఏర్పాట్లు జరిగాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.
మీడియా సెంటర్ ఏర్పాటును సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్ ప్రియాంక పరిశీలించారు.

### ఎన్నికల్లో ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టినా ...
## బిఆర్ఎస్ నాయకులకు బుద్ధి రావడం లేదు

మంత్రి తుమ్మల




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి ఎన్నికలో ప్రజలు కర్ర కాల్చి వాత పెడుతున్నా బిఆర్ఎస్ నాయకులకు బుద్ధి రావడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను ఓడించండి అంటూ ప్రకటనలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నాడు వరి వేస్తే ఉరి అన్న బిఆర్ఎస్ నేతలు ఈ రోజు బోనస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వారి హాయంలో లక్ష ఋణమాఫీ చేయడానికే ఆపసోపాలు పడి వాయిదాల పద్ధతిలో ఒకసారి, ఆఖరి సంవత్సరంలో సగం మందికి కూడా చేయలేక చేతులేత్తేసిన వారు మొదటి సంవత్సరంలోనే ఒకే విడతలో రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేసిన మాకా రైతుల సంక్షేమం గురించి చెప్పేది అన్నారు . గత రెండేళ్లలో రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష కోట్లకుపైగా నిధులను చేసిందని, కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని రైతులకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాదే అన్నారు. పంట పెట్టుబడి సహాయం కింద ఏడాదికి ఎకరాకు రూ.12వేలు అందించి రైతులకు భరోసా కల్పించడమే కాకుండ దేశంలో ఎక్కడలేని విధంగా ప్రధాన పంటలన్నిటిని ఎలాంటి సీలింగ్‌లు లేకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న మన్నారు. అంతే కాకుండా సన్న వడ్లకు రూ.500 రూపాయల బోనస్‌ను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. పత్తి కొనుగోళ్లలో రాష్ట్రం పాత్ర ఎంతమాత్రం ఉండదనే విషయం తెలిసి కూడా, కొనుగోళ్లలో ప్రభుత్వంపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు కళ్లు మూస్కొని గుడ్డి లెక్కలేసిన చందంగా ఉందన్నారు.ఎఫ్‌సిఐ వరి కొనడం లేదని, దీంతో వరి సాగు వద్దని చెప్పినది కూడా బిఆర్ఎస్ కాదా, ఆ విషయాన్ని ఇప్పుడు మర్చిపోయారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతుల సంక్షేమం కోసం ఆలోచిస్తూ, అందుకు అనుగుణంగా అటు కేంద్రంతో, ఇటు అధికారులతో సమన్వయం చేసుకుంటు పనిచేస్తున్నామని తెలిపారు. గత రెండేళ్ల లో తమ ప్రభుత్వం అందిస్తున్న మద్ధతు తో రైతులు ఆయిల్ పామ్ సాగులో దేశానికే ఆదర్శంగా నిలిచారు. వరి ఉత్పత్తిలో దేశములోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టారని తెలిపారు. ఇదే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలి : ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆకాశంలో సగభాగమైనా మహిళలకు రాజకీయంతోపాటు విద్య, ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి మహిళా సంఘాల కోర్ కమిటీ సమావేశంజరిగింది. ఈ సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. మహిళా వ్యక్తిత్వ వికాసానికి విద్య ప్రధానమన్నారు. కనుక, మరో బిసి అమ్మాయిలకు మరో 100 కాలేజీలు, గురుకులాలు స్థాపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుగా గంగాపురం పద్మను నియమించారు. బిసి సంక్షేమం సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి ర్యాగ అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు గవ్వల భరత్‌కుమార్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, మోదీ రాందేవ్, సి.రాజేందర్, మహిళా నేతలు అనురాధమ్మ, దివ్య యాదవ్, దీప, సిహెచ్.పద్మ, వసంతమ్మ, జ్యోతి, అపర్ణ పాల్గొన్నారు.

### విత్తనాల ముసాయిదా బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు ప్రతులను
## నేడు అన్ని గ్రామాల్లో దహనం చేయాలి



ఎస్‌కెఎం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాఖ్య హక్కులను ఖూనీ చేసే విధంగా, ఆహార భద్రత విత్తన స్వావలంబనను దెబ్బతీసే 'కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విత్తనాల ముసాయిదా బిల్లు 2025' ప్రతులను దేశ వ్యాప్తంగా సోమవారం అన్ని గ్రామాల్లో దహనం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) రైతులకు పిలు పునిచ్చింది. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో విత్తన బిల్లు 2025ను, విద్యుత్ సవరణబిల్లు'ను దహనం చేయాలని ఎస్‌కెఎం నాయకులు పశ్యపద్మ, టి.సాగర్, విస్సాకిరణ్, ప్రభాకర్,మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, వి.మట్టయ్య, బి రాము, విజయ్ రైతులను కోరారు. భారత విత్తన రంగంపై బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని పెంచి, ఆహార భద్రత, విత్తన స్వావలంబన, రాష్ట్రాల సమాఖ్య హక్కులను బలహీనపరుస్తుందని, అందుకే విత్తన బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేటీ కరణకు వ్యతిరేకంగా రైతులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ బిల్లు అమలులోనికి వస్తే బేయర్, బిఎఎస్ఎఫ్, సిన్జంట అద్వాంత ఇండియా, కార్తైవా డిగ్రీ సైన్స్ ఇండియా, మైకో లాంటి కంపెనీలు దేశీయ విత్తన రంగాన్ని ఆధీనపరచుకుని, రైతు వ్యవసాయాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. విత్తనాల చట్టం 1966'ను రద్దు చేసి, కఠినమైన నాణ్యత నియంత్రణ, ప్రధాన తప్పులకు మాత్రమే శిక్షలతో విత్తన నియంత్రణ వ్యవస్థను ఆధునికీకరించాలనుకుంటున్న ప్రస్తుత విత్తన ముసాయిదా బిల్లును వారు ఖండించారు. ముసాయిదా బిల్లు విత్తన సరఫరాపై నియంత్రణను ఎంఎన్‌సి,కార్పొరేట్ల చేతిలో కేంద్రీకరించే ప్రమాదం ఉందని, కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం సాధించాలనుకున్న లక్ష్యాన్నే ఇది మరో మార్గంలో సాధిస్తుందన్నారు. పంటల నమూనాలను కార్పొరేట్ మార్కెట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే అవకాశం ఉన్నదని, మార్కెట్‌లో చవకగా, నాణ్యమైన విత్తనాలు సమయానికి లభిస్తాయనే హామీనిచ్చే నిబంధనలు కూడా ఇందులో పొందుపర్చలేదని, ఆహార ,రైతుల ఆర్థిక భద్రత, లాభదాయక వ్యవసాయానికి కీలకమైన అంశాన్ని ప్రభుత్వం దురదృష్టవశాత్తూ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఈ బిల్లు అధికంగా కేంద్రీకృతమైన,కార్పొరేట్ ఆధారిత నియంత్రణ వ్యవస్థను తీసుకొస్తుందని, రైతుకేంద్రిత రక్షణలను బలహీనపరచి, జీవ వైవిధ్య పరిరక్షణ,రైతుల హక్కుల ప్రస్తుత చట్టపరమైన నిర్మాణాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉన్నదని తెలిపారు. పారంపర్య విత్తనాలు, ప్రభుత్వ సంస్థలు, సాంప్రదాయ విత్తన వ్యవస్థలు పక్కన పడే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

సెక్షన్ 17(8) ప్రకారం మెరిట్ ఆధారిత, పారదర్శక కేంద్ర అక్రెడిటేషన్ వ్యవస్థ ఏర్పడుతుందని, ఒకసారి కంపెనీకి కేంద్ర గుర్తింపు లభిస్తే, అది అన్ని రాష్ట్రాలలో ఆటోమేటిక్‌గా నమోదవుతుందన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చిన సందర్భాలు తప్ప రాష్ట్రాలు ఆ కంపెనీని తిరస్కరించలేవని వివరించారు. తద్వారా బహుళ రాష్ట్రాల్లో పనిచేసే ప్రైవేట్ కంపెనీలకు వేగవంతమైన మార్గం లభిస్తుందని, కానీ ప్రభుత్వ సంస్థలకు అలాంటి ప్రయోజనం లేదని, ఇది రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను బలహీనపరుస్తూ సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని అన్నారు.

సెక్షన్ 33(2) నమోదు కాని జాతులను ప్రయోగాల కోసం దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తుందని, సెక్షన్ 16(3) విదేశీ విత్తన నాణ్యత,గుణగణాల గుర్తింపు(విసియు) పరీక్షా కేంద్రాలను అంగీకరించి గుర్తిస్తుందని, తద్వారా విదేశీ కంపెనీలు తమ కొత్త విత్తనాలను భారతీయ పరీక్షా వ్యవస్థను తప్పించుకుని వేగంగా తీసుకురావచ్చని వివరించారు.

**అత్యవసర పరిస్థితుల్లోనే ధరల నియంత్రణ**

క్లాజ్ 22 ప్రకారం కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ధరలను నియంత్రించవచ్చని, అయితే అత్యవసర పరిస్థితి, అసాధారణ ధర పెరుగుదల, వంటి పదాలకు ఖచ్చితమైన నిర్వచనాలు లేవని, దీంతో ప్రైవేట్ కంపెనీల అధిక ధరలు నియంత్రణలోకి రాకపోవచ్చని ఎస్‌కెఎం నాయకులు పశ్యపద్మ, టి.సాగర్, విస్సాకిరణ్, ప్రభాకర్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, వి.మట్టయ్య, బి రాము, విజయ్ తెలిపారు. ప్రతి విత్తన జాతి మాత్రమే కాకుండా క్లోన్లు, కట్టింగ్స్, ట్యూబర్లు, బల్బులు, టిష్యూకల్చర్ మొక్కలు, నర్సరీ మొక్కలు అన్నీ తప్పనిసరి రిజిస్ట్రేషన్ పరిధిలోకి తీసుకొస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యాన శాఖ వద్ద దీని కోసం అవసరమైన ప్రయోగశాలలు, ప్రమాణీకృత పరీక్షా విధానాలు, మౌలిక సదుపాయాలు లేవని, కానీ ప్రైవేట్ నర్సరీలు, పెద్ద కంపెనీలకు ఈ వనరులు కలిగి ఉండటంతో మార్కెట్‌ను ఆధిపత్యం చేసే అవకాశం ఉన్నదని, ఇదే సమయంలో, విదేశీ మొక్కల జాతులు అక్రమంగా దేశంలోకి రావడం పెరుగుతోందని, తద్వారా క్వారంటైన్ సమస్యలకు దారితీస్తుందని అన్నారు. జీవ వైవిధ్యం, మొక్కల రకాలు రైతుల రక్షణకు సంబంధించి, డిజిటల్ సీక్వెన్స్ సమాచారం పై అంతర్జాతీయ వేదికల్లో భారత్ జీవ వైవిధ్య వనరులపై న్యాయమైన లాభం కోసం కీలక చర్చలలో పాల్గొంటుందని, అలాంటి సమయంలో దేశీయ జన్యు వనరులపై హక్కులను బలహీనపరచే ఏ చట్టం కూడా భారతదేశ అంతర్జాతీయ చర్చా శక్తిని తగ్గిస్తుందని, అందుకే ప్రజా రంగ సంస్థల ద్వారా బలమైన, బాధ్యతాయుతమైన వనరుల పరిపాలన అవసరమని వివరించారు. సమాఖ్య హక్కులు,విత్తన స్వావలంబనను కాపాడేందుకు గ్రామాల్లో బిల్లు ప్రతులను దహనం చేయాలని పిలుపునిచ్చింది.



# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్–రష్యా పరస్పర దాడులు

**కీవ్:** ఉక్రేన్‌పై రష్యా వరుస దాడులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా తమ భూభాగాలపై ఉక్రేన్ డ్రోన్ల దాడులు చేస్తోందని రష్యా సైన్యం ప్రకటనలు చేస్తోంది.సెంట్రల్ ఉక్రేన్‌లోని మేజర్ ఇండస్ట్రియల్ హబ్‌పై ఆదివారం తెల్లారకముందే మళ్ళీ డ్రోన్లు,క్షిపణి దాడులు జరిగాయని, మృతులసంఖ్య తెలియరాలేదని క్రెమెన్‌చుక్ మేయర్ విటాలీ మాలెట్స్కీ చెప్పారు. ఈ ప్రాంతంపై రష్యాపదేపదే సామూహిక దాడులు చేస్తోందని అయినాగానీ తమ ప్రాంతం వాటిని తట్టుకుని నిలబడుతోందని అన్నారు. ఎంత నష్టం జరిగిందో ఇంకా తెలియలేదని, విద్యుత్, నీటి సరఫరా సమస్యలు బాగా పెరిగిపోయాయనీ చెప్పారు. కాగా సరిహద్దుల్లోని రష్యా భూభాగాలపై ఉక్రేన్ అనేక ప్రాంతాల్లో దాడులు చేసిందని, 77 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేశామని రష్యాసైన్యం ప్రకటించింది. ఒకవైపు సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరు దేశాలమధ్యా గగనతల దాడులు విరామంలేకుండా కొనసాగుతున్నాయి.

## విషాదఛాయల మధ్య
# హాంగ్‌కాంగ్ రీజియన్‌లో పోలింగ్

**తమర్:** ప్రపంచాన్ని కలవరపెట్టిన భయంకరమైన అగ్ని ప్రమాద ఘటన జరిగిన రెండు వారాల తర్వాత హాంగ్ కాంగ్ రీజియన్ (చైనా ప్రత్యేక పరిపాలనాప్రాంతం) చట్టసభకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. శాసనమండలి సభ్యులను ఎన్నుకోవడానికి నిన్నటివరకూ జరిగిన ప్రచారంలో అభ్యర్థులందరూ తాము చైనాపట్ల ఎంతో విధేయతతో ఉంటామని పోటాపోటీగా ప్రచారం చేశారు. ఐతే అగ్ని ప్రమాద ఘటన జరిగిన తర్వాత మృతులకు సంతాపసూచకంగా, సంతాప దినాలు పాటిస్తూ అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలను నిలిపివేశారు. చాలామంది ప్రజలు ఈ అగ్నిప్రమాద ఘటన తర్వాత ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం ఈ ఘటనకు జవాబుదారీ వహించాలని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నాటికి 20 శాతం పోలింగ్ మాత్రమే జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటల వరకూ పోలింగ్ కొనసాగదుతుంది. హాంగ్‌కాంగ్ రీజియన్ శాసనమండలిలో మొత్తం 90 స్థానాలు ఉండగా, 161 మంది




పైగా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 2021 తర్వాత రెండోసారి హాంగ్‌కాంగ్ రీజియన్ ప్రజలు కొత్త శాసనమండలి ఎన్నికకు పోలింగ్ పూర్తి చేశారు. 2021లో 30 శాతం ఓటింగ్ జరిగింది. ''ఒక బాధ్యతగల పౌరుడుగా నా విధి నేను నిర్వహించాను, ఓటు వేశాను, ఎవరు గెలుస్తారో, ఎవరు సమర్థవంతంగా పనిచేశారో చెప్పలేనుగానీ, వృద్ధులకోసం పాటుపడే అభ్యర్థికే నేను ఓటు వేశా'' అని పోలింగ్ కేంద్రం వ ద్ద ఓటరు–పదవీ విరమణ చేసిన క్వాన్ లామ్ చెప్పారు. కాగా ఒక అరుదైన ఘటన ఏమిటంటే ఈ ఎన్నికలకు ము ందుగా చైనా ప్ర భుత్వం స్థానిక జ ర్నలిస్టులను, విదేశీ జర్నలిస్టులను స మావేశపరచి చట్టాలకు లోబడి వ్యవహరించాలని ముం దస్తు హెచ్చరిక చేసింది. చైనాకు విధేయులైన అభ్యర్థులు మాత్రమే ఈ ఎన్నికల్లో దాదాపు పోటీ చేశారు. 2019లో హాంగ్‌కాంగ్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. దీంతో తీవ్ర అణచివేత చర్యలు జరిగాయి. అప్పటినుండీ ప్రజాస్వామ్య అనుకూల మద్దతుదారులు ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంటున్నారు. నగరంలో 40.10 లక్షలమంది ఓటర్లు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2021లో ఎన్నికల వ్యవస్థలో మార్పులు చేసిన తర్వాత మొత్తం 90 శాసనమండలి స్థానాలకుగాను 40 మమందిని చైనా అనుకూల ఎన్నికలకమిటీ ఎన్నుకుంటుంది. 20 మంది సభ్యులను ప్రజలు ఎన్నుకుంటారు. మరో 30 మంది వివిధ గ్రూపులనుండి ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిలో పరిశ్రమలు,ఫైనాన్స్, హెల్త్‌కేర్,రియల్ ఎస్టేట్ రంగాలకు చెందినవారు ఉంటారు. గతనెలలో థాయ్ పో జిల్లాలో ఏడు ఆకాశహర్మ్యాలు మంటల్లో దగ్ధమైన 161 మంది సజీవ దహనమైన ఘటనలో ప్రజలు ఇప్పటికీ మృతులకు నివాళులు అర్పిస్తూ ఆవేదన చెందుతున్న తరుణంలో ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఘటన తర్వాత అధికారులు ఈ ఆకాశహర్మ్యాల నుండి బ్రతికి బయటపడినవారికి సకల సదుపాయాలు సమకూర్చి వారి మెప్పు పొందేందుకు ప్రయత్నాలు చేశారు.అనేకమందిడవలపర్స్‌ను, అనుమానితులను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

## బెనిన్‌లో సైనిక తిరుగుబాటు యత్నం విఫలం



**బెనిన్:**పశ్చిమ ఆఫ్రికాదేశం బెనిన్(పూర్వపు దహోమీ రా జ్యం)లో సైనిక తిరుగుబాటు జరిగిందని వార్తలు వెలువడ్డా యి. కానీ ప్రభుత్వం దానిని ఖండించింది. దేశాధ్యక్షుడు ప్యా ట్రిస్ టాలోన్‌ను పదవీచ్యుతుణ్ణి చేసి అధికారం చేజిక్కించుకున్నట్లు సైన్యం జాతీయ టెలివిజన్‌లో ఆదివారం మధ్యాహ్నం ప్రకటించింది. రాజ్యాంగాన్ని స్తంభింపజేశామని, సరిహద్దులు, గగనతలం మూసివేశామనిసైన్యంప్రకటించింది. ఐతే ఈ విషయంలో వివాదాస్పదమైన వార్తలు వెలువడ్డాయి. ఆదివారం ఉదయమే సైన్యం తిరుగుబాటు ప్రయత్నం చేసిందని, కానీ ఈ తిరుగుబాటు విఫలమైందని, దేశాధ్యక్షుడు టాలోన్ సురక్షితంగాఉన్నారని, తిరుగుబాటు చేసిన చిన్న సైనిక బృందానికి సాధారణ సైన్యం మద్దతు లేదని, తిరిగి దేశాన్ని సైన్యం నుండి విముక్తిచేసి స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోందని వార్తలు వెలువడ్డాయి. కానీ దేశాధ్యక్షుడు ఎక్కడ ఉన్నదీ ఆచూకీ తెలియరాలేదు. ''పరిస్థితిఅదుపులోఉంది,మెజారిటీసైన్యం,సాధారణ సైన్యం ప్రభుత్వ అధీనంలో ఉంది, దేశాధ్యక్షుడు సురక్షితంగా ఉన్నారు, పరిస్థితులను తిరిగి అదుపులోకి తెచ్చుకుంటున్నాం'' అని విదేశీమంత్రి షగన్ అడ్జాబీ బకరీ రాయిటర్స్ వార్తా సంస్థకు చెప్పారు. కానీ సైనిక నాయకులు జాతీయ టెలివిజన్‌లో ప్రత్యక్షమై దేశాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. కాగా బెనిన్‌లో ఉన్న ఫ్రాన్స్ దేశ రాయబార కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, అధ్యక్ష భవనం సమీపంలో సైనికులు కాల్పులు జరిపారు. కోటోనౌ ప్రధాన నగరంలో అధ్యక్షుడి భవంతి ఉంది. కాగా పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక అధికారి ఎఎఫ్‌పి న్యూస్ ఏజన్సీతో మాట్లాడుతూ ''ఈ సైనికబృందం చాలా చిన్న గ్రూపు, ఒక్క టెలివిజన్ మాత్రమే వారి అధీనంలోకి వెళ్ళింది, మిగిలిన దేశం, అధ్యక్ష భవనం అన్నీ సురక్షితంగా ఉన్నాయి'' అని చెప్పారు.

## వలస బోటు బోల్తా : 18 మంది మృతి



**ఏథెన్స్:**గ్రీసు తీరంలో వలస ప్రజలతో వెళుతున్న బోటు మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 18 మంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం. ఈ మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. రక్షించినవారిలో ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. మధ్యధరా సముద్రంలో క్రీట్ ద్వీపం వద్ద ఈ దుర్ఘటన జరిగిందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. తీర ప్రాంత గస్తీ దళాలకు చెందిన నౌకలు జాడతెలియనివారికోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ బోటు కిక్కిరిసిపోయి ప్రయాణం చేస్తున్నందువల్ల బరువువల్ల బోటు మునిగిపోయింది. యూరోపియన్ యూనియన్ బోర్డరు ఏజన్సీ కూడా హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. 2023 జూన్‌లో దక్షిణ గ్రీస్‌లో ఒక చేపల పడవ మునిగిపోయిన ఘటనలో వందలమంది మరణించారు. ఆ తర్వాత ఇంతపెద్దస్థాయిలో వలసబోటు ప్రమాదం జరగడం ఈ ప్రాంతంలో మళ్ళీ ఇదే.

# ఎన్నికలవేళ బంగ్లాదేశ్ జర్నలిస్టుల్లో భయాందోళన

## లైంగిక దాడుల భయం : కొత్త నివేదిక వెల్లడి

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు, బహిరంగసభలు, రాజకీయపార్టీ ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఆ దేశ జర్నలిస్టులలో భయాందోళన పెరుగుతోంది. 13వ జాతీయ పార్లమెంటుకు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వార్తల కవరేజ్‌లో అన్ని విధాలుగానూ తమపై దాడులు పెరుగుతాయని 89 శాతం జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారని ఒక అధ్యయన నివేదిక వెల్లడించింది. 90 శాతం వేధింపులు, హింస, బెదిరింపులు రాజకీయ వర్గాల నుండే వస్తాయని అధ్యయనంలో జర్నలిస్టులు తెలియజేశారు. చట్లపరమైన భద్రతా సంస్థలనుండి, మతఛాంధసవాద శక్తుల నుండి కూడా ఈ బెదిరింపులు వస్తాయని జర్నలిస్టులు తెలియజేశారు.''ఎక్కువ అపాయం,తక్కువ సన్నద్ధతఃబంగ్లాదేశ్–2026ఎన్నికల్లో జర్నలిస్టుల భద్రత''అనేఅంశంపై ఈఅధ్యయనం చేశారు. ''సాంకేతిక యుగంలో జర్నలిస్టుల భద్రత,సాంకేతికపరమైన భద్రత'' అనే పేరుగల సంస్థ స్వీడన్ ఫోజో మీడియా సంస్థ,స్వీడిష్ ఇంటర్నేషనల్ డవలప్‌మెంట్ కో–అపరేషన్ ఏజన్సీల సంయుక్త సహకారంతో ఈ అధ్యయనం చేసి శనివారం నివేదిక విడుదల చేసింది. ''డైలీ స్టార్'' పత్రిక కార్యాలయంలో ఈ నివేదికను విడుదల చేసిన సందర్భంగా జరిగిన సభలో పలువురు సంపాదకులు, సీనియర్ మేనేజర్లు ప్రసంగించారు. ''డిజిటల్లీ రైట్'' సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిరాజ్ అహ్మద్ చౌధురి ఈ సందర్భంగా మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లోని 19 జిల్లాలలో 201మంది సీనియర్ జర్నలిస్టులను చాలా లోతుగా ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ విషయాలు వెల్లడయ్యాయన్నారు.దేశ రాజకీయాలలో చాలా తీవ్రమైన విభజన ఏర్పడిందని,ఈ పరిస్థితుల్లో జర్నలిస్టులపై భౌతికదాడులకు అ తీతంగా అనేక రకాలుగా దాడులు జరుగుతాయన్న భయాందోళన వ్యక్తం చేసినట్లు చౌధురి చెప్పారు. తీవ్రమైన,పరుషమైనపదజాలంతో తిట్లు ఎదుర్కొనే ప్ర మాదం ఉందని 76శాతం జర్నలిస్టులు అధ్యయనంలో పేర్కొన్నా రు. 71 శాతం జర్నలిస్టులు తమను భయపెట్టి బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ఐతే ఈ అధ్యయనంలో ప్రత్యేకాంశం ఏమిటంటే యాభైశాతం మహిళా జర్నలిస్టులు తమను లైంగికంగా బెదిరించి భ యపెట్టే ప్రమాదం ఉందని చెప్పగా, 40 శాతం మహిళా జర్నలిస్టులు తమపై లైంగిక దాడులు జరిగే ప్రమాదం ఉండవచ్చునని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ వేధింపులపై ఈ అధ్యయనం ముందస్తు హెచ్చరిక చేసింది. త మను తమ న్యూస్ రూమ్‌లను లక్ష్యంగా చేసుకుని డిజిటల్ మార్గాలలో దుష్ప్రచారం చేసే అవకాశాలు ఉన్నాయిని 75శాతంజర్నలిస్టులు అభిప్రాయంవ్యక్తం చేయగా, తమ వార్తలను హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉందని 65 శాతంజర్నలిస్టులుఅధ్యయనబృందాలకు తెలియజేశారు.

**అనర్హులు జర్నలిస్టులుగా తిరుగుతున్నారు**

అనేకమంది అనర్హులు జర్నలిస్టులమని చెప్పుకుంటూ తిరుగుతున్నారని, పత్రికలు నడుపుతున్నారని ''ఢాకా ట్రిబ్యునల్'' సంపాదకుడు రియాజ్ అహ్మద్ విమర్శించారు. జర్నలిస్టులకు బెదిరింపులపై అధ్యయన నివేదికను విడుదల సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, జర్నలిజం తెలియనివారు, అనర్హులు టివి స్టేషన్లు నడుపుతున్నారని, పత్రికలు పెట్టి వార్తలు ప్రచురిస్తూ జర్నలిస్టులుగాచలామణీఅవుతున్నారనివిమర్శించారు.చాలామంది మీడియా యజమానులు జర్నలిస్టుల భద్రత గురించి ఎక్కడా ఆరా తీయడంలేదనీ, సమస్యను పట్టించుకోవడం లేదని, అధ్యయనం చేయడం లేదని విమర్శించారు. జర్నలిస్టులు తమను తాము సంస్కరించుకోవాలని, ఇందుకోసం ఒక స్వీయ విప్లవం సాధించాలని సూచించారు.

## జమాతే ఇస్లామీ సంఘ వ్యతిరేక శక్తి : విజయన్

**కోళిఖోడ్:** జమాతే ఇస్లామీ (జమాత్–ఎ–ఇస్లామీ) సంస్థపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ సంస్థకు చెందిన యువజన విభాగం ''సాలిడారిటీ యూత్ మూమెంట్‌ను అతిపెద్ద సంఘ వ్యతిరేకశక్తిగా పేర్కొన్నారు. ఒకప్పుడు సిపిఐ(ఎం) కార్యాలయంలో జమాతే ఇస్లామీ సంస్థ నాయకులు తనను కలిసిన మాట నిజమేనని నిర్ధారిస్తూ, వారు సంఘ వ్యతిరేక శక్తులని వారి మొఖంమీదే నిక్కచ్చిగా తెలియజేశానని చెప్పారు. కోళిఖోడ్‌లో పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. ఎల్‌డిఎఫ్–సిపిఐ(ఎం) కలిసి సమావేశాలు నిర్వహించాయని, ఈ ఎన్నికల్లో వారికి జమాతే ఇస్లామీ మద్దతు ఇస్తోందని యుడిఎఫ్ విమర్శించడంతో దీనిపై విజయన్ వివరణ ఇచ్చారు. జమాతే సంస్థ నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు గతంలో తాను సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో కలిసిన మాట నిజమేనని ముఖ్యమంత్రి నిర్ధారించారు. ఐతే వారికి ప్రవర్తనను తాను సమర్థించలేదని, వారి ప్రవర్తన మంచిదని వారికి ఎలాంటి యోగ్యతాపత్రం ఇవ్వలేదన్నారు. ''వారు నన్ను కలుసుకునే అవకాశం ఇవ్వమని అడిగారు, అందువల్ల వారు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. కానీ నేను వారి ప్రవర్తనను సమర్థించలేదు, తనతో జరిపిన సమావేశంలో ఆ నాయకులు తమ వైఖరిని వివరించేందుకు, నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేశారు, ఈ సమావేశంలో సాలిడారిటీ యూత్ మూమెంట్ నాయకులు కూడా హాజరయ్యారు. ఆ నాయకులను వారు నాకు పరిచయం చేసినప్పుడు నేను వారి ముఖం మీదే ఖచ్చితంగా చెప్పాను,'వారుఇప్పుడుఅతిపెద్దసంఘ వ్యతిరేకశక్తులు' అని చెప్పాను, అందుకు ఆ నాయకులు నివ్వెరపోయారు'' అని విజయన్ వివరణ ఇచ్చారు. జమాతే ఇస్లామీని ముఖ్యమంత్రి ఎప్పుడూ ఒక మతోన్మాద గ్రూపుగా విమర్శిస్తారు.

## మహాసంకల్పం అవసరం

(మూడవ పేజీ తరువాయి)

ధైర్యం ఉండాలి...గొప్ప కార్యాలు చేయాలంటే....మహా సంకల్పం కావాలి... సరిగ్గా రెండేళ్ల క్రితం నాకు ఆ ధైర్యం ఇచ్చి...తమ ఓటుతో గెలుపు సంకల్పాన్ని ఇచ్చి...నిండు మనస్సుతో ఆశీర్వదించిన తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలకు' సిఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక ధన్య వాదాలు తెలిపారు. ఆదివారం సిఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటనలో రెండేళ్ల ప్రజా పాలన విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్ధతు ఇచ్చి అదానీ, అంబానీల తరహా వ్యాపార రంగంలో నిలిపామని, బలహీనవర్గాల వందేళ్ల ఆకాంక్షలను కుల లెక్కలతో కొత్త మలుపులు తిప్పామని,వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకత చేశామని వివరించారు. విద్య ఒక్కటే బతుకు దెరువుకు బ్రహ్మాస్త్రమని, అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశామని,స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టామని సిఎం వివరించారు. 'జయ జయహే తెలంగాణ' అన్న ప్రజాకవి అందెశ్రీ గేయానికి, జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపునిచ్చామన్నారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500లకే గ్యాస్, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, కోటి మంది ఆడ బిడ్డలను కోటీ శ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ తమ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు అని సిఎం అన్నారు.

నేటి అవసరాలను తీర్చి, పేదల సంక్షేమాన్ని కూర్చి ,ఇదే అద్భుతమని, తాము సరిపెట్ట లేదని, స్వతంత్ర్య భారత ప్రయాణం వందేళ్ల మైలురాయికి చేరే సందర్భం 2047 నాటికి తెలంగాణ లా ఉండాలి?, ఎక్కడ ఉండాలో లోతైన మథనంతో మార్గదర్శక పత్రం సిద్ధం చేశామన్నారు.

### భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క

భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్కలాంటిదని సిఎం అభివర్ణించారు. 'నిన్నటి వరకు ఒక లెక్క, రేపటి తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క' అని అన్నారు. ఇందుకు ప్రజల ఆశీర్వాదమే తన ఆయుధమని,ప్రజల ప్రేమాభిమానాలే తనకు సర్వం అని, ప్రజల సహకారమే తనకు సమస్తమని, తెలంగాణ తనకు తోడుగా ఉన్నంత వరకు, తన గొంతులో ఊపిరి ఉన్నంత వరకు తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదని సిఎం స్పష్టం చేశారు. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు తాము ప్రాణం పోశామని, ప్రపంచ వేదిక పై తెలంగాణ రైజింగ్ రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, భారత దేశ గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణను మార్చేందుకు సర్వం సిద్ధం చేశామని సిఎం అన్నారు.

## రాజకీయాలు

(మూడవ పేజీ తరువాయి)

రాణిస్తున్నారని కొనియాడారు. నిఖిలేశ్వర్ రచనల ఆవిష్కరణ కార్యక్రమం అంబర్‌పేట్‌లోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ బి.సుదర్శనరెడ్డి 'నిఖిలేశ్వర్ రచించిన 'ఎక్కడికీ గమనం? ఎంత దూరమీ గమ్యం?, ఎవరిదీ ప్రజాస్వామ్యం? ఏ విలువలకీ ప్రస్థానం?, గోడల వెనక(జైలు జ్ఞాపకాలు)' అనే మూడు రచనలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నిఖిలేశ్వర్ తన రచనల్లో స్ఫూర్తిదాయకమైన సాహిత్య సృజన కొనసాగిస్తూ ఉండటం చాలా అభినందనీయమని, ముఖ్యంగా తాను ఏర్పరుచుకున్న ప్రజానుకూల సాహితీ సాంస్కృతికోద్యమ లక్ష్యాలకు అనుగుణంగా సుదీర్ఘకాలం ఆ కలం కవితాయానం కొనసాగిస్తున్నదని, కవిగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నారని ప్రశంసించారు. 25 సంవత్సరాల క్రితం తాను హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎవరిదీ ప్రజాస్వామ్యం? ఏ విలువలకీ ప్రస్థానం? అనే పుస్తకాన్ని ఆవిష్కరించానని గుర్తు చేశా రు. ప్రస్తుత రాజకీయాలను ఉద్దేశించి నేటి కాలంలో 'పిఎం నుంచి సర్పంచ్ వరకు అందరూ చేస్తున్నది వ్యాపారమే' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు చేసి దేశాన్ని ఆక్రమించిన బ్రిటిషర్లను తరిమికొట్టి, స్వాతం త్ర్యం సాధించుకున్న నేటి భారతదేశంలో మళ్లీ వారికి రెడ్ కార్పెట్ పరిచి పెట్టుబడులను ఆహ్వానించడంతో పాటు వారికి సకల సౌకర్యాలు కల్పించడం దారుణమన్నారు. భవిష్యత్తులో కార్మికులను బానిసలుగా చేసి, వారి చట్టాలను అమలు చేస్తే ప్రశ్నించేవారు ఎవరు?, వారిని ఎదురించే దమ్ము ఈ ప్రభుత్వాలకు ఉంటుందా? అని ప్రశ్నించారు. నిస్సిగ్గుగా ప్రభుత్వం ఎంతో కొంత జరిమానాలు విధించి చేతులు దులుపుకోవడం తప్ప చేసేదేమి లేదన్నారు.'ప్రశ్నించే గొంతుకలపై తుపాకి పెట్టి, పలానా తేదీ లోపు వారిని అంతమొందిస్తామని చెప్పడం సిగ్గుచేటు, ఎన్‌కౌంటర్ అన్నది కాలం చెల్లిన మాట, 'మీకు రాజ్యం ఇచ్చింది మేము కాదా? మనుషులను మనుషుల్లాగా చూడని నాయకులు ఎనాడైనా గద్దె దిగాల్సిందే' అని హెచ్చరించారు.

నక్సలిజం విలువలతో ఉన్న కూడా చంపేస్తామని అనడం ప్రజాస్వామ్యమా? 1930 నుంచి చూస్తునే ఉన్నాం, తమ దాకా రాలేదని అనుకోకుండా ప్రతి విషయంపై స్పందించినప్పుడే మార్పు వస్తుందన్నారు. విద్య అనేది ఒక విలువైన ఆయుధం, ప్రఖ్యాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే 1600 మంది ఉపాధ్యాయులకి కేవలం 300 మంది మాత్రమే ఉన్నారంటే ప్రభుత్వాల పని తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డా.జతిన్ కుమార్, డి.చంద్రశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ కల్పనా కన్నబిరాన్, ప్రొఫెసర్ కట్టా ముత్యం రెడ్డి, నందిని సిధారెడ్డి, తెలకపల్లి రవి తదితరులు హాజరయ్యారు.

## సర్వం సిద్ధం

(మూడవ పేజీ తరువాయి)

భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. వచ్చిన అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధం చేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, త్రిడి ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్‌లో ఎల్ఇడి స్క్రీన్స్‌తో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజు ల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపో



యేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగోతో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈసావనీర్‌లోపొందుపరుస్తారు.అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు,సకినాలు,చెక్కలు,బాదంకీజాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేకబాస్కెట్‌నుఅతిథులకుఅందించనున్నారు

### నిఘా నీడలో భారత్ ఫ్యూచర్ సిటీ 6000 మందితో భారీ బందోబస్తు

గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ మొత్తం నిఘా నీడలో ఉంది. ఈ ప్రాంతం చుట్టూ వందలాది సిసిటీవిలను ఏర్పాటు చేశారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఎలాంటి అవాంతరాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు డిజిపి బి.శివధర్‌రెడ్డి వెల్లడించారు. సుమారు 6000 మంది పోలీసులు ఈ బందోబస్తులో పాల్గొంటున్నార న్నారు. ఇప్పటికే భారత్ ఫ్యూచర్ సిటీలోని నాలుగు వేదికలతో పాటు మిగతా ప్రదేశాలను బాంబ్ స్క్వాడ్ బృందాలు జల్లెడ పట్టాయి. బందోబస్తు కోసం డిజిపి కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమ్మిట్ ప్రాంతానికి వచ్చిపోయే మార్గాలపై ముందు జాగ్రత్త చర్యగా ఆంక్షలు విధించారు. సమ్మిట్‌కు 20 కిలోమీటర్ల పరిధిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## నైట్‌క్లబ్


(మూడవ పేజీ తరువాయి)

కారణంగా వినియోగదారులు బయటకు రాలేకపోయారని, వారిలో కొందరు గ్రౌండ్ ఫ్లోర్‌కు పరిగెత్తుకుంటూ వెళ్లి అక్కడ చిక్కుకుపోయిట్లు ప్రాథమిక దర్యాప్తు తేలినట్లు సిఎం సావంత్ తెలిపారు. క్లబ్ యాజమాన్యంపై, భద్రతా నిబంధనలను ఉల్లంఘించినప్పటికీ దానిని నిర్వహించడానికి అనుమతించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నైట్‌క్లబ్ యజమాని, జనరల్ మేనేజర్‌పై ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశామని, వారిని అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు. కోస్తా తీరప్రాంత రాష్ట్రంలో పర్యాటకుల సీజన్ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ ఘటన జరగడం దురదృష్టకరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వివరణాత్మక మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించామని, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిలిండర్ పేలుడు కారణంగా మంటలు సంభవించాయని రాష్ట్ర పోలీసులు మొదట చెప్పినప్పటికీ, పర్యాటకులు డ్యాన్స్ చేస్తున్న క్లబ్ మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయని కొందరు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. మంటలు చెలరేగినప్పుడు కనీసం 100 మంది డ్యాన్స్ ఫ్లోర్‌లో ఉన్నారని, తప్పించుకునే ప్రయత్నంలో వారిలో కొందరు సిబ్బందితో పాటు వంటగదిలోకి పరిగెత్తగా, అక్కడ వారు చిక్కుకుపోయారని హైదరాబాద్‌కు చెందిన పర్యాటకురాలు ఫాతిమా షేక్ పిటిఐకి తెలిపారు. 'మంటలు చెలరేగడంతో అకస్మాత్తుగా గందరగోళం నెలకొంది. క్లబ్ నుండి బయటకు పరిగెత్తేసరికి మొత్తం నిర్మాణం మంటల్లో చిక్కుకున్నట్లు కనిపించిందని ఆమె చెప్పారు. వారాంతపు సెలవు కావడంతో నైట్‌క్లబ్ నిండిపోయిందన్నారు. మంటలు చెలరేగిన కొద్దిసేపటికే క్లబ్ మొత్తం మంటల్లో చిక్కుకుందని, క్బల్ నిర్మాణమంతా తాటి ఆకులతో నిర్మించినందున వెంటనే మంటలు విస్తరించాయని షేక్ అన్నారు. ఈ నైట్‌క్లబ్ అర్పోరా నది వెనుక భాగంలో ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాన్ని కలిగి ఉంది. ఇరుకైన లేన్‌ల కారణంగా క్లబ్‌కు అగ్నిమాపక దళాలకు ప్రవేశం, శకటాలను ఘటనా స్థలం నుండి 400 మీటర్ల దూరంలో నిలిపి ఉంచాల్సి వచ్చింది. అగ్నిమాపక, అత్యవసర సేవలకు చెందిన ఒక సీనియర్ అధికారి పిటిఐతో మాట్లాడుతూ ఇరుకైన మార్గం కారణంగా ఘటనా స్థలానికి చేరుకోవడం కష్టమైందని, దీనివల్ల మంటలను నియంత్రించడం ఒక సవాలుతో కూడిన పనిగా మారిందని అన్నారు. చాలా మంది మరణాలు ఊపిరాడక గ్రౌండ్ ఫ్లోర్‌లో చిక్కుకుపోవడం వల్ల సంభవించాయన్నారు. అర్పోరా–నాగోవా పంచాయతీ సర్పంచ్ రోషన్ రెడ్కర్ మాట్లాడుతూ ఈ క్లబ్‌ను సౌరవ్ లూత్రా నడుపుతున్నాడని, అతనికి తన భాగస్వామితో వివాదం ఉందని అన్నారు. వారి మధ్య వివాదం జరిగిందని, వారు పంచాయతీతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని చెప్పారు. తాము ఆ స్థలాన్ని తనిఖీ చేసామని, వారికి క్లబ్ నిర్మించడానికి అనుమతి లేదని గుర్తించామన్నారు. దీంతో పంచాయతీ కూల్చివేత నోటీసు జారీ చేయగా, దానిని పంచాయతీల డైరెక్టరేట్ అధికారులు నిలిపివేసినట్లు రెడ్కర్ చెప్పారు. బాధితుల బంధువులు, స్నేహితులు గోవా మెడికల్ కాలేజ్, హాస్పిటల్ మార్చురీకి చేరుకుని తమ ప్రియమైనవారి గురించి సమాచారం కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. జార్ఖండ్‌లోని ఒక గ్రామానికి చెందిన వారిలో కొందరు మృతదేహాలను స్వాధీనం చేసుకోబోమని, నైట్‌క్లబ్ యజమాని తిగినట్లు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. వారి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నైట్‌క్లబ్‌లో సహాయకులు, వంటవారుగా పనిచేస్తున్నారని వారు తెలిపారు. అసోం నుండి ఐదుగురు వ్యక్తులతో కూడిన మరో బృందం కూడా మార్చురీ వెలుపల కూర్చుని కనిపించింది. వారు మీడియాతో మాట్లాడటానికి నిరాకరించగా, వారిలో ఒకరు అగ్నిప్రమాద బాధితుల్లో కొందరు తమ స్నేహితులని పేర్కొన్నారు. అందరి మృతదేహాలను గుర్తించి పోస్టుమార్టం నిర్వహించడానికి ఒక రోజు పడుతుందని, ఆ తర్వాతే మృతదేహాలను వారి బంధువులకు అప్పగిస్తామని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోవడం పట్ల గోవా చర్చి విచారం వ్యక్తం చేసింది. సావంత్ ప్రభుత్వం పరిపాలనను నియంత్రించడంలో విఫలమైనందున అధికారంలో ఉండే 'నైతిక హక్కు'ను కోల్పోయిందని రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ యూనిట్ పేర్కొంది.

### యజమానులపై ఎఫ్ఐఆర్

గోవాలోని బిర్చ్ నైట్ క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోవడంపై పోలీసులు తక్షణ చర్యలకు దిగారు. నైట్‌క్లబ్ యజమానులు సౌరభ్ లూత్రా, గౌరవ్ లూత్రాలపై భారతీయ న్యాయసంహిత లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అర్పోరానాగోవా సర్పంచ్ రోషన్ రెడ్కర్‌ను నిర్బంధంలోకి తీసుకున్నారు.

క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లపై కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. 2013లో ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేసిన రోషన్ రెడ్కార్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అపూర్వ గ్రామంలో నైట్‌క్లబ్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారని, ఇరుకైన ప్రవేశం మార్గం, తప్పించుకునే మార్గాలు లేకపోవడం, నిర్మాణంలో మండేస్వభావం కలిగిన సామగ్రిని వాడటం వంటివి ప్రమాద కారణాలుగా ప్రాథమిక విచారణలో వెల్లడికావడంతో పోలీసులు తాజా చర్యలకు దిగారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కారు టైర్ పేలి ముగ్గురు మృతి : ఇద్దరికి గాయాలు

**గోండా (ఉత్తరప్రదేశ్):** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోండాలో కారు టైర్ పేలి జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బాధితులు గోండాలో జరిగిన ఓ వివాహానికి హాజరై అయోధ్య విమానాశ్రయానికి తిరిగి వస్తుండగా వజీర్గంజ్ ప్రాంతంలోని అన్నులా మలుపు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఆవాస్ వికాస్ కాలనీ నివాసి ప్రమోద్ గుప్తా మాట్లాడుతూ తన కుమార్తె నేహా (28), అల్లుడు అక్షత్ అగర్వాల్ (35), మనవరాలు అనయ(3), అక్షత్ తల్లి నీతా అగర్వాల్ (55), బంధువు అషు అగర్వాల్(34) డిసెంబర్ 4న తన కుమారుడు నితిన్ వివాహానికి హాజరయ్యేందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమం తర్వాత, నితిన్ వారిని బెంగళూరుకు తిరుగు ప్రయాణం కోసం అయోధ్య విమానాశ్రయానికి కారులో తీసుకెళ్తున్నాడు. కారు అన్నులా మలుపు వద్దకు చేరుకోగానే టైర్లలో ఒకటి అకస్మాత్తుగా పగిలిపోవడంతో ఎదురుగా వస్తున్న ఉత్తరాఖండ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సును ఢీకొట్టింది.

## చివరకు సర్కార్ మేల్కొంది..

### విమాన టికెట్ల పరిమితులపై చిదంబరం చురకలు



**న్యూఢిల్లీ :** ఇండిగో విమాన సేవలకు గత కొద్ది రోజులుగా తీవ్ర అంతరాయం కలిగిన నేపథ్యంలో, మోదీ సర్కార్ విమాన ఛార్జీలపై పరిమితులు విధించింది. దీనిపై కాంగ్రెస్ నేత పి.చిదంబరం ఆదివారం తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. మోదీ సర్కార్ ఆలస్యంగా మేల్కొందని అన్నారు. విమానయాన రంగం కేవలం రెండు సంస్థల గుత్తాధిపత్యంలో కొనసాగినంత కాలం ఈ ధరల నియంత్రణ అమలులో ఉండాలని ఆయన డిమాండ చేశారు. గత కొద్ది రోజులుగా ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వందలాది విమానాలు రద్దు అయ్యాయి. వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. బహుశా డిసెంబర్ 10 నాటికి అంతా సెట్ కావచ్చని ఇండిగో చెబుతోంది. ఈ నేపథ్యంలోనే మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. గత కొద్ది రోజులుగా ఇండిగో విమాన సర్వీసులు స్తంభించిపోవడం అనేది ఆ సంస్థ యాజమాన్యం, విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఎతో సహా మోదీ ప్రభుత్వపు వైఫల్యాన్ని ఎత్తి చూపుతోందని చిదంబరం వ్యాఖ్యానించారు. 'కొత్త పైలట్ డ్యూటీ టైమ్ రూల్స్ జనవరి 2024లో నోటిఫై అయ్యాయి. కానీ విమానయాన సంస్థలు ఆ నిబంధనలకు అనుగుణంగా తమ కార్యకలాపాలను మార్చుకునేలా ప్రభుత్వం మార్గనిర్దేశం చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీనికి విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఎ పూర్తిగా బాధ్యత వహించాలి' అని చిదంబరం ఆరోపించారు. 'సంక్షోభం మొదలై తీవ్రరూపం దాల్చినప్పుడు, ప్రభుత్వం దిశా నిర్దేశం చేయలేకపోయింది. పూర్తిగా నిస్సహాయంగా ఉండిపోయింది. చివరికి చేతులెత్తేసింది' అని చిదంబరం విమర్శించారు

## 1650 ఇండిగో విమానాలు రాకపోకలు

**ముంబయి:** గత ఐదు రోజుల్లో భారీ అంతరాయాల తర్వాత ఎయిర్‌లైన్ కార్యకలాపాలు క్ర మంగా స్థిరీకరించబడుతున్నాయి. ఇండిగో ఆదివారం నాడు 2,300 రోజువారీ దేశీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలను సాగించింది. అ యితే 650 విమానాలను రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ తెలిపింది, డిసెంబర్ 10–15 తేదీల షె డ్యూల్‌కు బదులుగా డిసెంబర్ 10 నాటికి నెట్‌వర్క్‌ను స్థిరీకరించాలని భావిస్తున్నట్లు ఇండిగో తెలిపింది. కాగా, పౌర విమానయాన మంత్రిత్వ శా ఖ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఆరు మెట్రో విమానాశ్రయాల నుండి ఎయిర్‌లైన్ తన సకాలం లో పనితీరు 20.7 శాతానికి మెరుగుపడింది. శనివారం దాదాపు 800 రద్దులకు వ్యతిరేకంగా 1,5 00 విమానాలను నడిపింది. గ దీని వ లన వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ప డ్డారు. ఇటీవలి అంతరాయాల తర్వాత, తమ నె ట్‌వర్క్‌లో మరింత ముఖ్యమైన, స్థిరమైన మెరుగుదలలను ఏర్పాటు చేస్తున్నామని ఇండిగో ధృవీకరి ంచింది. ఆదివారం, 1,650కి పైగా విమానాల ను నడపడానికి ప్రయత్నిస్తున్నామని, శుక్రవారం దాదాపు 1,500 విమానాలు మాత్రమే నడిపిన ట్లు ఇండిగో ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది కొరత కారణంగా శుక్రవారం దాదాపు 1,600 విమానాలను రద్దు చేయడంతో ఎయిర్‌లై న్ చరిత్రలో అత్యంత పేలవ ప్రదర్శనగా నిలిచిం ది. ఎయిర్‌లైన్ తన విమాన షెడ్యూల్‌లను పునరుద్ధరించడంలో, కస్టమర్ సపోర్ట్ సిస్టమ్‌లను బ లోపేతం చేయడంలో 'చాలా ముఖ్యమైన' పురోగతిని సాధిస్తోందని ప్రతినిధి తెలిపారు.

# ఇజ్జత్ కోల్పోయిన ఇండిగో

## అన్నీ తప్పుడు అంచనాలే–అంతా దురాశే

**న్యూఢిల్లీ:** తప్పుడు అంచనాలు, నిబంధనల ఉల్లంఘనలే 'ఇండిగో సంక్షోభం' అని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఇటు కేంద్ర ప్రభుత్వం, డిజిసిఎ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఎవియేషన్), అటు ఇండిగో సంస్థ ఆలస్యంగా నిద్ర మేల్కొన్నాయి. తక్కువరేట్ల పేరుతో ఎయిర్ ఇండియాతో కలిసి గుత్తాధిపత్యం (91 శాతం రవాణావాటా) చెలాయిస్తున్న ఇండిగో సంస్థ 140 కోట్ల జనాభాగల దేశంలో నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా సీజన్లవారీ అవసరాలు గుర్తించలేక నిర్వహణా లోపంతో ఎలాంటి ముందస్తు ప్రణాళికలను ఏర్పాటు చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విలువైన మానవ వనరుల సంపదను కాపాడుతూ, సురక్షతంగా వారిని గమ్యాలకు చేర్చే సూపర్ హీరోలైన పైలట్లను తగినంత సంఖ్యలో ప్రణాళికాబద్ధంగా సమకూర్చుకోవడంలో విఫలమైంది. పైలట్ డ్యూటీలను నియంత్రించడంలో, వారికి తగిన విశ్రాంతి కల్పించి తక్షణం రంగంలోకి దిగేవిధంగా 'వేచిఉండే పైలట్ల'ను ప్రత్యేకంగా సిద్ధంగా ఉంచడంలో విఫలమైంది. తప్పుడు అంచనాలు, డిజిసిఎ ప్రవేశపెట్టిన నిబంధనల ఉల్లంఘన, దురాశ వీటన్నింటికీ మూలకారణమని సాధారణ ప్రయాణికులు చేసిన విశ్లేషణ 'ఇండిగోకు ముందుగానే తెలియదా?' అనేది మిలియన్ డాలరు ప్రశ్నగా మిగిలింది. మూడు రోజుల తర్వాత ఇండిగో అధికారికంగా క్షమాపణ చెప్పినప్పటికీ, దేశ గగన ప్రయాణ రంగం ప్రపంచవ్యాప్తంగా అభాసుపాలైన ఆరు రోజులకు కూడా ఒక స్పష్టత ఇవ్వలేకపోయింది. తీరిగ్గా కళ్ళు తెరచి 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న రీతి'లో ఆదివారం బోర్డు సమావేశం నిర్వహించి సంక్షోభ నియంత్రణ బృందాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రయాణికుల ఛార్జీలను తిరిగి చెల్లించేందుకు ఏర్పాటు చేస్తామని, డిసెంబరు 10–15 తేదీల నాటికి సర్వీసులను సాధారణీకరిస్తామని చెప్పడం ద్వారా మరింత నవ్వులపాలైంది. ఒకప్పుడు సమయపాలనకు, దేశం వెలుపల, లోపల విస్తారమైన కార్యకలాపాలకు పునర్నిర్వచనం చెప్పింది ఇండిగో. కాలక్రమేణా తననే నమ్ముకున్న లక్షలమంది ప్రయాణికులను కష్టాలకు, కన్నీళ్ళకు గురిచేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టి ఇప్పుడు ఇజ్జత్ కోల్పోయింది ఇండిగో. తర్వాత ఇక డిజిసిఎ విచారణకు ఆదేశించింది. ప్రతీ పక్షంరోజులకూ తన పురోగతి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. పైలట్ల సమస్య పరిష్కారానికి ఒక బృహత్తర ప్రణాళిక సమర్పించాలని కోరింది. పైలట్లు తగినంత మంది అందుబాటులో లేరనే పేరుతో డిసెంబరు రెండో తేదీ నుండీ ఇండిగో సంస్థ విమానాలను రద్దు చేయడం ప్రారంభించింది. క్రమంగాఈ సంక్షోభం ముదిరింది. తీవ్రమైన ఆరోగ్య సమస్యల రీత్యా ఆసుపత్రులకు వెళ్ళేవారు, అర్జంటు ఆర్థిక కార్యకలాపాల నిమిత్తం వెళ్ళేవారు, ఆపద మొక్కులు తీర్చుకోవడానికి పుణ్యక్షేత్రాలకు వెళ్ళే భక్తజనులు...ఇలా ఒకరేమిటి అనేక వర్గాల ప్రజలు దేశవ్యాప్తంగా విమానాశ్రయాలలో ఎక్కడివారు అక్కడే స్తంభించిపోయి ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. కన్నీళ్ళు పెట్టుకున్నారు. కనీస సమాచారమైనా చెప్పమని బ్రతిమిలాడారు. తమ సమయం వృథా అవుతోందని ఆందోళన చెందారు. చివరకు ఉన్నచోటనే నినాదాలు, ప్రదర్శనలు చేసే వరకూ పరిస్థితులు దారితీశాయి. ఇప్పుడు తీరికగా తలవాల్చి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు అండగా ఉంటామని, రీఫండింగ్ చేస్తామని, రీషెడ్యూలింగ్ ఏర్పాట్లు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నది. వారం రోజులుగావందల విమానాలను రద్దుచేయడంవల్ల అనేకమంది ముఖ్యులు వ్యాపార కీలకమైన సమావేశాలకు, వివాహాలకుహాజరు కాలేకపోయారు. ఇండిగో ప్రతిరోజూ నడుపుతున్న 2,300 విమానాలలో 650 విమానాలు ఒక్క ఆదివారంనాడే గాలిలోకి లేవకుండా నిద్రపోయాయి. దేశీయ మార్కెట్లో ఇండిగోకు 65 శాతంపైగా వాటా ఉంది. మూడో తేదీన 150 విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, ముంబై మార్గాల్లో సంక్షోభం వచ్చింది. వేలాదిమంది ప్రయాణాలు ఆగిపోయాయి. ఒక్కసారిగా అది కుప్పకూలడంతో దానికి పోటీగా ఉన్న ఇతర ఎయిర్‌లైన్స్ కూడా తట్టుకుని భరించలేనంత ట్రాఫిక్‌ను సృష్టించింది. ఈ మార్గాలలో అందరూ విపరీతంగా ధరలు పెంచేశారు. ఢిల్లీ–బెంగళూరు మధ్య ధర రూ.40 వేల నుండి రూ.80 వేలకు, ఢిల్లీ–ముంబై మధ్య ధర రూ.36 వేల నుండి 56 వేలకు, ఢిల్లీ–చెన్నై మధ్య టిక్కెట్టు ధర రూ.62 వేల నుండి రూ.82 వేలకు ఇతర సంస్థలు పెంచేశాయి. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసి ధరలను నియంత్రించాల్సి వచ్చింది.



**పైలట్లసంఖ్యపై అంచనా ఏది?**

గుత్తాధిపత్యం చెలాయిస్తున్నప్పుడు ఎంతమంది పైలట్లు కావాలి? అనే విషయాలలో ఇండిగో తప్పుడు అంచనాలు వేసింది. ఎంతమందిని అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలి, ఎంతమంది పైలట్లకు సెలవులు ఇవ్వాలి, ఎన్ని గంటలు విశ్రాంతి ఇవ్వాలి, ఎన్ని గంటలు వారికి డ్యూటీ వేయాలి? పైలట్లకు రాత్రిపూట, పగటిపూట ఎన్నిన్ని ఇవ్వాలి? ఎన్ని ల్యాండింగ్‌లు ఇవ్వాలి? అనే విషయంలో డిజిసిఎ రూపొందించిన కొత్త నిబంధనలను ఇండిగో బేఖాతరు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం స్తవానికి ప్రతి పైలట్‌కు వారానికి 36 గంటల నుండి 48 గంటలు విశ్రాంతి ఉండాలి. అర్ధరాత్రి నుండి తెల్లారేవరకూ పైలట్‌కు గతంలో ఆరురు, ల్యాండింగ్‌లు ఉండేవి. కొత్త నిబంధనల ప్రకారం ఈ సంఖ్యను రెండు తగ్గించారు. పైలట్ గరిష్ఠస్థాయిలో పది గంటలు డ్యూటీకి తగ్గించారు. వరుగా రెండు రాత్రులు మినహా డ్యూటీ ఇవ్వకూడదు. డిజిసిఎ రూపొందించిన ఈ నిబంధనలను వాస్తవానికి 2024 జనవరి నుండి అమలులోకి రావాలి. కానీ కొంత గడువు ఇచ్చేందుకు వీటి అమలు ఆలస్యం చేశారు. దశలవారీగా అమలు చేశారు. ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుండి ప్రారంభించి ఐదునెలలపాటు నవంబరు ఒకటో తేదీ వరకూ మార్పులు చేసిన ఒక్కొక్క నిబంధనను ప్రవేశపెడుతూ వచ్చారు. కానీ ఎంతమంది పైలట్లు కావాలనే విషయాన్ని ఇండిగో అర్థం చేసుకోలేకపోయింది. ఇండిగో ఎయిర్‌బస్ ఎ 320లు సజావుగా నడవాలంటే 2,422 మంది పైలట్లు కావాలి. కానీ వారివద్ద 2,357 మంది మాత్రమే ఉన్నారు. ఇండిగో ఇప్పుడు చివరకు ఆలోచవనలో పడింది.

### విమానాల రద్దుపై కార్యనిర్వాహకులకు
## పార్లమెంటరీ ప్యానల్ పిలుపు?

**న్యూఢిల్లీ :** ఇండిగో విమానాల రద్దుపై పార్లమెంట్ ప్యానెల్ చర్యలకు పూనుకోనుంది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాలలో వేలాది మంది ప్రయాణికులను చిక్కుకుపోయేలా చేసిన ఇండిగో విమానాల భారీ రద్దుపై ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ అగ్ర కార్యనిర్వాహకులను, పౌర విమానయాన నియంత్రణ సంస్థను పిలిపించే అవకాశం ఉంది. జెడి(యు) నాయకుడు సంజయ్ ఝా అధ్యక్షతన ఉన్న రవాణా, పర్యాటక, సంస్కృతిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, విమాన సేవలలో అంతరాయం ఏర్పడటానికి గల కారణం, సాధ్యమైన పరిష్కారాల గురించి విమానయాన సంస్థల ఉ న్నత కార్యనిర్వాహకులు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ), పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారుల నుండి వివరణ కోరే అవకాశం ఉంది. విమాన సేవలలో అంతరాయం కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్యానెల్ తీవ్రంగా పరిగణించిందని ఒక సభ్యుడు చెప్పారు. శీతాకాల సమావేశాల కోసం దేశ రాజధానిలో ఉన్న పార్లమెంటు సభ్యులు కూడా ఇండిగో విమానాల రద్దు, ఇతర విమానయాన సంస్థల జాప్యాల భారాన్ని ఎదుర్కొన్నారని ప్యానెల్ సభ్యుడు చెప్పారు. ఈ పరిస్థితి కారణంగా విమాన ఛార్జీలు పెరుగుతున్నాయని అనేక మంది ఎంపిలకు ప్రజల నుండి ఫిర్యాదులు కూడా అందాయి. కాగా, రవాణాపై స్టాండింగ్ కమిటీలో భాగం కాని సిపిఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్, విమానాల రాకపోకలకు పెద్ద ఎత్తున అంతరాయం ఏర్పడటంపై ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ లేదా న్యాయ విచారణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యకలాపాలను సాధారణీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ అంతరాయాలు ఆరో రోజుకు చేరడంతో, ఇండిగో ఆదివారం ఢిల్లీ, ముంబై విమానాశ్రయాలలో 220కి పైగా విమానాలను రద్దు చేసింది. విమానయాన నియంత్రణ సంస్థ, డిజిసిఎ, శనివారం ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్, సిఒఒ, అకౌంటబుల్ మేనేజర్ పోర్కెరాస్‌లకు వివరణ కోరుతూ నోటీసులు పంపింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బోర్డు, దాని మాతృ సంస్థ, సంక్షోభ నిర్వహణ సమూహాన్ని ఏర్పాటు చేసిందని, ఇది పరిస్థితిని పర్యవేక్షించడానికి క్రమం తప్పకుండా సమావేశమవుతుందని ఇండిగో ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

## వాహనం ఢీకొని మగ చిరుతపిల్ల మృతి


**గ్వాలియర్ :** గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒక మగ చిరుతపిల్ల మృతిచెందింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ జిల్లాలో ఒక జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సంఘటన ఆగ్రా ముంబయ్ జాతీయ రహదారిపై ఘటిగావ్ ప్రాంతంలో శివపురి జిల్లా సరిహద్దుకు సమీపంలో ఇక్కడ నుండి 35 నుండి 40 కి.మీ.ల దూరంలో జరిగిందని గ్వాలియర్ జోన్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజి) అర్‌విండ్ సక్సేనా 'పిటిఐ'కి ఫోన్ కాల్‌లో తెలిపారు. దాదాపు 20మాసాల వయసున్న మగ చిరుతపిల్ల కె.ఎన్.పి నుండి దారితప్పి తల్లి నుంచి విడిపోయిందని, ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అది చనిపోయిందని ఐజి సక్సేనా చెప్పారు. ఇదిలాఉంటే చిరుతను ఢీకొట్టినట్లు అనుమానిస్తున్న కారు గురించి ఆధారాలు లభ్యమయ్యాయని పోలీస్ దర్యాప్తు బృందంలోని ఒక సభ్యుడు చెప్పారు. 'అదే తల్లి నుండి వేరుచేయబడిన మరొక మగచిరుత పిల్ల ఇప్పటికీ చుట్టూ ఉండవచ్చు.కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి మేం ట్రాఫిక్‌ను నియంత్రించాం. జాతీయ రహదారిపై వేగాన్ని తగ్గించాం. రెండూ గతంలో కలిసి కనిపించాయి' అని ఐజి అర్‌విండ్ సక్సేనా చెప్పారు. 'మరో చిరుత పిల్ల సురక్షితంగా ఉంది'అని స్టేట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్ లైఫ్) శుభరాజన్ సేన్ 'పిటిఐ'కి చెప్పారు.

### మావోయిస్టుల కంచుకోట...
## కొండపల్లిలో మొబైల్ టవర్

**న్యూఢిల్లీ :** మావోయిస్టుల కంచుకోట అయిన ఛత్తీస్‌గఢ్ బిజాపుర్ జిల్లాలోని కొండపల్లిలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఉషోదయం మొదలైంది. గ్రామంలో మొబైల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసిన వెంటనే ఊరుఊరంతా వెళ్లి సంబరాలు చేసుకున్నారు. కొండపల్లి మావోయిస్టుల కంచుకోట. ఇది ఛత్తీస్‌గఢ్ బిజాపుర్ జిల్లాలోని మారుమూల గ్రామం. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న కొండపల్లిలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఉషోదయం మొదలైంది. గ్రామంలో తొలిసారిగా మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చింది. గ్రామానికి తొలిసారిగా మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ రావడంతో స్థానికుల ఆనందంలో మునిగిపోయారు. గ్రామంలో మొబైల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసిన వెంటనే ఊరుఊరంతా వెళ్లి సంబరాలు చేసుకున్నారు. ఈ ఘటన డిసెంబర్ 5ను ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బిజాపూర్ జిల్లా కేంద్రం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతంలో కొండపల్లి ఉంది. ఈ గ్రామానికి దశాబ్దాలుగా సంవత్సరాలుగా రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో లేవు. ఇలాంటి ప్రాంతంలో మొట్టమొదటిసారిగా మొబైల్ టవర్ వస్తుందని తెలిసిన ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. టవర్ ప్రారంభిస్తున్నామని అధికారులు ప్రకటించిన వెంటనే గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు అందరూ డబ్బులు, వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలతో ర్యాలీగా టవర్ వద్దకు చేరుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి టవర్ ప్రారంభించారు. అధికారులు టవర్‌ను పూర్తిగా యాక్టివేట్ చేసినప్పుడు గ్రామస్థులు మొబైల్ ఫోన్లలో మొదటిసారి సిగ్నల్ బార్లు కనిపించడంతో ఆనందోత్సాహంలో మునిగిపోయారు. నృత్యాలు చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. దండకారణ్యంలోని మారుమూల గ్రామానికి మొబైల్ నెట్‌వర్క్ చేరుకోవడం కేవలం సాంకేతిక ప్రగతి మాత్రమే కాదు, గ్రామాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానించే కీలక అడుగుగా భావిస్తున్నారు. 'నియద్ నెల్లానార్' పథకంలో భాగంగా తీసుకున్న ఈ చర్యతో కొండపల్లి అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని అధికారులు తెలిపారు. 2024 లో 'నియద్ నెల్లానార్' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారానే కొండపల్లిలో మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేశారు. ఈ పథకం చొరవతో ఈ ప్రాంతంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయి. ఈ పథకం కింద 403 గ్రామాలకు సేవలు అందుతున్నాయి. తొమ్మిది ప్రభుత్వ విభాగాలు సామాజిక సేవలను అందిస్తుండగా, 11 విభాగాలు నేరుగా కుటుంబాలకు వ్యక్తిగత ప్రయోజన పథకాలను అందిస్తున్నాయి. ఈ స్కీమ్ కింద గత రెండేళ్లలో ఈ ప్రాంతంలో 728 కొత్త మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 69 కొత్త భద్రతా క్యాంపులను స్థాపించారు. కొండపల్లిలో చాలా సంవత్సరాలుగా కమ్యూనికేషన్, రవాణా, ప్రజా సేవలు పొందడంలో తీవ్ర సవాళ్లను ఎదుర్కొంది. కఠినమైన భౌగోళిక పరిస్థితులు, నక్సల్స్ అడ్డంకుల కారణంగా పరిపాలన బృందాలు ఈ ప్రాంతానికి చేరుకోవడం కష్టంగా ఉండేది. అయినప్పటికీ ప్రభుత్వం నిరంతర భద్రతా కార్యకలాపాలు, మెరుగైన పరిపాలనను అందించేందుకు ముందుకొచ్చింది. దీంతో కొంత పరిస్థితి మెరుగుపడింది. కానీ 'నియద్ నెల్లానార్' పథకాన్ని ప్రారంభించిన తర్వాత గణనీయమైన మార్పులు బిజాపూర్‌లో వస్తున్నాయి.



## సమగ్ర దర్యాప్తు చేయాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** గోవాలోని నైట్‌క్లబ్‌లో 25 మంది మృతి చెందిన విషాదకరమైన అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని, కఠినమైన జవాబుదారీతనం ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భద్రత లోపం, నేరపూరిత పాలనా వైఫల్యమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఉత్తర గోవాలోని అర్పోరా గ్రామంలోని ప్రసిద్ధ నైట్‌క్లబ్ బిర్చ్ బై రోమియో లేన్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బందితో సహా 25 మంది మరణించారు మరియు మరో ఆరుగురు గాయపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అగ్నిప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ నివారించదగిన విషాద సంఘటన కోలుకోలేని నష్టాన్ని మిగిల్చిందని, గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఇలాంటి విషాదాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, కఠినమైన జవాబుదారీతనం, అన్ని అగ్నిమాపక భద్రతా నిబంధనలు అమలు చేయబడతాయని నిర్ధారించుకోవడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా ఇటువంటి విధ్వంసకర ఘటనలు ఎప్పుడూ పునరావృతం కాకుండా చూసుకోవాలని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. తీరప్రాంతంలోని కాంగ్రెస్ కార్యకర్తలందరూ బాధిత కుటుంబాలకు సాధ్యమైన సహాయాన్ని అందించాలని, ఈ దుఃఖ సమయంలో వారితో నిలబడాలని విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అర్పోరాలో జరిగిన విషాద అగ్నిప్రమాదం తనను తీవ్రంగా బాధపెట్టిందని అన్నారు. మృతులను కోల్పోయిన కుటుంబాలకు హృదయపూర్వక సంతాపం, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాని చెప్పారు. 'ఇది కేవలం ప్రమాదం కాదు; ఇది భద్రత, నేరపూరిత పాలన వైఫల్యం. సమగ్రమైన, పారదర్శకమైన దర్యాప్తు ద్వారా జవాబుదారీతనం నిర్ధారించబడాలి. ఇలాంటి నివారించదగిన విషాదాలు మళ్ళీ జరగకుండా చూసుకోవాలి' అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ స్పందిస్తూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విషాదకరమైన అగ్నిప్రమాదానికి జవాబుదారీతనం నిర్ణయించాలని కోరారు. అగ్నిప్రమాదం దిగ్భ్రాంతికరమైనదిదని, ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. అగ్నిమాపక భద్రతా నిబంధనలను అమలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ విషాదం జరిగిందని, బాధ్యులను గుర్తించడానికి, జవాబుదారీతనం నిర్ధారించడానికి సమగ్రమైన, నిష్పాక్షికమైన దర్యాప్తును డిమాండ్ చేస్తున్నామని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

### బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటింగ్‌కు..
## ఎంపిలను అనుమతించాలి

లోక్‌సభలో 'ప్రైవేట్ బిల్లు' ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపి మనీష్‌తివారీ




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ స్థిరత్వాన్ని ప్రభావితం చేసే బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటింగ్‌కు పార్లమెంట్ సభ్యులను అనుమతించే బిల్లును కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వ స్థిరత్వాన్ని ప్రభావితం చేసే బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటు వేయడానికి వీలు కల్పిస్తూ, వారిని కొరడాతో నడిపే 'విప్ నిరంకుశత్వం' నుండి విడిపించడానికి, మంచి చట్టాల నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి వీలు కల్పించారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించడానికి గత శుక్రవారం 'ప్రైవేట్ సభ్యుల బిల్లు'ను ప్రవేశపెట్టిన మనీష్‌తివారీ తన ప్రతిపాదిత చట్టం ప్రజాస్వామ్యంలో ఎవరికి ప్రాధాన్యత ఉందో అతడి లేదా ఆమె ప్రతినిధిని ఎన్నుకోవడానికి గంటల తరబడి ఎండలో నిలబడి ఉన్న ఓటరును లేదా ప్రతినిధి ఎవరి విప్‌కు అధిపతిగా మారతారో గుర్తించాలని చూస్తున్నారని అన్నారు. 2010 మరియు 2021 తర్వాత మనీష్ తివారీ మూడవసారి లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, ప్రభుత్వ స్థిరత్వాని ్న ప్రభావితం చేసే విశ్వాస తీర్మానం, అవిశ్వాస తీర్మానం, వాయిదా తీర్మాన, ద్రవ్యబిల్లులు, ఆర్థిక విషయాలు కాకుండా బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటు వేసే స్వేచ్ఛను పార్లమెంట్ సభ్యులకు కల్పించడానికి ప్రయత్నిస్తుంది. 'ఈ బిల్లు శాసనసభ యొక్క అంతరాత్మ, నియోజకవర్గం, సాధారణ జ్ఞానాన్ని తిరిగి ఇవ్వడానికి ప్రయత్నిస్తు ంది. తద్వారా ఎన్నికైన ప్రతినిధి వాస్తవానికి తన ను ఎన్నుకున్న ప్రజల ప్రతినిధిగా పనిచేస్తాడు. అ తడి పార్టీ జారీచేసిన విప్ సాధనంగా కాదు, శాసనసభ్యుడిని కేవలం లోబోటమైజ్డ్ సంఖ్యలుగా, వి భజన బెల్‌కు స్పందించే పిడివాద సంకేతాలుగా మారుస్తాడు' అని మనీష్ తివారీ 'పిటిఐ'కి చె ప్పారు. 'ఒక సభ్యుడు విశ్వాస తీర్మానం, ఈ బిల్లు గురించి మనీష్ తివారీ మాట్లాడుతూ ఈ బిల్లు జ ంట లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తుందని?, ప్రభుత్వ స్థిరత్వం ప్రభావితం కాదని, పార్లమెంటేరియన్లు, శాసనసభ్యులు శాసనసభ ఎంపికపై కసరత్తు నిర్వహిస్తారని చెప్పారు. ఈ బిల్లు నిరంకుశత్వాన్ని తొలగించి మంచి చట్టాలను రూపొందించడాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుందా? అని తివారీని అడిగినప్పుడు 'కచ్చితంగా' అని ఆయన సమాధానం ఇచ్చారు. 10వ షెడ్యూల్ అమలులోకి వచ్చిన పావు శతాబ్దం గడిచిన తర్వాత, నేటి ప్రజాస్వామ్య ప్రక్రియకు మరింత సందర్భోచితంగా ఉండాలంటే దానికి కొన్ని అనుసరణలు, మరింత బలోపేతం అవసరమని బిల్లు లక్ష్యాలు, కారణాల ప్రకటన తెలిపింది. 10వ షెడ్యూల్‌లోని అంశాలను విచారించడానికి సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌తో కూడిన పార్లమెంట్ అధ్యక్షుడి వెలుపల జ్యుడీషియల్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని మనీష్ తివారీ పిలుపునిచ్చారు. ఏవైనా అప్పీళ్లు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి వెళ్తాయని, ఆ తర్వాత బహిరంగ కోర్టులో విచారణకు చట్టబద్ధమైన సమీక్ష ఏర్పాటు చేయబడుతుందని తివారీ చెప్పారు.

### ఆపరేషన్ సిందూర్ సమయంలో 'సంయమనం' ఎంచుకోకుంటే...
## బలగాలు 'ఇంకా చాలా చేసేవి'

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

**లేహ్ :** పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాలు 'ఇంకా చాలా చేయగలిగేవి' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా 'నియంత్రణ', 'క్రమాంకన' చేసిన ప్రతిస్పందనను ఎంచుకున్నారన్నారు. మే నెలలో జరిగిన ఈ ఆపరేషన్ భారత దళాల సామర్థ్యం, క్రమశిక్షణ రెండింటినీ నొక్కిచెప్పిందన్నారు. వారు ఉగ్రవాద ముప్పులను తీవ్రతరం చేయకుండా తటస్థీకరించారని రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఇక్కడ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బ్రో) ద్వారా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పూర్తి అయిన 125 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సాయుధ దళాలు పౌర పరిపాలన, సరిహద్దు ప్రాంతాల పౌరుల మధ్య మేం చూసిన సమన్వయం అద్భుతమైనది. మన దళాలకు మద్దతు ఇచ్చినందుకు లడఖ్‌లోని ప్రతీ పౌరుడికీ, సరిహద్దు ప్రాంతాలకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని రక్షణమంత్రి అన్నారు. ఈ సమన్వయమే మన గుర్తింపును నిర్వచిస్తుందన్నారు. ప్రపంచంలోనే మనకు అత్యంత గుర్తింపును ఇచ్చేది మన పరస్పర బంధమేనన్నారు. ఏప్రిల్ 22న కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించాయి. పహల్గామ్ దాడిలో 26మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా అందులో అధిక సంఖ్యాకులు పర్యాటకులే ఉన్నారు. కొన్ని మాసాల క్రితం పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మన సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను ఎలా నిర్వహించాయో మనందరం చూశామని, వారు ఉగ్రవాదులకు యావత్ ప్రపంచానికీ తెలుసని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. 'మన దళాలు శౌర్యాన్ని మాత్రమే కాకుండా సంయమనాన్ని కూడా ప్రదర్శించాయి. అవసరమైనది మాత్రమే చేశాయి' అని రక్షణ మంత్రి చెప్పారు. 'మోహరించబడిన సైనికుడికి ప్రతీనిమిషం, ప్రతీ సెకను చాలా ముఖ్యమైనదన్నారు. అందువల్ల కనెక్టివిటీ కేవలం నెట్‌వర్క్‌లు, ఆప్టికల్ ఫైబర్ డ్రోన్, రాడార్‌లకే పరిమితం కాకూడదు. ఇది భద్రతకు వెన్నెముక' అని సింగ్ అన్నారు. దేశంలోని ఏమూలనైనా కలవగలిగితే, అది పటిష్ఠమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, కనెక్టివిటీ వల్లనే సాధ్యమవుతుందని తెలియజేశారు. లడఖ్ సహా అన్ని సరిహద్దు ప్రాంతాలలో కమ్యూనికేషన్, కనెక్టివిటీని బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోందన్నారు. సరిహద్దు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఉత్సాహంతో పనిచేస్తున్నదని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. 'మా ప్రభుత్వం, మా సాయుధ దళాలు, బిఆర్‌ఓ సంస్థలు మీతో ఉన్నాయి. మా సంబంధం ఏ బాహ్య అంశాల వల్ల ప్రభావితం కాకుండా మనం బలోపేతం చేసుకోవాలి' అని రక్షణ మంత్రి పేర్కొన్నారు. మెరుగైన కనెక్టివిటీ భద్రత, మౌలిక సదుపాయాలను మాత్రమే బలోపేతం చేయడమే కాకుండా ఆర్థిక వృద్ధిని కూడా నడిపిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ జోడించారు.



## గడ్డివాముల దగ్ధం..

### రూ.2లక్షల ఆస్తి నష్టం...



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని కూచిపూడి గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఆయన అంత్యక్రియలను ఆదివారం నిర్వహించేందుకు ఊరేగింపుగా వెళ్తూ వారి కుటుంబ సభ్యులు, బంధువులు టపాసులు పేల్చడంతో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు లేచి గడ్డివాములపై పడడంతో అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో గ్రామశివారులో ఉన్న మెట్టు శ్రీనివాస్, రామిశెట్టి మొగిలి, పసుపులేటి శ్రీనివాసరావు, శెట్టి గోవిందరావులకు చెందిన గడ్డివాములు ఒక్కసారిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షల విలువైన గడ్డి దగ్ధమైనట్లు బాధిత రైతులు చెప్పారు. మంటలను ఆర్పేందుకు గ్రామస్తులు నీళ్ళు, మట్టిపోసే ప్రయ త్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటల వ్యాప్తిని చల్లార్చారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి.

## పన్నులు కట్టి పట్టణ అభివృద్ధికి సహకరించండి

### మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట మున్సిపాలిటివాసులు స్వచ్ఛందంగా పన్నులుచెల్లించి అచ్చంపేట అభివృద్ధికి భాగస్వాములుకావాలని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు కోరారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం అంచనాలకుతగ్గట్లు పన్నులు వసూలుకాకపోవడంతో పురపాలికకు రావాల్సిన 15వ ఆర్థికసంఘం నుంచి రూ.50లక్షల అభివృద్ధి నిధులు రాలేదని దీనివలన రోడ్లు, డ్రైనేజిలు, చెత్తసేకరణ వాహనాలకొనుగోలు, మెయింటెన్స్అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యాయని , నిధులులేకపోవడంతో కొత్త పనులు చేయలేకపోతున్నామని ఆయన తెలిపారు. ఆస్తిపన్ను, కొత్త అసిస్మెంట్లు, రివైజ్పన్నులు, ట్రేడ్లైసెన్సులు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని ఈ నేపథ్యంలో మేమువారికి శత్రువులుగా కనిపిస్తున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. మున్సిపాలిటి అభివృద్ధే తమ ధ్యేయమని ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే తమ ధ్యేయమన్నారు.

## కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి



**ప్రజాపక్షం/మక్తల్:** నారాయణపేట్ జిల్లా మండలంలోని మద్వార్ గ్రామంలో బొక్కి క్రిష్టయ్య అనే రైతు రోజు తన ఎద్దులని పోలానికి మెపడానికి తిస్కేల్లాడు. అక్కడ ఒక్క ట్రాన్స్పరం దగ్గర ఒక్క కరెంట్ షాక్ తగిలి అక్కడికి అక్కడే మృతి చెందింది. ఎద్దు ఒక్క ఖరీధ్ 80,000 ఉండవచ్చు బొక్కి కృష్ణయ్య అనే రైతు ఎద్దు మృతి చెందిన సంఘటన వలన రైతు కుటుంబం కన్నీరు కారుస్తున్న బాధాకరంగా చేస్తున్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీ



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ప్రజల సమస్యలను తెలుసుకోవడం, పరిష్కరించడంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు, ఫిర్యాదుదారులు కాల్ చేయాలనుకునే వారు ఎస్పీ ఆఫీస్ నెంబర్ : 085 06281182కు ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు కాల్ చేయాలని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ప్రజలతో మాట్లాడి ఫిర్యాదులు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తక్షణ పరిష్కార మార్గాలను సూచిస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

## ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ కోడ్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు జిల్లా అంతటా గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మొదటి దశ పోలింగ్‌తో పాటు రెండవదశ పోలింగ్ పూర్తయిన తరువాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందని, మూడవ దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని తెలిపారు. ఏకగ్రీవమైన గ్రామపంచాయితీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికలకు దూరమయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## వైద్యానికి ప్రాధాన్యతనిస్తా



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** కల్వరాల గ్రామంలోని ప్రజలు ఆశీర్వదిస్తే, గ్రామాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపేందుకు కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి బండారు రమేష్ తెలిపారు. కల్వరాల గ్రామపంచాయితీ పరిధిలో జరగనున్న ఎన్నికల్లో ప్రజా మద్దతుతో సర్పంచు బాధ్యతలు చేపట్టే అవకాశం దక్కితే, విద్యారంగం, వైద్య సేవలు, ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తానని రమేష్ హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి ని లక్ష్యంగా పెట్టుకుని ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరేలా పనిచేస్తానని ఆయన అన్నారు. గ్రామంలో ఉన్న పాఠశాలలకు మరిన్ని వసతులు కల్పించడం, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి అవసరమైన సౌకర్యాలను అందించడం, గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసి వైద్య సేవలను అందరికీ చేరవేయడం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటానని రమేష్ వెల్లడించారు. అదే విధంగా, తాగునీటి సమస్యల పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థలో సంస్కరణలు, రహదారి సదుపాయాల విస్తరణ, గ్రామ శానిటేషన్‌లో ఆధునిక పద్ధతుల అమలు వంటి కార్యక్రమాలను చేపట్టాలని సంకల్పించారు. రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతూ, వ్యవసాయానికి అవసరమైన సాంకేతిక సాయం, ఎరువులువిత్తనాల సమయానుసార సరఫరా వంటి సేవలను మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలు ఆశలు, అభిలాషలకు అనుగుణంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి, కల్వరాలను ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని బండారు రమేష్ అన్నారు. ప్రజలతో మమేకమై ప్రతి ఇంటిని సందర్శించి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కంకణం కట్టుకున్నామని అన్నారు.

## కాంగ్రెస్‌లోకి చేరికలు

**ప్రజాపక్షం/ వీపనగండ్ల :** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ వార్డు సభ్యులు తిరుపతయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు తనయుడు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జూపల్లి అరుణ్ కుమార్ మాజీ వార్డు సభ్యులు తిరుపతయ్యకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ వార్డు సభ్యులుగా నిలిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పానగల్ సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బాల్ రెడ్డి, సర్పంచ్ అభ్యర్థి బండారు రాముడు, పార్టీ నాయకులు చక్ర వెంకటేష్, వెంకట్రాజయ్య, రమేష్ గౌడ్, పెద్ద వెంకటేష్, హుస్సేన్ ఉన్నారు.



## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్లపాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే అమలు చేయలేదన్నారు. జనరల్ సీట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. పార్టీపరంగా జనరల్ సీట్లలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీ బలపరిచన అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాలను మాడల్ విలేజ్‌గా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రానున్న మూడేళ్లలో ప్రజా సంక్షేమ కోసం మరిన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపారు. బూత్, గ్రామ, మండల, పట్టణ స్థాయిలో పార్టీ కమిటీలను పూర్తి చేస్తామని అన్నారు. జిల్లా పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు పథకాలు వివరించి పార్టీ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించాలని కోరారు. సర్పంచు ఎన్నికల్లో వేలంపాటలు జరుగుతున్నాయనేది కేవలం ఊహాజనితమని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, నాయకులు చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, వసంత, లింగం నాయక్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఫయాజ్, అజ్మత్ అలీ, ఆవేజ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## అంతరాయాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు

### కలెక్టర్ విజయేందిర బోయి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** రెండవ దశ గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణలో భాగంగా, శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల, కోయిల్‌కొండ, మిడ్జిల్, హన్వాడ , మండలాలకు సంబంధించి రెండవ దశ ర్యాండమైజేషన్ గ్రామ పంచాయితీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి, ఐఏఎస్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ విధులు కేటాయించిన పోలింగ్ సిబ్బందికి సకాలంలో నియామక ఉత్తర్వులు అందేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అంతరాయాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. రెండవ దశ ఎన్నికల జరిగే మండలాల్లోని 151 జిపిలు, 1334 వార్డులకు కలిపి 20 శాతం రిజర్వ్ సిబ్బందితో కలిపి 1601 పిఓలకు, 1902 ఓపిఓలకు మొత్తం 3503 మందికి రాష్ట్ర ఎన్నికల సంఘం టి.పోల్ పోర్టల్ సాఫ్ట్‌వేర్ ద్వారా ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు నగదు బహుమతి అందజేత

**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఈ టెస్ట్‌లో దాదాపు 60 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరచి బెల్ట్, సర్టిఫికెట్లు సాధించారు. వీరిలో ఎల్లో బెల్ట్ విభాగంలో 15 విద్యార్థులు, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో 15 మంది విద్యార్థులు, గ్రీన్ బెల్ట్ 15 మంది విద్యార్థులు, మెరూన్ బెల్ట్‌లో 9 మంది విద్యార్థులు, బ్రౌన్ బెల్ట్‌లో 7 మంది విద్యార్థులకు బెల్టు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లెగు లిఫ్టింగ్ కిక్ లైన్స్ సింగ్ లిఫ్టింగ్ విభాగంలో ఒక్క నిమిషానికి 100 కిక్కులు కొట్టిన సందర్భంగా విద్యార్థులకు బహుమతి అందించారు. ఈ విద్యార్థులందరూ క్లబ్ డిప్యూటీ ఫౌండర్స్ జాఫర్ సాదిక్ జి.హరీష్ యాదవ్ దగ్గర శిక్షణ తీసుకుంటున్నట్లు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కరాటే పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్స్ వి.అరవింద చారి, శ్రీకాంత్ యాదవ్, పాల్గొని విద్యార్థి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్ ఇంతియాజ్, వడ్డే శివరాజ్, మహేష్ యోగేశ్వరి, అన్విత, పవన్ తేజ్ యాదవ్, ఏకాంబరి, వెంకట్ రెడ్డి, ఎస్ కే బాబా అజ్మీర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక కేంద్రాల పరిశీలన

### మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి



**ప్రజాపక్షం/మక్తల్ :** గ్రామపంచాయితీ ఎన్నికలను పురస్కరించుకుని మక్తల్ పోలీసులు ఎన్నికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టమని ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు మక్తల్ మండలంలోని మంతన్ గోడు, కాట్రేవుపల్లి గ్రామంలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్సై ప్రత్యేక్షంగా సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడి ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని, అందరూ కలిసిమెలిసి శాంతియుతంగా ఎన్నికలు జరుపుకోవాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు భద్రతా పరిస్థితులను సూక్ష్మంగా పరిశీలించి, అక్కడి పోలీసులు, ఎన్నికల సిబ్బందితో సమన్వయం, సన్నద్ధతపై సమగ్ర చర్చ జరిపారు. సమస్యాత్మకంగా గుర్తించబడిన బూత్లలో అధిక బందోబస్తును ఏర్పాటు చేయడం, అవసరమైన లైటింగ్, బ్యారికేడింగ్, సీసీ కెమెరాలు, క్యూలైన్ నిర్వహన, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ వంటి సదుపాయాల సూచనలు ఇవ్వడం జరిగింది. సందర్శనలో వారు గ్రామంలోని పరిస్థితులు, జనసంచారం, గత ఎన్నికలలో నమోదైన సమస్యలు, స్థానిక సున్నితాంశాలను పరిగణనలోకి తీసుకుని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల రోజున ఎటువంటి అల్లర్లు, బెదిరింపులు, అక్రమ రవాణాలను అరికట్టేందుకు పోలీసులు పూర్తిగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## గోప్యత పాటించడం తప్పనిసరి



తపస్ జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్:** ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ గోపత్య తెలియకపోవడం విచారకరమని దీనివల్ల అనేకమంది ఉపాధ్యాయ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెనకాడుతున్నారని తపస్ జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి నరసింహ తెలిపారు. ఆదివారం జాజాపూర్ గ్రామంలో రవికుమార్ అధ్యక్షతన జరిగిన నారాయణపేట మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల విధులకు వెళ్లిన ఉపాధ్యాయ ఉద్యోగుల పోస్టల బ్యాలెట్లు ప్రత్యేకంగా లెక్కించడం జరుగుతుందని, దీనివల్ల ఒకరు లేదా ఇద్దరూ మాత్రమే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే గ్రామాలలో వేసిన ఓటును రహస్యంగా ఉంచకపోతే విభేదాలకు దారితీస్తుందని తెలిపారు. ఇదే సంకటంలో ఉపాధ్యాయ, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం తగ్గుతుందని వాపోయారు. అధికారులు ఆలోచించి దీనిపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్, కుర్మయ్య, విశ్వనాథరెడ్డి, నారాయణపేట మండల ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహులు, నర్సప్ప, వెంకటేష్, కృష్ణారెడ్డి రఘు రామేశ్వర్, వెంకటేష్, రాజేష్, శంకర్, కరుణాకర్, సంతోష్, చంద్రకాంత్ కురుమూర్తి, భాస్కర్, శ్రీకాంత్, శ్రీనివాస్, నగేష్, కనకాద్రి, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గొద్దు




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పంచాయతీలో ఎన్నికల సందడి మొదలైంది. ప్రస్తుతం నామినేషన్లు ప్రచారాలు తదితర పనుల్లో అభ్యర్థులు బిజీగా మారారు. అయితే మనకు ఎలాంటి నాయకులను ఎన్నుకోవాలన్నది మన చేతుల్లోనే ఉంది. ప్రతి ఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకొని జవాబుదారితనం ఉన్నవారిని ఎన్నుకున్నప్పుడే ఆయా ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుంది. అలాకాకుండా ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే మన ఓటు అనే నినాదాంతో ఉంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. మరికొందరు ఓటర్లు అందరిదగ్గర డబ్బులు తీసుకొని నచ్చినవారికి ఓటు వేయడానికి సిద్ధపడుతున్నారు. ఇంకొందరు ఓటుహక్కును వినియోగించకుండా ఉంటారు. అలాంటి పనులతో సమాజానికి ఎంతో నష్టం కలుగుతుంది. ప్రజల సమస్యలు తీర్చేవారు. అభివృద్ధికి పాటుపడే వారిని ఎన్నుకున్నప్పుడే గ్రామాలు బాగుపడతాయి. ఈవిషయాలను గమనించి ప్రజలు ముఖ్యంగా యువత అవగాహన కలిగి ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి. అలాగే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేవిధంగా అధికారులు సైతం అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యం.

**పోటా పోటీ కార్యచరణ :**

ఇన్నేళ్ల తర్వాత జిల్లాలో వచ్చిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల మధ్య ఎన్నికల వేడి బాగా కనిపిస్తుంది పంచాయతీ ఎన్నికలు అన్ని పార్టీలకు పోటిలో ఉన్న అభ్యర్థులకు ప్రతిష్టాత్మకం కావడంతో పల్లెల్లో ప్రచారం హోరేత్తిస్తున్నారు. మొదటి రెండోవిడత నామినేషన్లు పూర్తికాగా మూడోవిడత నామినేషన్ల పర్వం నిన్నటితో ముగిసింది. పోటిలో నిలిచిన అభ్యర్థులు మేనిఫెస్టోలు ప్రకటిస్తున్నారు. గెలుపొందితే గ్రామానికి పలనా అభివృద్ధి చేస్తామంటూ మేనిఫెస్టోలు ప్రకటిస్తున్నారు. సర్పంచ్‌కు వచ్చే గౌరవవేతనాన్ని పంచాయతీకి కేటాయిస్తానని కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని గ్రామాలకి కావాల్సిన సదుపాయాలను కల్పిస్తామని ప్రచారాలను నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లాకు మూడో స్థానం



అభినందించిన మంత్రి, జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/నారాయణపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్ 14 బాలుర క్రికెట్ పోటీలలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అండర్ 14 బాలుర క్రికెట్ జట్టు మూడో బహుమతి సాధించింది. ఈ సందర్భంగా అండర్ 14 క్రికెట్ జట్టు క్రికెటర్లకు యువజన సర్వీసుల శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింతగా రాణించి ప్రథమ స్థానంలో నిలిచేందుకు ప్రయత్నించాలని వారికి సూచించారు. రాష్ట్రస్థాయిలో అండర్ 14 క్రికెట్ పోటీల్లో మూడవ స్థానం సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో జరిగే పోటీలలోనూ చక్కటి ప్రతిభ చాటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జట్టు ఎంపికలో, రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలవడంలో తన వంతు కృషి చేసిన డివైఎస్ఓ శెట్టి వెంకటేష్‌ను కూడా కలెక్టర్ అభినందించారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకులను ఎంపిక చేసుకోండి

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** గ్రామపంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన అభ్యర్థులను అధికమెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద, వెంకటాపూర్, జీడిపల్లి గ్రామాలలో స్థానికసంస్థల ఎన్నికలలో భాగంగా నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, గ్రామస్తులు ఉన్నారు.

## బరిలో మాజీ నక్సలైట్

**ప్రజాపక్షం/అచ్చంపేట :** బుల్లెట్‌తోనే అధికారం వస్తుందని భావించిన నక్సలైట్ బ్యాలెట్‌తో విజయం సాధ్యమని బరిలోకి దిగిన సంఘటన అమ్రాబాద్ మండలకేంద్రంలో జరిగింది. అమ్రాబాద్ పట్టణ సర్పంచ్ పదవికి స్థానికమాజీ నక్సలైట్ చిగుర్ల నాగమణి(అలియాస్‌నాగమ్మ) సర్పంచ్ పదవికి దరఖాస్తు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే అమ్రాబాద్ మండలం ఈర్లపెంటకు చెందిన నాగమ్మ చదువుకోలేదు. ఆమె చెంచుతెగకు చెందిన మహిళ. గతంలో తల్లిదండ్రులు జీవనోపాధికొరకు పశువులకాపర్ల దగ్గర జీతం ఉండేవారు. ఆమె సమీప గ్రామంలోని వటువర్లపల్లి గ్రామంలో నివాసముండేవారు. ఆహారం కోసం వటువర్లపల్లి ఆశ్రమపాఠశాలకు వెళ్లి వస్తుండేది. ఇది గమనించిన ఉపాధ్యాయులు ఆమెను చేరదీసి పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించారు. తల్లిదండ్రులు ఈమెను బలవంతంగా కూలిపనులకు పంపించేవారు. చిన్నపిల్ల అయిన నాగమ్మ కూలిపనులకు వెళ్లలేక తప్పించుకొని వెళ్లి నల్లమలదళంలో చేరిం ది. దళ సభ్యురాలిగా ఐదు సంవత్సరాలు కార్యక్రమాల్లో పాల్గొన్నది. తల్లిదండ్రుల ఆరోగ్యం బాగాలేకపోవడంతో గతంలో ఆమె స్వచ్ఛందంగా వచ్చి అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. అనంతరం కూలిపనులు చేసుకుంటూ జనజీవనస్రవంతిలో కలిసిపోయింది. అనంతరం ఆమె వివాహం చేసుకోగా ముగ్గురు సంతానం కలిగింది. ఇటీవల ప్రభు త్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించడంతో తానుకూడా పోటి చేసి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొని ప్రజాసేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆమె తెలిపింది. తనకు బిజెపిపార్టీ మద్దతు ఇస్తున్నట్లు తెలపడం కొసమెరుపు.



## బాలికలకు మెడల్స్ అందజేత

**ప్రజాపక్షం/మక్తల్ :** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నుండి వెంకటామ్ పల్లి వరకు ఆదివారం బాలికలకు 5 కిలోమీటర్లు, బాలురకు 8 కిలోమీటర్లు సైకిల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బి.గోపాలం మెడల్స్‌ను అందజేసి అభినందించారు. గెలుపొందిన బాలికలు: శశి ప్రియ, మీనాక్షి, ఇందు, చందిన, ప్రవస్తి, జ్యోతి, సంజన, పూజ, సంగీత బాలురు: రాము, ఉదయ్, రక్షిత్, యశ్వంత్, వీరందరూ రాష్ట్ర స్థాయి సైకిలింగ్ పోటీలకు ఎంపికైనట్లు బి.గోపాలం తెలిపారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సైకిల్ అసోసియేషన్ ఇంచార్జ్ బి.గోపాలం, పీఈటీలు చిట్టెమ్మ, దేవేందర్ పాఠశాల ఏఎన్ఎం వెంకటమ్మ, సహాయకులు రజిత, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాల్ఘర్‌లో మాదకద్రవ్యాలతో వ్యక్తి అరెస్టు

**పాల్ఘర్ :** మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఆదివారం ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.6.23 లక్షల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకొని పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా డిసెంబర్ 4న నలసోపారా ప్రాంతంలోని ధనివ్‌బాగ్‌లో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.6లక్షల విలువైన బ్రౌన్ షుగర్, రూ.23,628 విలువైన నైట్రాజెపం (సైకోట్రోపిక్ డ్రగ్) మాత్రలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిని సలీం బాగియన్ అలియాస్ సర్దార్ చాచా (40)గా గుర్తించి, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డిపి ఎస్) చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు నేర చరిత్ర కలిగిన వ్యక్తి అని, అతనిపై గతంలో 12 కేసులు నమోదయ్యాయని, వాటిలో మూడు ఎన్‌డిపిఎస్ చట్టం కింద నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

# క్రీడ




## టీమిండియాకు షాకిచ్చిన జర్మనీ..

### ఇక మూడో, నాలుగో స్థానం కోసమే పోటీ!

హాకీ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత జట్టు పోరాటం ముగిసింది. ఆరంభం నుంచి అదరగొట్టిన టీమిండియా అనూహ్యంగా ఫైనల్ ఆడే అవకాశాన్ని చేజార్చుకుంది. ఓడిపోయింది. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ చేతిలో కంగుతిన్నది. దాంతో.. ఈ మెగా టోర్నీలో భారత జట్టు ఫైనల్ కలగానే మిగిలింది.. ఫైనల్లో స్పెయిన్‌తో జర్మనీ తలపడనుంది. చెన్నై వేదికగా జరుగుతన్న హాకీ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత జట్టు ఆఖర్లో తడబడింది. క్వార్టర్ ఫైనల్లో బెల్జియంపై 43తో సంచలన విజయం సాధించిన టీమిండియా సెమీస్‌లోనే ఇంటిదారి పట్టింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన పోరులో జర్మనీపై పైచేయి సాధించే అవకాశాల్ని భారత ఫార్వర్డ్ ఆటగాళ్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. దాంతో.. 15తో టీమిండియా ఓటమి పాలైంది. ఫైనల్ ఛాన్స్ మిస్ కావడంతో మూడో, నాలుగో స్థానం కోసం భారత్ తలపడనుంది. గతంలో హాకీ జూనియర్ వరల్డ్ కప్‌లో 2016లో భారత్ ఫైనల్ చేరింది. లక్నో వేదికగా జరిగిన టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది టీమిండియా.

## టి-20ల్లో సంచలనం..

### 9 పరుగులకే 6 వికెట్లు తీసిన ఐపిఎల్ స్టార్!



పొట్టి క్రికెట్‌లో మరో సంచలనం నమోదైంది. భారత దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో యువ పేసర్ అర్షద్ ఖాన్ చరిత్ర సృష్టించాడు. మధ్యప్రదేశ్‌కు ఆడుతున్న ఈ ఎడమచేతివాటం పేసర్ లీగ్ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. ఛండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో నిప్పులు చెరిగిన అర్షద్ కేవలం తొమ్మిది పరుగులే ఇచ్చి 6 వికెట్లతో ఔరా అనిపించాడు. స్మాట్‌లో ఇప్పటివరకూ బెస్ట్ బౌలింగ్ రికార్డు నెలకొల్పిన టి.రవి తేజ, అర్జాన్‌లను అధిగమించాడు అర్షద్. ఐపిఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అర్షద్ ఖాన్ స్మాట్‌లో రెచ్చిపోయాడు. ఆదివారం ఛండీగఢ్ బ్యాటర్లను క్రీజులో నిలవనీయని అర్షద్.. సంచలన స్పెల్‌తో 6 వికెట్లు తీశాడు. రెండో ఓవర్లోనే ఓపెనర్ అర్జున్ అజాద్, శివం భాంబ్రీను ఔట్ చేసిన ఈ ఎంపీ పేసర్.. తర్వాతి ఓవర్లో మరో వికెట్ పడగొట్టాడు. 19వ ఓవర్లో మూడు వికెట్లు తీసిన ఈ స్పీడ్‌స్టర్.. టోర్నీ చరిత్రలో అత్యంత ఉత్తమ బౌలింగ్(6/9) గణాంకాలు నమోదు చేశాడు. అర్షద్ ఖాన్ కంటే ముందు హైదరాబాద్ బౌలర్ రవితేజ, గుజరాత్ బౌలర్ అర్జాన్ నగ్వస్వల్లా 6/13తో స్మాట్‌లో రికార్డు నెలకొల్పారు. 2015లో సర్వీసెస్ పేసర్ డీఎస్ పూనియా 6/14, బరోడా స్పిన్నర్ స్వప్నిల్ సింగ్ 6/19తో అదరగొట్టారు. తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. అర్షద్ విజృంభణతో ఛండీగఢ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులకే పరిమితమైంది.

## స్మిత్-ఆర్చర్ వాగ్వాదం..




యాషెస్ సిరీస్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న ఆస్ట్రేలియా రెండో విజయంతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గబ్బాలో జరిగిన పింక్ బాల్ టెస్టులో ఇంగ్లాండ్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించిన ఆసీస్.. స్వదేశంలో తిరుగులేదని చాటుకుంది. ఇంగ్లండ కంగారూ ఆటగాళ్ల కవ్వింపులు.. వాగ్వాదాలు లేకుండా చప్పగా సాగుతున్న యాషెస్‌లో నాలుగో రోజు ఆసక్తికర సంఘటన జరిగింది. ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్, పర్యాటక జట్టు ప్రధాన పేసర్ జోఫ్రా ఆర్చర్ మాటల యుద్ధానికి దిగారు.

గబ్బా టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 241కే ఆలౌట్ చేసింది ఆస్ట్రేలియా. అనంతరం 65 పరుగుల ఛేదనలో ట్రావిస్ హెడ్ (22), మార్నస్ లబూషేన్ త్వరగానే ఔటయ్యారు. నాలుగో స్థానంలో క్రీజులోకి వచ్చిన స్టీవ్ స్మిత్(23 నాటౌట్) దూకుడుగా ఆడాడు. మరో వైపు అతడిని పెవిలియన్ పంపేందుకు ఆర్చర్ తీవ్రంగా ప్రయత్నించాడు. షార్ట్ పిచ్ బంతులు సంధించిన ఇంగ్లండ పేసర్.. చివరకు నోటికి పనిచెప్పాడు. అయితే.. ఆసీస్ సారథి కూడా ఏమాత్రం తగ్గలేదు.

**అసలేం జరిగిందంటే..**

స్మిత్‌ను ఔట్ చేసేందుకు ఆర్చర్ షార్ట్ పిచ్ బంతులు విసిరాడు. కానీ, స్మిత్ ఏమాత్రం తడబడలేదు. ఫుల్‌షాట్‌తో బౌండరీ సాధించిన అతడు.. ఆ తర్వాత బంతిని అప్పర్‌కట్ ఆడబోయి మిస్ అయ్యాడు.. అప్పుడు ఆర్చర్ స్మిత్‌ను ఉద్దేశించి నోరుజారాడు. ఇంగ్లాండ్ పేసర్ తీరుతో చిర్రెత్తుకొచ్చిన స్మిత్ ఏదీ కలిసిరానప్పుడు వేగంగా బౌలింగ్ చేయొచ్చుగా ఛాంపియన్ అని ఆర్చర్‌కు కౌంటర్ ఇచ్చాడు. అంతేకాదు ఆ తర్వాత రెండు బంతులకు 10 రన్స్ సాధించాడు. మ్యాచ్ పూర్తయ్యా ఆర్చర్‌తో వివాదంపై ప్రశ్నించగా.. అదంతా మైదానంలోనే ముగిసింది. అతడు ఛాంపియన్ బౌలర్ అని జవాబిచ్చాడు స్మిత్. ఇంగ్లాండ్ ఆసీస్ మధ్య డిసెంబర్ 17న అడిలైడ్‌లో మూడో టెస్టు జరుగనుంది.

# ఆరోగ్యం

## ఫోకస్



## మెరుగైన నిద్ర కోసం 'కాగ్నిటివ్ షఫ్లింగ్ హ్యాక్'

రాత్రిళ్లు ఆలోచనలు ఆగకుండా తిప్పికొడుతున్నాయా? మీ మెదడును ప్రశాంతం చేయడానికి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కాగ్నిటివ్ షఫ్లింగ్ అనే పద్ధతి ఉపయోగపడవచ్చు. ఇది త్వరగా నిద్రపోవడానికి సహాయపడే సులభమైన మానసిక వ్యాయామం. దీనిని మొదట కెనడియన్ కాగ్నిటివ్ శాస్త్రవేత్త డాక్టర్ లూక్ పి.బోడువిన్ అభివృద్ధి చేశారు. దీని సూత్రం చాలా సాధారణం... సంబంధం లేని, యాదృచ్ఛిక చిత్రాలు లేదా దృశ్యాలను మనసులో ఊహించుకోవడం. ఉదాహరణకు జాతరలో పంచదార కమ్మని పట్టుకుని ఉండటం, క్యాంపింగ్‌కు వెళ్లి స్లీపింగ్ బ్యాగ్‌లో పడుకోవడం, పార్క్‌లో ఫ్రిస్బీ విసరడం వంటి ఏవైనా యాదృచ్ఛిక దృశ్యాలు. 2016లో 154 మంది విద్యార్థులతో నిర్వహించిన ఒక చిన్న అధ్యయనం ద్వారా పద్ధతి నిద్ర నాణ్యతను మెరుగుపరిచిందని, నిద్రకు ముందు వచ్చే మానసిక ఆందోళన తగ్గిందని తెలిసింది. ఇది ఎలా పనిచేస్తుంది? అదేది ప్రశ్న. శాస్త్రవేత్తలు చెప్పున్న దాని ప్రకారం, మన మెదడు అర్థవంతమైన ఆలోచనలు నుంచి యాదృచ్ఛిక ఆలోచనలు వైపు మారితే నిద్రకు వెళ్ళడం సులభమవుతుంది. కాగ్నిటివ్ షఫ్లింగ్, సిబిటి (కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ), యోగా నిద్ర వంటి పద్ధతులకు దగ్గరగా ఉంటుంది. ఇవి శరీరాన్ని రిలాక్స్ చేసి, మనసును తేలిక చేయడంలో సహాయపడతాయి. యాదృచ్ఛిక, నిర్దోషకరమైన దృశ్యాలు మనసుకు సమస్య లేదనే సంకేతం ఇస్తాయి. దీని వల్ల ఆందోళనాత్మక ఆలోచనలు తగ్గుతాయి.

**కాగ్నిటివ్ షఫ్లింగ్‌ను ఎలా ప్రయత్నించాలి?**

ఒక అక్షరంతో మొదలు పెట్టండి: ఉదాహరణకు 'ప' అక్షరంతో మొదలయ్యే పదాలను యాదృచ్ఛికంగా ఆలోచించండి.. అంటే పాప, పాలు, పాట.. ఇలా ఆలోచిస్తూ, తర్వాత క్రమంలో మరో అక్షరానికి మారండి. అక్కడ పదాన్ని కాకుండా దానికి సంబంధించిన దృశ్యాన్ని ఊహించండి. ఉదాహరణకు కుక్క అనే పదం కాకుండా మీ కుక్కతో ఆడుతున్న దృశ్యాన్ని ఊహించుకోవాలి. మీరు ఆ దృశ్యంలో భాగమై ఉండాలి. ఉదా: పాప్‌కార్న్ తినడం కాకుండా థియేటర్‌లో మీరు పాప్‌కార్న్ తీస్తున్న దృశ్యం. ఈ పద్ధతి హానికరం కాదు. అయితే మీరు తరచుగా నిద్రలేమితో బాధపడుతుంటే, ఇది ఒక నిద్రా సమస్యకు సంకేతం కావచ్చు. రోజు పనుల్లో ఆటంకం, దృష్టి సమస్యలు, చిరాకు, డ్రైవింగ్ సమస్యలు ఉన్నప్పుడు నిద్ర నిపుణుడిని సంప్రదించడం అవసరం.


## మీకు తెలుసా?



నిత్యం మనం తినే కూరగాయలు, ఆకు కూరల్లో అనేక పోషకాలు ఉంటాయి. అవన్నీ మన శరీరానికి ఉపయోగకరమైనవే. కానీ వాటి గురించి చాలా మందికి తెలియదు. కూరగాయలు, ఆకుకూరల్లో మన శరీరాన్ని అన్ని విధాలుగా సమతుల్యం చేసే పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ ఉంటాయి.

- కాలిఫ్లవర్లో కోలిన్ అనబడే పదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని అమాంతం పెంచుతుంది. అందువల్ల దీన్ని చిన్నారులకు ఇస్తే మంచిది. దీని వల్ల వారి మెదడు ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. చదువుల్లో రాణిస్తారు.
- ఒక నారింజ పండులో ఉండే విటమిన్ సికి రెట్టింపు స్థాయిలో విటమిన్ సి ఒక క్యాప్సికంలో ఉంటుంది. అందువల్ల దీంతో శరీరో నిరోధక శక్తి పెరగడమే కాదు, కొవ్వు కూడా కరుగుతుంది.
- రోజూ అల్పాహారం అనంతరం ఒక కప్పు టమాటా జ్యూస్‌ను తీసుకుంటే, బిపి, గుండెపోటు, సుగర్ వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు.
- దగ్గు, ఆయాసం, తుమ్ములకు గోంగూర (పుంటి కూర) చక్కని ఔషధం!
- పుదీనాలో రోజ్మరినిక్ యాసిడ్, మెథనాల్ అనే సమ్మేళనాలు ఉంటాయి. అందువల్ల డిప్రెషన్, అలర్జీలు తగ్గుతాయి.
- పాలకూరలో ఐరన్ కన్నా ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల గర్భిణులకు ఇది చాలా మేలు చేస్తుంది. వారికి ఫోలిక్ యాసిడ్ చాలా అవసరం ఉంటుంది. కనుక వారు పాలకూరను నిత్యం తినాలి.
- పచ్చి బఠానీల్లో ఎల్‌అర్జైనైన్ అనబడే సమ్మేళనం ఉంటుంది. ఇది వెజిటేరియన్ ఆహారాలను మాత్రమే తినేవారికి ఉత్తమమైన ప్రోటీన్‌గా పనిచేస్తుంది. ప్రోటీన్లు కావాలనుకునే శాకాహారులు పచ్చి బఠానీలను తినవచ్చు. దీంతో శరీరానికి శక్తి కూడా లభిస్తుంది.

## ఒత్తిడి తగ్గాలంటే..



తీవ్రమైన మానసిక ఒత్తిడిని తగ్గాలంటే, చూసిన టీవీ సీరియల్స్‌ను లేదా సినిమాలనే మళ్లీమళ్లీ చూడమంటున్నారు పరిశోధకులు. చాలా మంది ఒకసారి చూసిన కార్యక్రమాన్ని లేదా సినిమాను మళ్లీ చూడడానికి ఇష్టపడరు. ఆ విధంగా చూసే వారిని మందలిస్తారు కూడా. అయితే, వివిధ పరిశోధనలను అనుసరించి, ఒకే టీవీ లేదా సినిమాలు మళ్లీ మళ్లీ చూడటం కేవలం వినోదం మాత్రమే అనుకుంటే పొరపాటే. ఇది నాడీవ్యవస్థను సరిచేసుకునేందుకు సహాయపడే శక్తివంతమైన పద్ధతి. అప్పటికే సదరు కార్యక్రమాన్ని లేదా సినిమాను చూసి ఉంటాం కాబట్టి, ఏం జరుగుతుందోనన్న ఆత్రుత ఉండదు. కథ లేదా సన్నివేశం ఎలాంటి మలుపులు తిరుగుతుందోనన్న తీవ్ర ఉత్కంఠ అసలే ఉండదు. అంతేకాదు, ఒక విషయాన్ని ముందుగానే అంచనా వేయగలిగలిగామనే అనుభూతిని కలిగిస్తుంది. ఈ అనుభూతి మెదడును శాంతపరుస్తుంది. ఒత్తిడి ప్రతిస్పందనలను తగ్గించడంలో సహాయపడుతుంది. అప్పటికే తెలిసిన కథా ప్రక్రియలు, పాత్రలు తిరిగి కనిపించడం వల్ల నాడీవ్యవస్థ ఎలాంటి ఒత్తిడి లేకుండా పని చేస్తుంది. ఫలితంగా కార్టిసాల్ స్థాయులు తగ్గుతాయి. ఫలితంగా భావోద్వేగాల నియంత్రణ మెరుగవుతుంది. ఆందోళన తగ్గుతుంది. అలాగే, ఊహించలేని ప్రపంచంలో ఒక రకమైన నియంత్రణ భావనను కల్పిస్తుంది. ఈ విధంగా ఉద్దేశ్యపూర్వకంగా మళ్లీ చూడడాన్ని స్వీయ సంరక్షణలో భాగం చేయడం వల్ల ఒత్తిడిని నియంత్రించవచ్చు. భావోద్వేగాలను శాంతపరచవచ్చు. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. కాబట్టి, ఒత్తిడి తగ్గడానికి అందుబాటులో ఉన్న, అత్యంత సులభమైన ఈ మార్గాన్ని అనుసరించడం మంచిది. దీని వల్ల లాభం మాటల ఎలావున్నా, నష్టం మాత్రం ఉండదు.

# టెండర్ల నిర్వహణలో అవకతవకలు?

### టెండర్ల అన్నింటికీ ఒకే గడువు ఉండదా? ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన ఒక్కటే కానీ.. తేదీలు వేరు ఇదేమి చోద్యం?



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విచిత్రంగా ఉంది. ఇటీవల సివిల్, ఎలక్ట్రికల్, విభాగానికి యాదగిరిగుట్ట దేవస్థానం వారిచే ఈ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన విడుదల చేసింది. మొత్తం 23 రకాల విభాగాలకు ఆన్లైన్ దరఖాస్తులు దేవస్థానం ఆహ్వానించింది. బిడ్డు సమర్పించుటకు చివరి తేదీ డిసెంబర్ 1 అని, టెక్నికల్ బిడ్డు తెరచు సమయం 2వ తేదీ సాయంత్రం 4:00 గంటలకు అని తాటికాయంత అక్షరాలతో నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ గడువు మించిపోయినప్పటికీ టెండర్ నిర్వహించక అధికారులు గడువును పొడిగిస్తూ వస్తున్నారు. ఔత్సాహితుల వ్యక్తిగత ప్రయోజనాలకు అధికారులు గడువును పొడిగిస్తున్నారని స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక కొంతమంది కాంట్రాక్టర్లు అధికారులతో కుమ్మక్కై టెండర్లను నిర్వహించకుండా అడ్డుపడుతున్నారని పట్టణంలో గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఎలక్ట్రికల్ విభాగానికి డిసెంబర్ 4 నాడు ముగిసిందని, సివిల్ విభాగానికి డిసెంబర్ 8 వరకు గడువు ఉందని సంబంధిత అధికారులే రెండు రకాలుగా మాట్లాడడం విడ్డూరంగా ఉంది. నిజానికి తేదీలు పెంచినట్లయితే ప్రోత్సాహితులకు అధికారులు సమాచారం ఇవ్వాల్సింది ఉండగా నేటికీ ఇవ్వకపోవడంపై అనుమానాలకు దారితీస్తున్నాయి. ఒకసారి టెండర్ ప్రకటన విడుదలయితే ఏది ఏమైనా చివరి తేదీ తప్పనిసరిగా పాటించాల్సిందే. కానీ అధికారులు తీరు అనుమానాలకు దారితీస్తున్నాయి. టెండరు ప్రకటన విడుదలపై, ముగింపు తేదీలపై సదరు అధికారి ఈఈ దయాకర్ రెడ్డిని వివరణ కోరగా నిబంధనల మేరకే పొడిగించామని, గతంలో కూడా పదిసార్లు తేదీలను పొడిగించడం జరిగిందని ఆయన అన్నారు. మరి అలాంటప్పుడు దేవస్థానం విడుదల చేసిన టెండర్ ప్రకటనకు విలువ లేదా? ఉంటే అధికారులు పాటించనవసరం లేదా? అనే అనుమానాలు అనేకంగా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన మరోసారి విడుదల చేసి భక్తులలో ఉన్న అనుమానాలను పోగొట్టవలసిన బాధ్యత అధికారుల పైన ఎంతైనా ఉంది.

## పార్టీలకు అతీతంగా పేదలకు అభివృద్ధి ఫలాలు

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### సిపిఐ గూటికి చేరిన పలువురు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పార్టీలకు అతీతంగా పేదలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు గత రెండేళ్లుగా అహర్నిశలు కృషి చేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ, హమాలీ కాలనీ, ప్రశాంత్ నగర్, లక్ష్మీ దేవిపల్లి, లోతువాగు, సంజయ్ నగర్, సాటివారిగూడెం గ్రామాల్లో సిపిఐ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులను గెలిపించాలని ఆయా గ్రామాల్లో ముఖ్యనేతలకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కష్టకాలంలో ప్రజలు సిపిఐని ఆదరించారని, అలాంటి సందర్భంలో కొందరు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, నియోజకవర్గాభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా పేదలకు, అండగా రెండేళ్లుగా చేస్తున్న పనులు గమనించి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎన్నుకోవాలని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి సిపిఐ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, అభివృద్ధికి పట్టం కట్టడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, మండల ముఖ్యనాయకులు, పంచాయితీ బరిలో ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మద్ధతుదారులు, అభిమానులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాటం : తమ్మెర

### సిపిఐలో భారీగా చేరికలు



**ప్రజాపక్షం/తొర్రూరు :** సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాడుతుందని పార్టీ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఓమ భిక్షపతి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని కంతాయపాలెం గ్రామంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి ఆవుల శ్యామలత ఉపేందర్‌కు మద్ధతు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం చేసిందన్నారు. ఈ నిర్ణయం మేరకు గ్రామంలో పలువురు సిపిఐలో భారీగా చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. ఐదవ వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్న ఆవుల చేరాలు అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మందపురి శ్యామ్, మండల నాయకులు పేరబోయిన కిరణ్, ఐలయ్య, సాయిరెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు అక్కా చెల్లెళ్లు



**ప్రజాపక్షం/మిర్యాలగూడ (త్రిపురారం) :** నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం సత్యం పహాడ్ గ్రామపంచాయితీ తండా పరిధిలోని నడిమి తండాకు చెందిన లావుడి హరినాయక్, నీల దంపతుల కుమార్తెలు లావుడి గాయత్రి, ప్రియాంకలు చదువుతోపాటు బాస్కెట్ బాల్ క్రీడలలో స్కూల్ గేమ్స్ స్థాయి నుంచి మండల డివిజన్ జిల్లా స్థాయి వరకు తమ ప్రతిభను కనబరిచారు. ఇటీవల మహబూబాద్ జిల్లా గార్ల లోని నిర్మల హైస్కూల్లో జరిగిన అండర్ 19 బాలికల బాస్కెట్బాల్ స్టేట్ లెవెల్ లో సెలెక్ట్ అయి తమ ప్రతిభను కనబరిచారు. జనవరిలో జరగబోయే జాతీయ స్థాయి బాస్కెట్బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. ఒక తాండలోని నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈ ఇద్దరు కుమార్తెలు నేషనల్ స్థాయి బాయ్ బాస్కెట్ బాల్ క్రీడలలో సెలెక్ట్ అయినందుకు వీరి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద కూతురు లావుడి గాయత్రి సూర్యాపేటలోని విద్యానగర్ లో గల శ్రీ లక్ష్మి వెంకట సాయి వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంపిహెచ్ డబ్ల్యు, ఫిమేల్ సెకండ్ ఇయర్ చదువుతుంది, అదేవిధంగా చిన్న కూతురు పెన్ పహాడ్ మండలం అనాజిపురం గ్రామంలోని తెలంగాణ మోడల్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతుంది వీరు చిన్ననాటి నుండి బాస్కెట్బాల్ లో ప్రతిభను కనబరిచి నేషనల్ స్థాయిలో ఎంపిక కావడం గర్వకారణం గా ఉందని తల్లిదండ్రులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఇద్దరు నేత్రాలు నలుగురికి కంటిచూపు

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** నల్లగొండ పట్టణ పరిధిలోని !మర్రిగూడ ప్రాంతానికి చెందిన, సిరిప్రగడ లక్ష్మణరావు, అదేవిధంగా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్, హైటెక్ కాలనీ ప్రాంతానికి చెందిన,వైద్యం చంద్రకళ ఆదివారం మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యుల అనుమతితో వారి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ వీరి మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా నలుగురు కార్నియల్ అంధులకు కంటివెలుగు ప్రసాదించడానికి సాక్ష్యాలైన ఘనతతో నిలిచారని, మానవతా విలువలు ఇంకా జీవించి ఉన్నాయని చాటిచెప్పిన ఈ కుటుంబానికి సమాజం తరపున అభినందనలు తెలుపుతున్నాం అన్నారు. నేత్రదానం పట్ల కుటుంబ సభ్యులు చూపిన అంకితభావం ఎంతో ప్రశంసనీయము అని వీరి నిర్ణయంతో మరణానంతరం కూడా వారి సేవ కొనసాగుతుందని, శరీరం నశించినా, మన కళ్ల వెలుగు మరొకరి జీవితాన్ని వెలిగిస్తుంది అనే మహోన్నత భావాన్ని వీరు నిరూపించారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ ప్రెసిడెంట్ లయన్ నిమ్మల పిచ్చయ్య, కార్యదర్శి అశోక్ ఎర్రమాద, కోశాధికారి ఆదినారాయణ,కోఆర్డినేటర్లు కోట సరిత , కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్ చంద్రశేఖర్ చిరునోముల ఉన్నారు.




## సాయి ఈశ్వరచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సాయి ఈశ్వరావ్ చారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బిసి సంఘాల నాయకులు పంతం రవి, బొజ్జ కనకయ్య, బుర్ర మల్లేశం లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ చౌక్ లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆత్మహత్యలు సరైన విధానం కాదనీ పోరాడి సాధించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయి ఈశ్వర చారి ఆత్మ హత్యతో నైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో 42 శాతం బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణు, సోమ నాగరాజు, రజని, సాగర్ పాల్గొన్నారు.

## బత్తినేని చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/బోనకల్ :** బత్తినేని చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు అభినందనీయమని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశ్‌రావు జ్ఞాపకార్థం బిపి, షుగర్, కంటి ప్రత్యేక వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు బత్తినేని చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు వరమన్నారు. మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు సిలివేరు సదానందం మాట్లాడుతూ రక్తపోటు అధికంగా ఉన్న వారు బరువు పెరుగుదలను నియంత్రించుకుంటూ కొవ్వు పదార్థాలు, వేపుళ్లు, కేకులు, జంక్ ఫుడ్స్‌కి చాలా వరకు దూరంగా ఉండాలన్నారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, వైద్యులు సూచించిన విధంగా ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ క్యాంపు వైద్యులు సదానందం వైద్య సేవలు అందించగా బత్తినేని ట్రస్టు సభ్యులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, ఆర్ఎంపి డబ్ల్యూ ఎటిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు చేతుల మీదుగా పేషెంట్లకు మందులు పంపిణీ చేశారు.



కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏలూరి పూర్ణచందు, మాతంగి శ్రీనివాసరావు, కొంగర కృష్ణయ్య, బోళ్ల ప్రసాద్‌రావు, సహాయకులు యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఉచిత వైద్యం పేదలకు వరం

**ప్రజాపక్షం/దుండిగల్:** బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లి ఇందిరామ కాలనీ లో 11వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందంతో కలిసి జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు సాధు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, పరశురాం గౌడ్, ధర్మారెడ్డి, రాంబాబు గౌడ్, గోపాల్ రెడ్డి, చారి, నాయ కులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి
### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా రోడ్డు ట్రాన్సుపోర్టు అథారిటీ అధికారులతో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి కేంద్రికరించాలన్నారు. అధిక లోడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఓ జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కీసర రామలింగేశ్వరుడి సన్నిధిలో మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/దమ్మాయిగూడః** కీసరగుట్ట రామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమం,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు.ఆదివారం మేడ్చల్ జిల్లా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయనను అలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాటాకం నారాయణశర్మ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్,సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలుకు పట్టు



**ప్రజాపక్షం/నాగారంః** బిజెపి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహ ధర్నా కార్యక్రమానికి నాగారం మున్సిపాలిటీ బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లు అయిన అమలు కాని హామీలు కోసం నిర్వహించిన మహాధర్నాకు విచ్చేసి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చర్లపల్లి/కాప్రా:** డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని టిఎస్ఐఐసి కాలనీ లయన్స్‌క్లబ్ లైన్స్‌క్లబ్ భవనంలో కమ్మ సేవా సమితి కాప్రా అధ్యక్షులు చల్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఉత్తమ టీచర్‌గా రాష్ట్రపతి అవార్డు అందుకున్న కోగంటి రాంమ్మోహన్‌రావు, కమ్మ సంఘం అధ్యక్షులు పొట్లూరి రామకృష్ణ, జనాభ్యుదయ సంఘం సెక్రెటరీ సోమేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు,ముప్పాళ్ల సాంబశివ రావు చేతుల మీదుగా కమ్మ సేవా సమితి కాప్రా 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కమ్మ సేవా సమితి ఉపాధ్యక్షులు పాటిబండ్ల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ వెంకటరమణ,ట్రెజరర్ హరనాథ్,హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


**ప్రజాపక్షం/నవాబుపేట్:** చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన నవాబుపేట్ మండలం నారేగూడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే నవాబుపేట్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో నారేగూడ గ్రామానికి చెందిన చేవెళ్ల శ్రీనివాస్ గంగ్యాడ మూసి వాగులో చేపలకు వెళ్లి మృతి చెందినట్లు మృతుని అన్న చేవెళ్ల రాజు నవాబుపేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. తన తమ్ముడు చేవెళ్ల శ్రీనివాస్‌కు (37) సంవత్సరాలు. కూలి పని చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం. 9:00 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మంగలి రవి, నాగవల్లి పెంటయ్యలతో కలిసి చేపలు పట్టేందుకు గంగ్యాడా వాగులోకి వెళ్లారు. తిరిగి తమ్ముడు శ్రీనివాస్ ఇంటికి రాలేదు. మిగతా ఇద్దరూ రాత్రికే వాళ్ల వాళ్ల ఇళ్లకు చేరుకున్నారు. తమ్ముడి గురించి అడిగితే సరిగ్గా బదులివ్వలేదన్నారు.అనుమానం వచ్చి గ్రామస్తులతో కలిసి గంగ్యాడ వాగులో వెతికామని, వాగు గడ్డమీద బట్టలు, నీళ్లలో తమ్ముడు మృతదేహం కనిపించాయన్నారు. ఇదిలా ఉండగా తమ్ముడితో పాటు వెళ్లిన ఇద్దరు వ్యక్తులపై అనుమానం ఉన్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుని అన్న ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నవాబుపేట ఎస్సై జీ. పుండ్లిక్ తెలిపారు.

## కైలాసగిరి కాలనీ సంక్షేమానికి కృషి



**ప్రజాపక్షం/కాప్రా:** హెచ్‌బి కాలనీ డివిజన్ కైలాసగిరి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ అధ్యక్షులు వంగ యాకయ్య, ఉపాధ్యక్షులు రాందాస్ నాయక్, కార్యదర్శి దామెర కుమార్, సంయుక్త కార్యదర్శి ఎర్ర సామ్‌సన్, కోశాధికారి పాటి రాంరెడ్డి, ఎన్నికయ్యారు. ఆదివారం కార్యవర్గ ప్రమాణం కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ అధ్యక్షతన జరిగింది. కాలనీ సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

# గ్లోబల్ సమ్మిట్‌కు నగరం ముస్తాబు





**హైదరాబాద్ :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా హైదరాబాద్ నగరం ముస్తాబైంది. ఓ వైపు అత్యాధునిక టెక్నాలజీ హంగులు.. మరోవైపు తెలంగాణ ప్రత్యేక ఆకర్షణల మేళవింపుతో ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రముఖ ప్రదేశాలు, చెరువులు, రహదారులు, సమిట్ వేదిక.. ఇలా అన్ని చోట్లా హైటెక్ ప్రొజెక్షన్లు, డిజిటల్ రూపంలో ప్రదర్శనలు, ఆధునిక విజువల్ ఎఫెక్టులతో ప్రత్యేకంగా పెట్టుబడుల పండగ వాతావరణం సృష్టించారు. చార్మినార్, కాచిగూడ రైల్వే స్టేషన్ భవనంపై ప్రత్యేక లైటింగ్ ప్రొజెక్షన్ ఏర్పాటు చేసి నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ అతిథులకు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చూపించనున్నారు. సచివాలయం వద్ద త్రీడి ప్రొజెక్షన్ మ్యాపింగ్‌తో రాష్ట్ర అభివృద్ధి తీరును, భవిష్యత్ లక్ష్యాలను ఆకర్షణీయంగా చూపించడానికి ప్రణాళిక రూపొందించారు. రైజింగ్ తెలంగాణ విజన్ 2047 లక్ష్యాలు అందరికీ అర్థమయ్యే రీతిలో డిస్ ప్లేలు ఏర్పాటు చేశారు. దుర్గం చెరువులో ప్రత్యేక ఆకర్షణగా గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రొజెక్షన్.. ఇందులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ లోగోను ఇన్‌లిట్ టెక్నిక్‌తో ప్రదర్శించనున్నారు. హుస్సేన్ సాగర్‌లో వాటర్ ప్రొజెక్షన్ ద్వారా భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువతరైతు ప్రధాన కార్యక్రమాలు, 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం వంటి ముఖ్య అంశాలను ప్రదర్శించనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమిట్ వేదిక వరకు వెళ్లే రోడ్డుపై భారీ డిజిటల్ ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ స్క్రీన్లపై భారత్ ఫ్యూచర్ సిటీకి ఎలా చేరుకోవాలి.. ఎంత దూరం.. వంటి వివరాలు పొందుపరిచారు. నగర వ్యాప్తంగా గ్లోబల్ సమిట్ లోగోతో తయారు చేయించిన 1500 రంగురంగుల జెండాలతో వేడుక వైభవాన్ని చాటనున్నారు. హైదరాబాద్ నగరంలో పది వేర్వేరు ప్రదేశాల్లో ప్రత్యేక సమాచార స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ గ్లోబల్ సమిట్‌కు సంబంధించిన వివరాలు, ఫ్యూచర్ సిటీ ప్రణాళిక, డిజిటల్ స్క్రీన్లపై విజువల్స్, సమిట్ బ్రోచర్లు అందుబాటులో ఉంచనున్నారు. వలంటీర్లు ప్రజలకు సమిట్ డైలీ షెడ్యూల్‌ను వివరించి అవగాహన కల్పించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

## ప్రసన్నం కోసం ముమ్మర యత్నం



**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లా లోని మొదటి విడుత ఎన్నికల ప్రచారం జోరందుకుంది.తాండూర్ నియోజకవర్గంలోని యాలాల్, బషీరాబాద్, తాండూర్, పేద్దేముల్ , కొడంగల్ మండల పరిధిలోని దుద్యాల్ , కొడంగల్ ,దౌల్తాబాద్ , బొంరాస్‌పేట్ మండలలో మొదటి విడుత ప్రచారం కొనసాగుతుంది రెండవ విడుత వికారాబాద్ నియోజకవర్గంలోని ,నవాబ్‌పేట్, మోమిన్‌పేట్ ,కోట్‌పల్లి ,బంట్వారం , మర్పల్లి ,ధారూర్ , వికారాబాద్ నియోజకవర్గంలో నామినేషన్లు ఉపసంవరణతో అభ్యర్థులు ఇంటింటి ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడనికి అభ్యర్థులు అన్ని విధాల ప్రయత్నలు చేస్తున్నారు. అభ్యర్థుల గెలుపు కోసం సామాజిక సమికరణలు చేస్తున్నారు. గ్రామంలోని ఏ ఓటర్ ఏ అభ్యర్థికి ఓటు వేయవచ్చో.. అనే చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కొందరు అభ్యర్థులు ప్రైవేట్ వ్యక్తులతో సర్వేలు చేయించుకుంటున్నారు. గ్రామంలో సర్పంచ ఎవరు గెలుస్తారు అని, గెలువడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు సర్పంచు అభ్యర్థులు.

## కరాటేలో మేడ్చల్ విద్యార్థుల అంతర్జాతీయ ప్రతిభ
### ఆదర్శంగా నిలుస్తున్న యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్స్ అకాడమీ




**ప్రజాపక్షం/మేడ్చల్ :** కొంపల్లిలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు బంగారు, రజత పతకాలను కైవసం చేసుకొని సత్తా చాటారు. చిన్న వయసులోనే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపుతున్న ఈ విద్యార్థులు మరోసారి మేడ్చల్ పేరు గర్వంగా వినిపించారు. ఈ విజయాలను పురస్కరించుకొని మేడ్చల్ బిజెపి పట్టణ అధ్యక్షురాలు శైలజ హరినాథ్, కెఎల్ఆర్ వెంచర్ ప్రెసిడెంట్ గర్దాస్ నరేందర్, మహేందర్, లింగం, సురేష్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ఈ స్థాయికి తీసుకువెళ్లడంలో సీనియర్ కరాటే మాస్టర్ సాయికుమార్ పాత్ర అపారమని అన్నారు. చిన్నారుల్లో క్రమశిక్షణ, ధైర్యం, పోరాటస్ఫూర్తి పెంపొందించేలా ఆయన అందిస్తున్న శిక్షణ అంతర్జాతీయ ప్రమాణాలలో ఉంటుంది. విద్యార్థులు వరుసగా సాధిస్తున్న పతకాలు సాయికుమార్ అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి అని ప్రశంసించారు. మేడ్చల్‌లో క్రీడల అభివృద్ధికి సాయికుమార్ చేస్తున్న సేవలు అమూల్యమని, శిక్షణలో ఆయన చూపే క్రమశిక్షణ, పట్టుదల వల్లే పసిపిల్లలు అంతర్జాతీయ స్థాయికి చేరుకోగలుగుతున్నారని అన్నారు. ఇదిలా ఉండగా, రాబోయే ఏప్రిల్ నెలలో మలేషియాలో జరగబోయే అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ కోసం యూనివర్సల్ 369 అకాడమీ నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కరాటే మాస్టర్ సాయి కుమార్ తెలిపారు. ఈ పోటీల కోసం ప్రపంచస్థాయి ప్రత్యేక శిక్షణ పొందేందుకు జి.అక్షయ, మున్నా కుమార్, వీరభద్ర, వరుణ్ తేజ్ లను కూడా ప్రత్యేకంగా ఎంపిక చేసి మలేషియాకు పంపించనున్నారు. విద్యార్థులు సాధిస్తున్న ఈ విశేష విజయాలు మేడ్చల్ పట్టణం క్రీడల రంగంలో వేగంగా ఎదుగుతున్న సూచికలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## విద్యాభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/-పెద్దేముల్ః** తనను ఆదరించి ఆశీర్వదిస్తే కందనెల్లి తాం డను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి తాండ సర్పంచ్‌గా అభ్యర్థిగా టిఆర్ఎస్ పార్టీ బలపర్చిన రామవత్ శాంత సురేందర్‌నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జాగో బంజార మాజ్ వ్యవస్థాపకులు సురేందర్ నాయక్‌తో కలసి వారు తాండలో వారు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ మెజార్టీతో గెలిపిస్తే కందనెల్లి తాండాను నియోజకవర్గంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు. తాండాలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తూ కనీస మౌళిక సదుపాయాలు వీధి దీపాలు, మురుగు కాలువలు నిర్వహణ, విద్య వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు శ్రమిస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు.

## కార్యకర్తలను సర్పంచ్‌లుగా చేయడమే లక్ష్యం
### గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు
### తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరుః** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సర్పంచ్‌లుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దేముల్ మండల పరిధి బండమీదిపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నత్తి కృష్ణ, తట్టేపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి నారాయణ గౌడ్, జయరాంతాండ సర్పంచ్ అభ్యర్థి ఎం నగీనా, మ్లానాయక్ తాండా సర్పంచ్ అభ్యర్థి సుమిత్ర రాథోడ్‌లకు మద్దతుగా ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఎంఎల్ఎ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను భారి మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్న ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒకదాని వెంబడి ఒకటి నెరవేర్చడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే సంక్షేమం సాధ్యమన్నారు. మరో ఆరు మాసాలలో మహిళలు మహిళ భరోసా కింద రూ.2500 లు అందజేస్తామని అన్నారు. నిరుపేదలకు ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కట్టించేరని, వారు చర్చకు సిద్దమా అని ప్రశ్నించారు. తెలంగాణనుఅప్పుల పాలు చేసిన కేసిఆర్ కుటుంబం సంపాదించుకున్నారని ఆరోపించారు. ఆ లాంటి వారు పంచాయతీ ఎన్నికల్లో ఒట్లు అడగటానికి మీ ముందుకు వస్తున్నారని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ముగిసిన వెంటనే నిరుద్యోగలకు 40వేలఉద్యోగాలు అందించెందుకు నోటిఫికేషన్ రాబోతుందన్నారు. ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారమని అన్నారు. తాండూరులో కచ్చితంగా ఐటిఐ ఏర్పాటు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం, కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు అప్పు, నాయకులు స్థర్దార్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, రియాజ్ , స్థానిక నాయకులు గౌరోల్ల మల్లప్ప, తదితరులు ఉన్నారు.

## హైడ్రా బాధితులకు బిఆర్ఎస్ అండ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మల్లాపూర్ డివిజన్ పరిధిలో హైడ్రా కూల్చివేత బాధితులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు.ఇటీవల డివిజన్‌లోని కమల బాయి నగర్, దుర్గానగర ప్రాంతంలో హైడ్రా ఇళ్లను కూల్చివేయటం వల్ల రోడ్డున పడ్డ కుటుంబీకులు ఆదివారం కార్పొరేటర్ వార్డు కార్యాలయానికి చేరుకొని తమ గోడు వెళ్లబొసుకొన్నారు. చాలీ చాలని జీతాలతో కష్టపడి కూడబెట్టుకొని ఇళ్లు కట్టుకొని ప్రశాంతంగా జీవిస్తున్న తరుణంలో హైడ్రా అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తమ తప్పిదాలు లేనప్పటికి నిర్ధాక్షిణ్యంగా తమ ఇళ్లు కూల్చివేసి నిరాశ్రయులను చేసారని ఆవేదన వ్యక్తం చేసారు. తమకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేదంటే 2బెడ్ రూంలు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వారితో మాట్లాడుతూ హైడ్రా బాధితులకు తాను ఆసరాగా నిలుస్తానని, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో మాట్లాడుతానని, అవసరమైతే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సైతం కల్సి సమస్యను ఇళ్లు తిరిగి వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## ఇద్దరు సిఎంలు వచ్చినా.. సమస్యలు తీరలేదు
### లక్ష్మాపూర్‌లో రైతుల 'ముఖాముఖి'లో కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇద్దరు ముఖ్యమంత్రులు ఈ ప్రాంతంలో పర్యటించిన ఈ ప్రాంత భూ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లో రైతులతో ముఖాముఖి నిర్వహించారు.గ్రామానికి నక్ష లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రైతుల భూములు పట్టాకు బదులు లావణి పట్టాగా భూములు రికార్డుల్లో నమోదయ్యాయని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు రావడం లేదని, పొలాలు అమ్ముకోవాలన్నాఆన్‌లైన్‌లో లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని వాపోయారు. కవితకుమెమోరాండం సమర్పించారు.కవిత మాట్లాడుతూ లక్ష్మాపూర్‌లో ఆగిన సిఎం కేసిఆర్ నక్ష లేదని తెలుసుకుని నక్ష చేయాలని అధికారులను ఆదేశించారు. అసెంబ్లీలో నక్ష లేని గ్రామాలపై మాజి కేసిఆర్ చర్చ చేశారు. అలాగే సిఎం రేవంత్‌రెడ్డి కూడ ఈ గ్రామంలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. రెండేళ్లయిన సమస్య పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. మనందరం ఏకమై భూ సమస్యపై పోరాటం చేద్దామని అన్నారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడే వారే మనకు కావాలి
### ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి




**ప్రజాపక్షం/వికారాబాద్ :** బిజెపి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని, బిజెపి అభ్యర్థులకు 10లక్షల రూపాయలు ఎంపి నిధులు కేటాయించడం జరుగుతుందని చేవేళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అదివారం వికారాబాద్ పట్టణ బీజేపీ జిల్లా కోకన్వీనర్ శ్రీధర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ గ్రామల అభివృద్ది బీజేపీతోనే సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిదులు నేరుగా అందజేసి అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ బలపర్చిన సర్పంచులను గేలిపిస్తే ఎంపి నిదుల నుండి 10లక్షలు కేటాయిస్తానని తెలిపారు. గ్రామాన్ని అన్ని విధల అభివృద్ధి చేస్తానన్న మంచి నాయకున్నే ఎన్నుకోవాలని సూచించారు. 6గ్యారెంటీ హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమయ్యిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతంఇస్తమని 17శాతం ఇవ్వడంతో కాం గ్రెస్ మోసం బయటపడింది అన్నారు. మహిళలకు ఇస్తామన్నా రూ. 2500, నిరుద్యోగబృతి పెన్షన్ పెంపు హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు అయిన పట్టించుకోవడం లేదన్నారు.బీజీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, మాజీ జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి, అసెంబ్లి కోఆర్డినేటర్ వడ్ల నందు, శ్రీధార్‌రెడ్డి, పాండుగౌడ్, సూచరితారెడ్డి, నరోత్తంరెడ్డి , విజయభాస్కర్,శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరించాలి
### డిసిసి అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరించటమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని మేడ్చల్ జిల్లా డిసిసి ప్రసిడెంట్ వజ్రేష్‌యాదవ్ అన్నారు ఆదివారం కీసర మండలంలోని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 200వ జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగానే కాక సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన మహానీయుడని, ఆయన కలల భారతాన్ని నిర్మించటానికి యువత ముందుకు రావాలన్నారు. విద్య, సామాజిక చైతన్యం, హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై ఆయన సూచించిన మార్గదర్శకాలను ఆచరణలో తీసుకొని వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు రామారావు, రామిడి విజయరెడ్డి, జూపల్లి రవీందర్, నల్ల మధుసుధన్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, చిక్కుడు రమేష్, దయానంద్ గౌడ్, మాజీ ఎంపిటిసిలు రమేష్ గుప్తా, జంగయ్య, కర్రె బాలమణి, సుమతి, అరుంధతి, కీసర గుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులు సాయిలు, ప్రవీణ్, శ్రీశైలం యాదవ్, సత్తిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, కృష్ణారెడ్డి, రాజు, మంచాల ప్రవీణ్, అభిలాష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఈశ్వరాచారి కుటుంబానికి మంత్రి పొన్నం పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల కొరకు ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారి కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో కలిసి పరామర్శించారు. సాయి ఈశ్వరాచారి మృతి బాధాకరమని, వారి కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## మొదటి విడత 7 మండలాల్లో

డిపిఒ సురేష్‌మోహన్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలో మూడు విడుతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 లను నిర్వహించుటకు నిర్ణయించనగా మొదటి విడత 7మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ)వి సురేష్ మోహన్ తెలిపారు. అందులో భాగంగా మొదటి విడుతగా జిల్లాలోని కొత్తూర్, నందిగామ, కొందుర్గ్, కేశంపేట్ ఫరూక్‌నగర్, శంషాబాద్, జిల్లెడ్ చౌదర్‌గూడ, ఫరూక్ నగర్, పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుపడం జరుగుతుందన్నారు. ఆయా మండలములలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుపుటకుగాను 1989 మంది అధికారులను పోలింగ్ ఆఫీసర్లు(పిఒ)లుగా నియమించి, వారికి గత 6 వ తేది రెండవ సారి ట్రైనింగ్ ఇవ్వడం జరిగినదని తెలిపారు. అదేవిధంగా ఈ ట్రైనింగ్‌నకు 348 పిఒలు గైర్హాజరు కావడం జరిగినదని, గైర్హాజరు అయిన 348 పిఒలకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి, షోకాజ్ నోటీస్ జారీ చేసి సంజాయిషీ కోరినట్లు పేర్కొన్నారు. గైర్హాజరు అయిన 348 పిఒలను, రెండవ విడుత ఎన్నికలు జరుపుటకు నియమించిన (2003) పిఒలకు ఈనెల 9న ట్రైనింగ్ ఇవ్వడానికి నిర్ణయించడం జరిగినదన్నారు. ట్రైనింగ్‌కు గతంలో గైర్హాజరు అయిన 348 పిఒలు కూడా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినట్లు డిపిఓ సురేష్‌మోహన్ పేర్కొన్నారు. హాజరు కానీ పిఒలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పంచాయతి అధికారి సురేష్ మోహన్ స్పష్టం చేశారు.

## పల్లె సీమలను అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ విఫలం : ఎమ్మెల్సీ నవీన్



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** పల్లె సీమలను అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్, కందివనం, పీర్లగూడ గ్రామాల్లో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ప్రచారం చేశారు. పీర్లగూడలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ఎమ్మెల్సీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డి సారధ్యంలో గ్రామీణ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి సాధించాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండెళ్లు గడుస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వివరించారు. పదేళ్ల కాలంలో పల్లె సీమల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్నామని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు భీమా పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ వంటి ఎన్నో పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండుళ్ళు అవుతున్న ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వివరించారు. తమ మద్దతుతో పోటీ చేస్తున్న పీర్లగూడ సర్పంచ్ అభ్యర్థి కుర్షీద్ భేగం, కందివనం అభ్యర్థి జెమినిబాయ్, రాయికల్ అభ్యర్థి మామిడిపల్లి సురేఖను గెలిపించేందుకు ప్రజలందరు కృషి చేయాలని కోరారు. వారికి కేటాయించిన గుర్తుపై ఓట్లు వేసి గ్రామాభివృద్ధికి బాటలు వేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని శంకర్‌పల్లి ఎంపిడిఒ వెంకయ్యగౌడ్ కోరారు. ఆదివారం శంకర్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ పదవికి పోటీచేస్తున్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియామవళి ప్రకారం గ్రామానికి పంచాయతీ సర్పంచే పునాది లాంటిదని అన్నారు. ప్రతి సర్పంచ్ అభ్యర్థి ఒక ఏజెంటును నియమించుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రచార సమయంలో గుర్తింపు కార్డును ఇస్తామని వాహనాల అనుమతిని తహసీల్దార్ లేదా సిఐలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మోకిలా సిఐ వీరబాబు మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలకుండా ఎన్నికలు జరుపుకోవాలన్నారు. ఎవరు కూడా ఓటర్లను బెదిరించడం కానీ భయపెట్టడం అని చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచార రథం అవసరం అనుకుంటే తహసీల్దారు నుండి పర్మిషన్ తీసుకోవాలన్నారు.

## కంటి వైద్యశిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేదల కోసం చేపట్టిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఆదివారం షాద్‌నగర్‌లో హాజీ సయ్యద్ హుస్సేన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ప్యారడైస్ గార్డెన్ కాలనీలో మస్జిద్‌ఎసయ్యద్ హుస్సేన్‌లో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా వృద్ధులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం అభినందనీయమన్నారు. ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు ఇవ్వడంతోపాటు కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ ఇబ్రహీం గ్రూపు స్టాఫ్, పట్టణ ప్రముఖులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## 15 నుంచి ఎఎస్‌టి సూపర్ సింగర్స్ పోటీలు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అగర్వాల్ సమాజ్ తెలంగాణ ఎఎస్‌టి సూపర్ సింగర్స్ పోటీలు ఈ నెల 15 నుంచి 22 వరకు బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించనున్నట్టు అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా తెలిపారు. ఈ మేరకు సింగర్స్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బషీర్‌బాగ్‌లో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ ఉపాధ్యక్షులు రూపేశ్ అగర్వాల్, గౌరవమంత్రి వికాస్ కుమార్ కేషన్, కార్యక్రమ చైర్మన్ డా.దిలీప్ పసారి, నిర్వాహక కమిటీ సభ్యులు మహేంద్ర అగర్వాల్, దినేశ్ చంద్ర అగర్వాల్, అశోక్ జిందాల్, పంకజ్ సంఘి, ముఖేశ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మహేష్ బ్యాంక్ ఎన్నికలు

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మను చౌదరి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎపి మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు ఎలాంటి సంఘటనలు జరగకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించటం జరిగిందని ఇన్‌చార్జి కలెక్టర్ మను చౌదరి తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం కమలా నెహ్రూ పాలిటెక్నిక్, సరోజిని నాయుడు వనిత మహా విద్యాలయలలో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారితో కలిసి సందర్శించారు. పోలింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూతులలో విధులు నిర్వహిస్తున్న అధికారులతో పోలింగ్ జరుగుతున్న ప్రక్రియ గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నికల అధికారులకు ఆయన సూచించారు. హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లతో పాటు ఇతర రాష్ట్రాల్లోని మొత్తం 78 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా 36.16 శాతం పోలింగ్ నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే మొత్తం 78 కేంద్రాలలో 37142 మంది ఓటర్లకు గాను మహిళా ఓటర్లు 5087, పురుష ఓటర్లు 8342 మొత్తం 13429 ఓట్లు నమోదు అయినట్లు వెల్లడించారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసి అదనపు డిసిపి ఆనంద్, డిసిపి శిల్పవల్లి, ఎసిపిలు సంజయ్ కుమార్, ప్రవీణ్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్‌డిఒ రామకృష్ణ, లా ఆఫీసర్ శ్రీధర్, డిసిఒ ప్రసన్న, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, నాంపల్లి తహసీల్దార్ నయాముద్దీన్‌తో రెవెన్యూ, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 9న ఘనంగా విజయ్ దివస్ జరుపుకోవాలి..

బిఆర్‌ఎస్ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కీలక మలుపు తిరిగిన డిసెంబర్ 9వ తేదీని 'విజయ్ దివస్'గా ఘనంగా నిర్వహించుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9 చరిత్రలో నిలిచిపోయే రోజని, కెసిఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. నవంబర్ 29న 'దీక్షా దివస్'ను విజయవంతం చేసినట్లుగానే కెసిఆర్ 11 రోజుల దీక్ష ఫలించిన డిసెంబర్ 9ని విజయం సాధించిన రోజుగా 'విజయ్ దివస్' పేరుతో పండుగలా జరుపుకోవాలన్నారు.

## 'లిడ్‌క్యాప్ భూములను పరిరక్షించాలి'




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** లిడ్‌క్యాప్ (చర్మ పరిశ్రమ) భూములను పరిరక్షించాలని తెలంగాణ లెదర్ ఆర్టిజన్స్ కోఆపరేటివ్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు పల్లెల వీరస్వామి, ప్రధానకార్యదర్శి మొలుగు రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లిడ్‌క్యాప్ (టిజిఎల్‌ఐపిసి)ని పరిశ్రమగా గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.12వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ మేరకు సొసైటీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిజిఎల్‌ఐపిసి ఎండి శ్రీనివాస్ నాయక్‌ను తొలగించి, కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు. లిడ్‌క్యాప్ పునరుద్ధరణకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సొసైటీ సలహాదారులు డా.ఆరెపల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు హామీల్పూర్ రవీందర్, చిట్యాల మొగిలి, జన్నె కొండయ్య, కోశాధికారి బెజ్జంకి రాంబాబు, సంయుక్త కార్యదర్శి ఓం ప్రకాశ్, మడిపల్లి రమేశ్, జాన్‌దర్శనం, గుమ్మడి సతీశ్ వివిధ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'వికసిత్ భారత్' ప్రధాని మోదీకే సాధ్యం

పార్లమెంట్ సభ్యుడు ఆర్.కృష్ణయ్య




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్థిక శ్రేయస్సు, పారిశ్రామిక, సామాజిక పురోగతి, పర్యావరణ స్థిరత్వంతో ప్రభావవంతమైన పాలన కొనసాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కె శక్తివంతమైన వికసిత్ భారత్ 2047ను నిర్మించడం సాధ్యమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, పిజిఆర్ ఆర్‌సిఇడి ఆడిటోరియంలో విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.హరిచరణ్ అధ్యక్షత వహించగా ఆర్.కృష్ణయ్య తోపాటు రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.వి.బాలకిష్టరెడ్డి, కర్ణాటక కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.బట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి అమర్‌సింగ్ థిలావత్, ప్రముఖ న్యాయవాది కొండా లక్ష్మి కాంత్ రెడ్డి, సామజికవేత్త డా.డి.రాజ్ కుమార్ జాదవ్ తదితరులు వేదికపై ఆసీనులైనారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ పేదరికం నిర్మూలనతోపాటు పౌరులకు మెరుగైన జీవన నాణ్యతను నిర్ధారించడానికి కీలకమైన సామాజిక అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి వికసిత్ భారత్ 2047 తోడ్పడుతుందని, విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ కూడా వికసిత్ భారత్ 2047 సాధించడానికి తమ వంతు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వి.బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగమే మనకు అత్యున్నతం అని, దానికి అనుగుణంగానే పారిశ్రామిక, ఆర్థిక ప్రగతి, మెరుగైన విద్య, ఆరోగ్య భారతం కోసం ప్రణాళికలు రూపొందించి, కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డా.పుట్ట పాండు రంగయ్య, జి.విజయ హరి చరణ్, రాజేందర్ నల్లారి పాల్గొన్నారు.

## 'గ్లోబల్ సమ్మిట్'ను స్వాగతిస్తున్నాం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 'గ్లోబల్ సమ్మిట్' కార్యక్రమాన్ని బిజెపి పక్షాన స్వాగతిస్తున్నామని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు తెలిపారు. సోమవారం జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హాజరవుతారని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 'గ్లోబల్ సమ్మిట్' విజయవంతం కావాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని బిజెపి ఆకాంక్షిస్తుందని రామచంద్రరావు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అన్ని రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని రామచందర్ రావు తెలిపారు.

## ప్రజల ఆశీర్వాదంతో వారికి మేలు చేయడంలో విజయం సాధిస్తా : కల్వకుంట కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'నా బాట పూల బాట కాదు.. ముళ్ల బాటనే, అయినప్పటికీ ప్రజల ఆశీర్వాదంతో వారికి మేలు చేయడంలో విజయం సాధిస్తా' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ అలియాబాద్‌లో ఆదివారం జరిగిన 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం తాను చేసిన కృషిని, భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. 'నా బాట పూల బాట కాదు, ముళ్ల బాటనే. అయినా సరే మీ ఆశీర్వాదంతో ప్రజలకు మేలు చేయటంలో సక్సెస్ అవుతాననే నమ్ముతున్నాను.' అని అన్నారు. జాగృతి సంస్థ పెట్టి 19 ఏళ్లు అవుతోందని గుర్తు చేశారు. ఆ నాటి నుంచి కాళ్లకు బలపం కట్టుకొని, నెత్తి మీద బతుకమ్మ ఎత్తుకొని తిరిగానని, తెలంగాణ ఎందుకు తెచ్చుకోవాలన్నది ఊరూర చెప్పుకుంటూ తిరిగానని కవిత గుర్తు చేసుకున్నారు. తాను బిఆర్‌ఎస్ కోసం కూడా పనిచేశానని, కానీ తనను బిఆర్‌ఎస్ నుంచి తీసేశారని తెలిపారు. పార్టీలో లేనప్పటికీ, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఉన్నానని కవిత స్పష్టం చేశారు. సమస్యల కోసమే 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా తిరుగుతున్నామని, ఎక్కడికక్కడ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు పోతున్నామని వివరించారు. 'మేము అడుగుతుంటే అక్కడ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అడిగేటోళ్లు ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయి', అని కవిత అన్నారు. అడిగేటోళ్లంతా కూడా ఎన్నికల్లో బిజీబిజీగా ఉన్నారని, కానీ తాము మాత్రం ఓట్ల కోసం కాకుండా, మీ సమస్యలు వినేందుకే వచ్చానని తెలిపారు.

## ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు



తెలంగాణ పొలిటికల్ జెఎసి చైర్మన్ నరాల సత్యనారాయణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ప్రజా సమస్యలపై తెలంగాణ పొలిటికల్ జెఎసి రాజీలేని పోరాటాలు చేస్తుందని రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ పోలిటికల్ జెఎసి సమావేశంలో సత్యనారాయణ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రజలే మా ధైర్యంతో ముందుకెళ్తామన్నారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు, బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడుతామన్నారు. జెఎసి చైర్మన్‌గా సత్యనారాయణతోపాటు వైస్‌చైర్మన్‌గా ధారవత్ గణేశ్ నాయక్, వట్టం ఉపేందర్, అంగోతు రాంబాబు, సెక్రటరీ జనరల్‌గా బత్తుల సోమయ్య, ప్రధానకార్యదర్శిగా బానోతు హుస్సేన్ నాయక్, పూనెం శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా శంకర్‌గౌడ్, అనంతుల మధు, రాష్ట్ర కార్యదర్శులుగా తుల్జా రెడ్డి , పాలకుర్తి కృష్ణ, సంగిశెట్టి క్రిష్టాఫర్, మహిళా కార్యదర్శులుగా కంచర్ల మంజూష, కందుకూరి శ్వేత,సింగరాజు శ్యామల, సభ్యులుగా మాలోతు రామన్న నాయక్, తునికి పాటి చారి, సంతోష్‌నాయక్, సత్యంగౌడ్ నియమితులైనట్టు సత్యనారాయణ తెలిపారు.

# అవకాశవాదులకు ఓటుతో బదులివ్వండి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్






**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొత్తూరు:** అవకాశవాద రాజకీయాలు చేస్తున్న వారికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ డివిజన్‌లోని కడియాల కుంట తండా, హాజిపల్లి, నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, వెంకమ్మగూడ, చేగూరు, కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్, గూడూరు, తీగాపూర్, అంతిరెడ్డిగూడ, నందిగామ మండల కేంద్రంలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలకు తక్షణమే స్పందించే వారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నుకోవాలన్నారు. గ్రామాలకు రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, విద్యుత్ దీపాలు వంటి సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు.

### కారును వీడి హస్తం గూటికి చేరిన నేతలు

రావిర్యాల గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రె స్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రం పల్లి రాజు, సర్పంచ్ అభ్యర్థి ధీమా నీలయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో చిట్యాల చంద్రయ్య, గవ్వల ఆంజనేయులు, అశోక్, కుమ్మరి గోపాల్, శివరాములు, యాదయ్య, షరీఫ్, తొండపల్లి రమేష్, మైసగళ్ల రమేష్, శేఖర్, నర్సింలు, జంగయ్య ఉన్నారు.

# రీల్

## 'అన్నగారు వస్తారు' ట్రైలర్ విడుదల



స్టార్ హీరో కార్తి నటిస్తున్న 'అన్నగారు వస్తారు' ఈ నెల 12న వరల్డ్ వైడ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. డైరెక్టర్ హరీశ్ శంకర్ సోషల్ మీడియా ద్వారా 'అన్నగారు వస్తారు' సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ కంప్లీట్ ఎంగేజింగ్‌గా ఉందని, థియేటర్స్‌లో సినిమా చూడాలనే క్యూరియాసిటీ క్రియేట్ చేసిందని హరీశ్ శంకర్ అప్రిషియేట్ చేస్తూ..'అన్నగారు వస్తారు' సినిమా టీమ్‌కు తన బెస్ట్ విశెస్ అందించారు.


## 'కామాఖ్య' ఫస్ట్ లుక్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న థ్రిల్లర్ సినిమా 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ ప్రయివేటు లిమిటెడ్ బ్యానర్‌పై వడ్డేపల్లి శ్రీవాణీ నాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ మంత్రి సీతక్క 'కామాఖ్య' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు




## పోస్ట్ ప్రొడక్షన్‌లో ది రైజ్ ఆఫ్ అశోక



'లూసియా' ఫేమ్ సతీష్ నినాసం హీరోగా, నిర్మాతగా భారీ ఎత్తున రూపొందిస్తున్న చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. ఈ మూవీని వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్ హౌస్ బ్యానర్ల మీద వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నినాసం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాకు వినోద్ వి ధోండలే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సతీష్ నినాసంకి జోడిగా 'కాంతార', 'తమ్ముడు' ఫేమ్ సప్తమి గౌడ నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన అన్ని పనుల్ని పూర్తి చేసుకుని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి.

## 25న 'శంబాలా' రిలీజ్



హీరో ఆది సాయి కుమార్ తాజా సినిమా శంబాలా. ఈ సినిమాకు ఎ మిస్టికల్ వరల్ అనేది ట్యాగ్ లైన్. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి కలిసి షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి పోస్టర్స్, వీడియోస్ వదిలి హైప్ పెంచేసిన టీమ్.. ఈ క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ఈ చిత్రానికి సంబంధించిన నైజాం హక్కులను భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకుంది. నైజంలో ఈ సినిమాను మైత్రి మూవీస్ విడుదల చేయనుంది. ఇక శంబాలా శాటిలైట్, డిజిటల్ హక్కుల విషయానికి వస్తే.. ప్రముఖ ఓటీటీ సంస్థ ఆహా ఈ చిత్రానికి స్ట్రీమింగ్ హక్కులను పొందగా, జీ నెట్వర్క్ శాటిలైట్ ప్రసార హక్కులను సొంతం చేసుకుంది.





## 9న 'ఉస్తాద్ భగత్ సింగ్' ఫస్ట్ సింగిల్ రిలీజ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు సంబంధించి ఫస్ట్ సింగిల్ సాంగ్ ఈనెల 9న విడుదల చేయనున్నారు. పవన్ కళ్యాణ్‌తో గబ్బర్ సింగ్ బ్లాక్ బస్టర్ తీసిన హరీష్ శంకర్ ఈసినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్న హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీత అందిస్తున్నారు. విశాల్ దద్లాని పాడిన పాటను విడుదల చెయ్యనున్నారు. ఆనంద్ సాయి ఈ సినిమాకు ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.మైత్రీ మూవీ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది.



## ఘంటసాల బయోపిక్ మరో శంకరాభరణం కావాలి

- తనికెళ్ళ భరణి

టాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు, తన విలక్షణమైన బాణీలతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఘంటసాల వేంకటేశ్వరరావు (ఘంటసాల) బయోపిక్ ఎంతో గ్రాండ్‌గా తెరకెక్కింది. సి.హెచ్. రామారావు దర్శకత్వంలో 'ఘంటసాల ది గ్రేట్' అనే టైటిల్‌తో 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంలో ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని, ఆయన లైఫ్ లోని విభిన్న ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారు. అన్యుక్త్ రామ్ పిక్చర్స్ సమర్పణలో సి.హెచ్.ఫణి నిర్మాణ సారథ్యంలో సి.హెచ్. రామారావు రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కించారు. ఈ సినిమాలో కృష్ణ చైతన్య ఘంటసాలగా, మృదుల ఘంటసాల సావిత్రమ్మగా, చిన్న ఘంటసాలగా తులసి మూవీ ఫేమ్ అతులిత నటించగా.. సుమన్ ముఖ్యపాత్రను పోషించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఘంటసాల బయోపిక్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన నటుడు, రచయిత తనికెళ్ళ భరణి మాట్లాడుతూ.. ఒక మహానుభావుడి సినిమా ఇది. దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం మామూలు విషయం కాదు. చదలవాడ శ్రీనివాస్ చెప్పినట్లు ఇది మరో శంకరాభరణం అవుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. రేలంగి నరసింహారావు మాట్లాడుతూ ఘంటసాల ఓ లెజెండ్. ఆయన బయోపిక్ తీయాలనే ఆలోచన మీకు రావడం నిజంగా గొప్ప విషయం. ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నామన్నారు. ఘంటసాల పాత్ర పోషించిన నటుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ నేను సింగర్ని, యాక్టర్ని కాదు. ఘంటసాల పాటలు వింటూ పెరిగిన నాకు ఈ సినిమాలో నటించే అదృష్టం దక్కడం ఒక వరం. పాటలు పాడుకునే నన్ను రామారావు పట్టుబట్టి ఈ రోల్ చేయించారు. ఇప్పటికే సినిమా చూసిన వాళ్ళు ఈ సినిమా చాలా బాగుందని చెబుతున్నారు. తెలుగు సినిమా సంగీతానికి రెండు కళ్ళలో ఒకటి గంటసాల అయితే రెండోది బాలసుబ్రమణ్యం. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కూడా మూడేళ్ళ క్రితం ఆయన చేతుల మీదుగానే జరిగింది. దర్శకుడు సి.హెచ్. రామారావు మాట్లాడుతూ.. మహాగాయకుడు ఘంటసాల గురించి ఇప్పటి తరానికి తెలియాలనే తపనతో ఎంతో కష్టపడి ఈ సినిమా తీసాం. ఇంత గొప్ప సినిమా తీశాను అని సంతృప్తిగా ఉంది. ఈ సినిమా ప్రివ్యూ చూసి సినీ ప్రముఖులు అభినందిస్తుంటే ఎంతో ఆనందంగా అనిపించింది. భారతదేశ చరిత్రలోనే ఒక గాయకుడి బయోపిక్ రావడం ఇదే ప్రథమం. ఆ ఖ్యాతి ఘంటసాలకె దక్కింది. అది తీసే అదృష్టం నాకు దక్కింది అని అన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. ఘంటసాల గురించి ఎంత చెప్పినా తక్కువే. స్నేహంలో గాని, ఆప్యాయతలో గాని ఆయన్ను మించిన వారు లేరు. ఆయన పోయిన రోజు ఎంతో బాధపడ్డాం. సి.హెచ్. రామారావు ఈ సినిమా తీయడం నిజంగా ఓ దైర్యం. ఓ సదుద్దేశంతో సినిమా తీశారు కాబట్టి మీరు ఈ సినిమా కష్టాలు అధిగమించి విజయం సాధిస్తారు అని భావిస్తున్నా అన్నారు. ఈ సినిమాకు మొదటి టికెట్ ఒక లక్ష రూపాయలు కేటాయించి చదలవాడ శ్రీనివాస్ కొనడం విశేషం. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్, నిర్మాత శోభారాణి, పాటల రచయిత అనంత శ్రీరామ్, రచయిత జేకే భారవి, నిర్మాత చదలవాడ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## శశిరేఖా పాట రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, నాయన తార హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా వచ్చే జనవరి సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ కేవలం నెలరోజుల సమయం మాత్రమే ఉండటంతో ఈ సినిమా ప్రమోషన్ ఈవెంట్స్‌ను పెంచారని చెప్పవచ్చు. ఇంతకు ముందు మీసాలా పిల్ల అనే పాటను విడుదల చేసిన నిర్మాతలు ఇప్పుడు మరోపాటను రిలీజ్ చేశారు. 'శశిరేఖా ఓ మాట చెప్పాలి చెప్పక ఫీలుకాక.. ఓ ప్రసాదు మొహమాటం లేకుండా చెప్పేసెయ్ ఏమి కాదు' అనే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటను గేయరచయిత అనంత్ శ్రీరామ్ రాయగా, సంగీత దర్శకుడు భీమ్స్, గాయని మధుప్రియా ఈ పాటను ఆలపించారు.

## ఈనెల 25న ఛాంపియన్





80వ దశకంలో తన నటనతో ప్రేక్షకులను అలరించిన నందమూరి కల్యాణ్ చక్రవర్తి సుమారు ముప్పై అయిదేళ్ల తరువాత తిరిగి తెరపై కనిపించారు. చిరంజీవి నటించిన లంకేశ్వరుడు సినిమాలో ప్రత్యేక పాత్రను పోషించిన కళ్యాణ్ చక్రవర్తి ఆ తరువాత సినిమాల జోలికి వెళ్ళలేదు. కాని ఇప్పుడు మ్ము అయిదేళ్ల తరువాత ఛాంపియన్ అనే సినిమాలో నటించారు. ఈ కథలోని పాత్ర నచ్చడంతో ఈ సినిమా చేసినట్టు స్వప్న సినిమా యాజమాన్యం ప్రకటించింది. స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ కొత్తదనం ఉన్న కథలకు ప్రాధాన్యమిస్తూ, విభిన్నమైన కథాంశాలు, అద్భుతమైన క్రియేటివ్, కాస్టింగ్ సెలెక్షన్స్‌తో ముందుకు సాగుతోంది. వారి తాజా చిత్రం 'ఛాంపియన్' జీ స్టూడియోస్ సమర్పణలో రూపొందుతున్న పీరియడ్ స్పోర్ట్స్ డ్రామా. అనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిమ్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో కూడా స్వప్న సినిమాస్ తమ ప్రత్యేకతని కొనసాగిస్తోంది. ఛాంపియన్ ఈ క్రిస్మస్‌కి విడుదల కానుంది.

# కష్టాలు ఉంటేనే నిలదొక్కుకొని.. నిచ్చెన మెట్లు ఎక్కగలుగుతాం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కష్టాలు ఉంటేనే నిలదొక్కుకొని, నిచ్చెన మెట్లు ఎక్కగలుగుతామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి అన్నారు. హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యక్షుడు ములుగు రాజేశ్వర్ రావు రచించిన 'నేను బహువచనం', (ఆత్మకథ), 'అధినాయక జయహే' (కవితాసంకలనం) పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా (ఉమ్మడి ఎపి) రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు రచించిన పుస్తకాలను మోహన్ కందా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షులు దాసు కేశవరావు అధ్యతక్ష వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజంపై ఆత్మకథలు రాస్తున్నారని, చదువుతున్నారని అన్నారు. వినయ్ కుమార్, రాజేశ్వర్ రావులు తనకు 40 ఏళ్లుగా తెలుసని, వారు కష్టాలు ఎదుర్కొని నిలదొక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుత జర్నలిజంలో కొంత పరిస్థితి మెరుగైందని, గతంలో కంటే భిన్నంగా ఉందని అన్నారు. రాజేశ్వర్ రావు ఇన్ని కష్టాలు ఎదుర్కున్నారని తెలియదన్నారు. రాజేశ్వర్ రావు రాసిన ఆత్మకథ నవల మాదిరిగానే ఉందన్నారు. పుస్తకంలో 74వ పేజీ తనకు బాగా నచ్చిందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉన్నత కుటుంబం నుంచే వచ్చిన రాజేశ్వర్ రావు కష్టాల పాలయ్యారన్నారు. రాజేశ్వర్ రావు ఆత్మకథ చదివితే నూతన తరం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. జర్నలిజం సామాజిక దృక్పథం, జర్నలిజం సామాజిక ఉన్నతికి పాటు పడాల్సి ఉంటుందన్నారు. పత్రిక రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్‌గా రాజ్యాంగంలో పొందుపర్చాలని అనేక మంది పట్టు బట్టారని, కానీ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ మాత్రం అందుకు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రజల తరపున పనిచేయడానికి పత్రిక రంగం ఉండాలని పట్టుబట్టారన్నారు. ముందుగానే ఊహించి అంబేడ్కర్ పత్రిక రంగాన్ని రాజ్యాంగంలో బంధించకుండా అడ్డుకున్నారని ఆయన చెప్పారు. తెలంగాణ మీడియా అకాడమీ తరపున 12 మంది ప్రముఖ జర్నలిస్టుల పుస్తకాలు ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. పత్రికలకు సంబంధించిన సుమారు ఐదు లక్షల పేజీలను ఆన్‌లైన్‌లో చూసేందుకు అకాడమీ ఏర్పాట్లు చేస్తుందని శ్రీనివాస రెడ్డి చెప్పారు. రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా మాట్లాడుతూ సమాజంలో మీడియాది కీలక పాత్ర అని, అలాంటి మీడియా పరిపక్వత, వివేకం, గౌరవం, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే మరింత విలువ పెరుగుతుందని అన్నారు. సోషల్ మీడియి వచ్చిన తర్వాత మరింత ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకంలో 'ఉన్నది ఉన్నట్టుగా, లేనిది లేనట్టుగా' పొందుపర్చినట్టు వివరించారని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ వినయ్ కుమార్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు ఆత్మకథ పుస్తకం చదివితే ఆకలిరాజ్యం, సాగరసాగమం సినీమాలు చూసినట్టుగా ఉందన్నారు. రాజేశ్వర్ రావు జీవితం సినిమా అవుతుందన్నారు. రాజేశ్వర్ రావు రాసిన పుస్తకం చదివితే యువ జర్నలిస్టులు నేర్చుకోవచ్చని అన్నారు. కేంద్ర మాజీ సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు రాసిన పుస్తకం అందరు చదువుకోవాల్సిన పుస్తకమని సూచించారు. ఆయన అన్ని రకాల రచనలు చేశారని అన్నారు. పుస్తక పరిచయాన్ని వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యాక్షులు టి.ఉదయవర్లు చేయగా, ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు జి.వల్లీశ్వర్, ఎమ్మెస్కో సంపాదకులు డి.చంద్రశేఖర్ రెడ్డి, సంఘం కార్యదర్శి కె.లక్ష్మ ణ రావు పాల్గొన్నారు.

## పిటిఓ పెట్రోల్ బంక్, నూతన భవనానికి డిజిపి శంకుస్థాపన



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని పోలీస్ రవాణా సంస్థ (పిటిఒ) ప్రాంగణంలో అత్యాధునిక రిటైల్ పెట్రోల్ బంకును, సిపిఎల్ అంబర్‌పేట్ గ్రౌండ్స్‌లో నూతన పిటిఒ భవన నిర్మాణానికి డిజిపి బి.శివధర్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. 21 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ అధునాతన భవనంలో వర్క్‌షాప్‌లు, డయాగ్నస్టిక్ సిస్టమ్స్, మెయింటెనెన్స్ బ్లాక్‌లు, ఆపరేషన్ జోన్‌లు, ప్రత్యేక శిక్షణా మౌలిక సదుపాయాలు ఉంటాయి. అలాగే జాతీయ రహదారి 44 ఆనుకుని 2025 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రిటైల్ పెట్రోల్ బంక్ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు కార్యక్రమాలలో పోలీస్ రవాణా సంస్థ ఐజిపిలు, టిజిపిహెచ్‌సి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రమేష్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిఎం అబద్ధాలు చెప్పటం మానుకోవాలి

మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : కాళేశ్వరం కూలిందని కెసిఆర్, హరీష్‌రావులను బండకేసి కొట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని.. రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు రా.. రంగనాయక్‌సాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తా.. నీవు మునుగుతావో.. తెలుతావో చూస్తామని.. రంగనాయక్‌సాగర్‌లో నీళ్లుండి నీవు మునిగితే కాళేశ్వరం ఉన్నట్లు.. నువ్వు తేలితే కాళేశ్వరం కూలినట్లు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్ అయ్యారు. సిఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు, చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం మాజీమంత్రి హరీష్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి మాది రైతుప్రభుత్వం అంటున్నారని కాని చిన్నకోడురులో 450 రైతులకు ధాన్యం డబ్బులు 59 రోజుల నుండి రూ.45 కోట్లు రావాలని చెపుతున్నారన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండురోజుల్లో డబ్బులు వేస్తామని చెప్పారని.. కానీ 50 రోజులైన డబ్బులు రావటంలేదన్నారు. యాసంగి పెట్టుబడి కోసం రైతులు మద్దతు ధర తుక్కువ ధరకు అమ్ముతున్నారన్నారు. కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్నకు బకాయిపడిన రూ.450 కోట్లు విడుదల చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కాముని శ్రీనివాస్, పోచపోయిన శ్రీహరి. కీసర పాపయ్య, జంగిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇండిగో' రీఫండ్

(మూడవ పేజీ తరువాయి)

సాయంత్రం నాటికి పూర్తి చేయాలని, లగేజీని రెండు రోజుల్లో డెలివరీ అయ్యేలా చూడాలని కేంద్రం శనివారం ఇండిగోను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఇండిగో ఇప్పటికే ప్రకటించింది. సంక్షోభం నుంచి బయటపడటంతో పాటు సర్వీసుల పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకునేందుకు.. సిఇఒ, బోర్డు సభ్యులు కలిసి క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (సిఎంజి)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. విమాన కార్యకలాపాల పునరుద్ధరణ విషయంలో దశలవారీగా పుంజుకుంటున్నట్లు ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఆదివారం పరిస్థితి మరింత మెరుగుపడిందని, 1650 విమానాలు నడుపుతున్నట్లు వెల్లడించారు. సంస్థ ఆన్ టైమ్ పెర్ఫార్మెన్స్ నేడు 75 శాతంగా ఉండే అవకాశం ఉందని సిబ్బందికి పంపిన వీడియో సందేశంలో చెప్పారు. 138 విమానాశ్రయాల్లో 137 చోట్ల సేవలందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. పరిస్థితులను చక్కదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకున్నట్లు పౌరవిమానయానశాఖ సైతం స్పష్టం చేసింది.

## డ్రోన్‌దాడి (మూడవ పేజీ తరువాయి)

బలి చేయవద్దని, వారు ఎప్పటికీ ఈ అంత్యుద్ధాలకు బాధ్యులు కాదని, వారిని పణంగా పెట్టి హింస సృష్టించవద్దని హెచ్చరించింది. తక్షణం అందరూ ఈ అంతర్యుద్ధ వ్యవహారంలో జోక్యం చేసుకుని యుద్ధాన్ని నివారించాలని కోరింది. కోర్డోఫాన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వ సైన్యాలతో ఆర్ఎస్ఎఫ్ తీవ్ర పోరాటం చేస్తోంది. రాజధాని ఖార్టూమ్, డార్ఫర్ మధ్యలో ఈ కోర్డోఫాన్ ప్రాంతం ఉంది. ఉత్తర కోర్డోఫాన్, దక్షిణ కోర్డోఫాన్,పశ్చిమ కోర్డోఫాన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి సైన్యం–ఆర్ఎస్ఎఫ్ మధ్య తీవ్ర యుద్ధం జరుగుతోంది. కోర్డోఫాన్‌లో 80 లక్షలమంది ప్రజలు జీవిస్తున్నారు. ఈ దుర్ఘటనపై ఆర్ఎస్ఎఫ్ నుండి ఎలాంటి తక్షణ ప్రతిస్పందన రాలేదు. గడచిన శుక్రవారంనాడు డార్ఫర్‌లో ఒక మార్కెట్‌పై సైన్యం దాడులు చేసిందని ఆర్ఎస్ఎఫ్ విమర్శించింది. 2023 ఏప్రిల్ నుండి సూడాన్‌లో రెండు సైనిక గ్రూపులమధ్య అంతర్యుద్ధం జరుగుతోంది. ఈ రెండు గ్రూపుల నాయకులు గతంలో ఒకే గ్రూపుగా ఉంటూ సూడాన్ పాలన చేశారు. తర్వాత విభేదాలవల్ల అంతర్యుద్ధం మొదలైంది

## ప్రత్యేక చర్చ

(మూడవ పేజీ తరువాయి)

చేయనున్నారు. ఈ ప్రత్యేక చర్చను ముగించే ప్రసంగాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేస్తారు. వందేమాతరంపై లోక్‌సభలో చర్చ కోసం మొత్తం 10 గంటల సమయాన్ని కేటాయించారు. ఇందులో 3 గంటల సమయాన్ని అధికార ఎన్‌డిఎ కూటమికి కేటాయించడం గమనార్హం. లోక్‌సభలో ప్రత్యేక చర్చ సందర్భంగా వందేమాతరంతో ముడిపడిన కీలకమైన చారిత్రక విశేషాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. వందేమాతరంపై లోక్‌సభలో జరిగే ప్రత్యేక చర్చలో కాంగ్రెస్ తరపున 8 మంది ఎంపిలు ప్రసంగించనున్నారు. ఈ జాబితాలో గౌరవ్ గొగోయ్ (విపక్ష ఉపనేత), ప్రియాంకాగాంధీ, దీపేందర్ హుడా, బిమల్ అకోయిజం, ప్రణితి షిండే, ప్రశాంత్ పదోల్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జ్యోత్స్న మహంత్ ఉన్నారు.

## రాజ్యసభలోనూ వందేమాతరంపై చర్చ

వందేమాతరంపై మంగళవారం రాజ్యసభలోనూ ప్రత్యేక చర్చ జరగనుంది. ఈ చర్చను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఆయన తర్వాత కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, రాజ్యసభ అధికార పక్షం నేత జెపి నడ్డా ప్రసంగిస్తారు. డిసెంబరు 1న మొదలైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 19 వరకు కొనసాగుతాయి. వందేమాతరం 150 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆ జాతీయ గేయం స్మారకోత్సవాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ నవంబరు 7న ఢిల్లీలో ప్రారంభించారు. బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర గేయం తొలిసారిగా 1875 సంవత్సరం నవంబరు 7న 'బంగ దర్శన్' అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. అనంతరం ఆ గేయాన్ని తన నవల 'ఆనంద్ మఠ్'లో బంకిమ్ చంద్ర ఛటర్జీ చేర్చారు. ఈ నవల 1882లో ప్రచురితమైంది. వందేమాతరం గేయాన్ని సంగీతపరంగా స్వరపర్చిన వ్యక్తి జాదూనాథ్ భట్టాచార్య. 1896లో కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం వేదికగా తొలిసారిగా వందేమాతర గేయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారు. దీంతో ఆ గేయానికి ప్రజల్లో క్రేజ్ పెరిగింది. తదుపరిగా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం కీలక భాగంగా మారింది. దేశ ప్రజల్లో దేశభక్తిని రగిల్చే మహత్తర అస్త్రంగా అవతరించింది.

### మంగళ, బుధవారాల్లో చర్చించే కీలక అంశాలు ఇవే!

మంగళ, బుధవారాల్లో లోక్‌సభలో పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. ఈ జాబితాలో ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వంటి టాపిక్స్ ఉన్నాయి. ఎన్నికల సంస్కరణలపై బుధ, గురువారాల్లో రాజ్యసభలో చర్చ జరగనుంది. బిహార్‌లో సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన ఎస్ఐఆర్‌పై విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు ప్రధానంగా మాట్లాడే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియలో తాము గుర్తించిన లోపాలను లోక్‌సభలో ప్రస్తావించే ఛాన్స్ ఉంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com